వానాలి
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
fb.com/vaartha
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
23-1-2025 గురువారం సంపుటి: 30 సంచిక: 355 పేజీలు: 8+16 వెల: 6.50

ట్రంప్ ఆర్డర్లపై 22 రాష్ట్రాల న్యాయపోరాటం
కోటాలో మరో ఇద్దరు జెఇఇ విద్యార్థుల ఆత్మహత్య
5



మహారాష్ట్రలోని జల్‌గావ్‌లోని పరండా స్టేషన్ వద్ద బుధవారం జరిగిన రైలుప్రమాదం దృశ్యం

## పట్టాలపై ఘోరం

### పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు వ్యాపించినట్లు వదంతులు..

### దూకేసిన ప్రయాణికులపై నుంచి దూసుకెళ్లిన కర్ణాటక ఎక్స్‌ప్రెస్

### 12 మంది దుర్మరణం.. పలువురికి తీవ్ర గాయాలు

**జల్‌గావ్,(మహారాష్ట్ర), జనవరి 22:** మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాలో ఘోరమైన రైలుప్రమాదం జరిగింది. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణీకులపైనుంచి మరో రైలు దూసుకెళ్లడంతో ఇప్పటివరకూ 12 మందిచనిపోయినట్లు రైల్వే శాఖప్రకటించింది. మరో 40 మందికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా మృతుల సంఖ్య మరింతపెరిగే అవకాశం ఉంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం >>2

### రూ.45,500 కోట్ల పెట్టుబడులతో

# భారీ సోలార్ ప్రాజెక్టులు

### రాష్ట్రంలో మూడు చోట్ల

### నెలకొల్పనున్న సన్ పెట్రో కెమికల్స్

### దావోస్ వేదికపై సరికొత్త రికార్డు

### పెట్టుబడుల చరిత్రలో ఇదే అత్యధికం: సిఎం రేవంత్

### గ్రీన్ ఎనర్జీలో కీలకం: సంస్థ ఎండి దిలీప్ సాంఘ్వి



బుధవారం దావోస్‌లో సన్‌పెట్రో కెమికల్స్‌తో కుదిరిన ఎంఒయు. చిత్రంలో సిఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 22:** దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వేదికపై తెలంగాణ మరో కొత్త రికార్డు నమోదు చేసింది. గతంలో ఎన్నడూ లేనంత భారీ పెట్టుబడులను సమీకరించింది. దేశంలో ఇంధన రంగంలో పేరొందిన సంస్థ సన్ పెట్రో కెమికల్స్ రాష్ట్రంలో రూ.45,500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలో భారీ పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ ప్రకటించింది. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందంపై (ఎంవోయూ) సంతకం చేసింది. నాగర్ కర్నూలు, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో మూడు చోట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టులను నెలకొల్పనుంది. ఈ మూడు ప్రాజెక్టుల మొత్తం ఇంధన సామర్థం 3,400 మెగావాట్లు. వీటికి 5,440 మెగావాట్ల సామర్థ్యముండే సోలార్ విద్యుత్తు ప్లాంట్లను అనుసంధానం చేస్తుంది. ఈ ప్రాజెక్టుల నిర్మాణ దశలోనే దాదాపు 7,000 ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటివరకు దావోస్ >>2

## జనపనారకు 'మద్దతు' రూ.315 పెంపు

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** జనపనార రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 2025-26 వ్యవసాయ సీజన్‌కు సంబంధించి ముడి జనపనార (రా జూట్) కనీస మద్దతు ధరను పెంచుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) బుధవారం ఆమోదం తెలిపింది. ముడి జూట్ ఎంఎస్పీ మునుపటి మార్కెటింగ్ సీజన్ 2024-25 కంటే క్వింటాలుకు 315 రూపాయలు పెంచింది. 2025-26 సీజన్‌లో ముడి జనప నార (టీడీ-3 గ్రేడ్) ముడి జనపరాన కనీస మద్ధతు ధరను క్వింటాలుకు 5,650 రూపాయలుగా నిర్ణయించింది. ఈ నిర్ణయం రైతులకు 66.8 శాతం రాబడిని ఇస్తుందని కేంద్రం పేర్కొంది. 2014-15 నుండి 2024-25 మధ్య కాలంలో జనపనార సాగు చేసే రైతులకు చెల్లించిన ఎంఎస్పీ మొత్తం 1,300 కోట్ల రూపాయి కాగా, 2004-05 నుంచి 2013-14 మధ్యకాలంలో చెల్లించిన మొత్తం 441 కోట్ల రూపాయలుగా ఉంది. కాగా 40 లక్షల వ్యవసాయ కుటుంబాల జీవనోపాధి ప్రత్యక్షంగా లేదాపరోక్షంగా జూట్ పరిశ్రమపై ఆధారపడి ఉంది. దాదాపు 4 లక్షల మంది కార్మికులు జూట్ మిల్లుల్లో ప్రత్యక్ష ఉపాధిని >>2



ఘర్షణ పడిన వారిని బయటకు తీసుకువెళ్తున్న దృశ్యం

## గాంధీభవన్‌లో బాహాబాహీ

### బిఆర్ఎస్ నుంచి వచ్చిన నేతలకు పదవులపై ఇరు వర్గాల ఘర్షణ

### చొక్కాలు చింపుకొన్న పలువురు యువజన నేతలు

### వారిని చెదరగొట్టేందుకు పోలీసులు రంగప్రవేశం

**హైదరాబాద్,జనవరి 22,ప్రభాతవార్త:** గాంధీభవన్‌లో యూత్ క్రాంగ్రెస్ నేతల మధ్య బుధవారం సాయంత్రం గొడవ జరిగి కొట్టుకోవడంతో ఉద్రికత్త పరిస్థితి నెలకొంది. యూత్ కాంగ్రెస్ నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. ఆ తర్వాత రెండు పక్షాలు బాహాబాహీకి దిగారు. పార్టీలో పదవుల కోసం ఇరు వర్గాల నేతలు కొట్టుకున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారని కొత్తగూడెం కాంగ్రెస్ నేతలు ఆందోళనకు దిగారు. ఘర్షణకు దిగిన ఇరు వర్గాలను పోలీసులు చెదరగొట్టారు. ఇక రెండువర్గాల వారు వ్యతిరేకంగా నినాదాలు చేసుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలోని అగ్రనేతలు డిప్యూటి ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు రెండుగా చీలిపోయి దాడులు చేసుకున్నారు. జిల్లా యువజనకాంగ్రెస్ అధ్యక్షపదవిని ఆశించిన గడ్డంరాజశేఖర్ గాంధీభవన్‌లో కొత్తగా నియామకమైన అధ్యక్షుడి అనర్హతలు పేర్కొంటు ఫిర్యాదు ఇవ్వడానికి గాంధీభవన్‌లోకి వెళ్ళుతుండగా చీకటి కార్తీక్ అనుచరులు అడ్డుపడని వారిని లోనికి రానివ్వలేదు. రాజశేఖర్‌ను లోనికి తీసుకొని వెళ్ళేందుకు ప్రయత్నించిన భద్రాద్రి జిల్లా యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ సిద్దిరాల సుధీర్‌పై కార్తీక్ వర్గం దాడి చేయడంతో గలాట మొదలైంది. ఇరువర్గాలు గాంధీభవన్‌లో కిష్కిందకాండను సృష్టించారు. అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలకు చెదరగగొట్టారు. పొంగులేటి అనుచరుడిగా ప్రచారం జరుగుతోన్న 37ఏళ్ళు దాటిని చీటికటికార్తీక్‌కు యువజనకాంగ్రెస్ అధ్యక్షపదవి ఎట్లాకట్టబెట్టారని భట్టి అనుచరణగణం పేర్కొంటున్న యువజన కాంగ్రెస్ నేతలుతెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివశరణ్‌రెడ్డి నిలదీశారు. పదేళ్ళుగా ప్రతికూల వాతావర్ణంలో పార్టీ జెండా పట్టుకొని అనేక ప్రజాసమస్యలపై పోరాటం చేసి అధికారంలోకి తీసుకొస్తే సంవత్సరం క్రితం వరకు బిఆర్ఎస్‌లో ఉండి కాంగ్రెస్‌కు వలసవచ్చినవారికి ప్రధాన్యత ఇస్తారా అని భట్టి అనుచరణ యువతఆగ్రహం వ్యక్తంచేసింది. భద్రాద్రికొత్తగూడెం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గతనెలలోనే చీకటికార్తీక్ పేరును ప్రతిపాదించడంతో డిసిసి అధ్యక్షుడు పోడెం వీరయ్య కూడా పదేళ్ళు జెండా పట్టుకున్న కార్యకర్తలను గుర్తించాలని జెడ్ఆర్‌వో,పిఆర్‌వోలకు లేఖలు పంపారు. జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా గడ్డం రాజశేఖర్ కూడా 35 ఏళ్ళు దాటిలేరని వయోపరిమితి దాటినివారికి అదికాకుండా బిఆర్ఎస్ యూత్ వింగ్ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్‌గా మొన్నటి వరకు వ్యవహారించిన వ్యక్తికి ఏ విధంగా ఎంపిక చేస్తారని పార్టీ నియమావళిని ఎత్తిచూపుతు పదవులు దక్కని భట్టివర్గంగా భావించే యువకులు గాంధీభవన్‌లో నిలదీస్తున్నారు. అదే సమయంలో ప్రస్తుత అధ్యక్షుడు చీకటికార్తీక్‌వర్గం కూడా గాంధీభవన్‌లోకి >>2



### సిడబ్ల్యుసి సూచన మేరకే



## మూడు బ్యారేజీలు

### జస్టిస్ ఘోష్ విచారణలో తెలిపిన నీటిపారుదల నిపుణుడు వి. ప్రకాశ్

**హైదరాబాద్,జనవరి 22,ప్రభాతవార్త:** తుమ్మిడిహట్టి వద్ద వార్ధా, పెన్‌గంగాలు వి ఆకృతిలో కలుస్తున్న కారణంగా ఆప్రాంతంలో "స్విక్‌మెథడ్"లో బ్యారేజి నిర్మించాల్సి ఉంటుందని ఇది సాంకేతికంగా సాధ్యం కాదని భారతదేశంలో ఇలాంటి నిర్మాణాలు లేవని అందుకే వాప్కొ సలహామేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ మూడు బ్యారేజిలు నిర్మించాలని ఆనాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిర్ణయం తీసుకొన్నారని జస్టిస్ పిసిఘోష్ సమక్షంలో విట్‌నెస్ ఎగ్జామినేష్ సందర్భంగా నీటి పారుదల నిపుణులు వి.ప్రకాష్ వాగ్మూలం ఇచ్చారు. బుధవారం 101 సాక్షిగా హాజరైన వి ప్రకాష్ కమిషన్‌కు సపోర్ట్ చేయడానికి తాను 16 పేజిల అఫీడవిట్ ఇచ్చినట్లు ప్రకాష్ తెలిపారు. కమిషన్‌కు బయట వ్యక్తుల మద్దతు కోరుకోవడం లేదని రికార్డులు అధికారిక డాక్యుమెంట్స్ సహకారం ఉందని కమిషన్ స్పష్టం చేసింది. కమిషన్ ముందు రాజకీయ ఉపన్యాసాలు చేయొద్దని చురకలంటించినట్లు తెలుస్తోంది. మీ ఆలోచనలు అఫిడవిట్‌లో పెట్టారా అని కమిషన్ ప్రశ్నించగా, ప్రకాశ్ మాట్లాడుతూ లేదని సమాధానం ఇచ్చారు. అధికారికంగా రికార్డులు డాక్యుమెంట్స్ ఉంటే మాత్రమే మాట్లాడాలి, చెప్పాలని కమిషన్ ఖరాఖండిగా చెప్పినట్లు సమాచారం. గతంలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రకాష్ అఫిడవిట్ ఇచ్చారు. ప్రాణహిత చేవెళ్లను కాలేశ్వరం ప్రాజెక్టుగా ఎందుకు మార్చారని తుమ్మిడిహట్టి నుంచి ప్రాజెక్ట్‌ను మేడిగడ్డకు ఎందుకు మార్చారని కమిషన్ ప్రశ్నించగా ప్రజల డిమాండ్ నీటి లభ్యత మేరకే కాళేశ్వరం ప్రాజెక్ట నిర్మాణం జరిగిందని ప్రకాష్ తెలిపారు. 152 మీటర్ల ఎత్తున బ్యారేజి నిర్మాణంకు మహారాష్ట్రప్రభుత్వం ఒప్పుకోలేదని తెలిపారు. 148 మీటర్లఎత్తున నిర్మించినా అక్కడ వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం ముంపుకు గురి అయ్యే అవకాశం ఉందని పర్యావరణ అనుమతులు కూడా రావని తెలిసింది. సిడబ్ల్యుసి నీటిలభ్యత లేదని వేరే ఎక్కడైనా ప్రాజెక్టు ప్రతిపాదించాలని సూచించింది. సిడబ్ల్యుసి సూచనమేరకు ఆనాటి ముఖ్యమంత్రి లైడార్‌సర్వే ఆధారంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజిల నిర్మాణంకు మొగ్గు చూపారు. లైడార్‌తో సర్వేచేయించామని తెలిపారు. 142మీటర్ల ఎత్తులో బ్యారేజి కడితే అక్కడ 1.8టిఎంసిలుమాత్రమే నిలుపుకొనే అవకాశం ఉందని 44 టిఎంసిల నీటిని >>2

## 28న బిఆర్ఎస్ రైతు మహాధర్నాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి22:** నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ నెల 28న నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో రైతు ధర్నా నిర్వహించుకునేందుకు బీఆర్ఎస్ పార్టీకి కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రైతు ధర్నా నిర్వహించాలంటూ టైమ్ ఫిక్స్ చేసింది. ఈ బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, పలువురు నాయకులు హాజరు కానున్నారు.

### తెలంగాణకు నలుగురు

## అదనపు జడ్జిలు

### రాష్ట్రపతి ఆమోదంతో ఉత్తర్వులు జారీ



జస్టిస్ తిరుమల దేవి, జస్టిస్ రేణుక, జస్టిస్ నర్సింగ్ రావు, జస్టిస్ మధుసూదన్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి22:** తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తులు నియమితులయ్యారు. వీరిని నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము ఆమోదం మేరకు కేంద్ర న్యాయశాఖ జాయింట్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. జస్టిస్ తిరుమల దేవి ఈద అలియాస్ తిరుపతమ్మ వచ్చే ఏడాది (2026) జూన్ 1 వరకు, జస్టిస్ రేణుక యార, జస్టిస్ నర్సింగ్ రావు నందికొండ, జస్టిస్ మధుసూదన్ రావు బొబ్బిలి రామయ్య హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా రెండేళ్ల పాటు కొనసాగుతారని రాష్ట్రపతి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరు నలుగురు హైకోర్టులో శుక్రవారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు హైకోర్టు చీఫ్ జస్టిస్ గా జస్టిస్ సుజోయ్ పాల్ నియమితులైన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, ఏపీ హైకోర్టుకు కొత్తగా ఇద్దరు అడిషనల్ జడ్జిలను నియమించారు. ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా అవధానం హరిహరనాథ శర్మ, డాక్టర్ యడవల్లి లక్ష్మణరావులను నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర లా అండ్ జస్టిస్ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. అవధానం హరిహరనాథ శర్మ, యడవల్లి లక్ష్మణరావు >>2

## హైదరాబాద్‌లో ఎఐ డేటా సెంటర్ క్లస్టర్

### రూ.10 వేల కోట్ల పెట్టుబడులు

### దావోస్‌లో కుదిరిన ఎంఒయు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి22:** రాష్ట్రంలో పెట్టుబడుల కోసం తెలంగాణ రైజింగ్ బృందం దావోస్ ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో వరస భేటీలు, చర్చలు జరుపుతోంది. తెలంగాణలో అత్యాధునిక ఎఐ డేటాసెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ)పై సంతకం చేసింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా ఈ ఒప్పందం కుదిరింది. ఆర్టిఫిషియల్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఈ కంపెనీ రూ.10,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 400 మెగావాట్ల సామర్థంతో ఈ డేటా సెంటర్ నెలకొల్పుతుంది. ఈ ప్రాజెక్ట్ దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. ఈసమావేశం అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ డేటా సెంటర్ ఏర్పాటు మరో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఐటీ సేవల సామర్థ్యం పెరుగుతుందని, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని అన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటు తెలంగాణలో ఐటీ సేవల ప్రమాణాలు మరింత వృద్ధి సాధిస్తాయని కంట్రోల్ ఎస్ సీఈవో శ్రీధర్ పిన్నపురెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవటం గర్వంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సీఎల్ హైదరాబాద్‌లో కొత్త టెక్ సెంటర్‌ను ప్రారంభించనుంది. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి >>2

## డ్రోన్లతో మావోయిస్టుల 'వేట'!



### ఆ సమాచారంతోనే ఉధృతంగా కూంబింగ్

### అబూజ్‌మడ్‌పై పట్టుకు పోలీసులు గట్టి యత్నం



**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా ఛత్తీస్‌ఘడ్‌లో సాగుతున్న పోలీసుల కగార్ ఆపరేషన్‌లో ఇప్పుడు సరికొత్త అస్త్రం చేరింది. ఇది సాదాసీదా అస్త్రం కాదు. అధునాతన టెక్నాలజితో రూపొందించిన డ్రోన్లు. నక్సలైట్లు ఎక్కడ సమావేశం అవుతున్నారనే దానిపై నిఘా వర్గాలు అందిస్తున్న సమాచారం తరువాత సాయుధ బలగాలు కూంబింగ్ చేబడుతుండగా గాలిలో కొంత ఎత్తులో ఎగురుతూ వారు పలానాచోట వున్నారని డ్రోన్లు పోలీసులకు పక్కాగా సమాచారమిస్తున్నాయి. ఈ సమాచారం ఆధారంగా పోలీసులు నక్సలైట్లు వున్న ప్రాంతాన్ని చుట్టుముట్టి అన్ని వైపుల నుంచి గాలిస్తుండడంతో వారి ఆచూకి సులభంగా లభిస్తోంది. ఈ క్రమంలోనే పోలీసులు, నక్సలైట్ల మధ్య ఎదురు కాల్పులు జరుతుండడం, నక్సల్స్ తరపున భారీ నష్టం వాటిల్లుతుండడం జరుగుతోంది. ఈ ఏడాది గడచిన 21 రోజుల్లో 45 మంది మావోయిస్టులు ఛత్తీస్‌ఘడ్ అటవీ ప్రాంతంలో పోలీసుల ఎదురు కాల్పుల్లో మరణించారు. మరణించిన వారిలో మావోయిస్టు అగ్రనేత ల్లో ఒకరైన చలపతి కూడా వున్నారు.

వచ్చే ఏడాది అంటే 2026 ఏప్రిల్ నాటికి దేశంలో నక్సలైట్లు లేకుండా చేస్తామని ప్రకటించిన కేంద్రం అందుకు అనుగుణంగా మావోస్టుల ఏరివేతకు అందుబాటులో వున్న అన్ని అస్త్ర, శస్త్రాలను వాడుతోంది. నిన్నమొన్నటి వరకు ఇన్‌ఫార్మర్ల వ్యవస్థతో పాటు లొంగిపోయిన నక్సలైట్లలో కొందరిని తమకు అనుకూలంగా మలచుకుని వారిచ్చే సమాచారం ఆధారంగా క్షేత్రస్థాయిలో పోలీసుల కూంబింగ్ ఆపరేషన్లు జరిగేవి. దీని తరువాత నక్సలైట్లకు పట్టుగా వున్న ప్రాంతాలలో కొందరు యువకులను ఎంపిక చేసుకుని వారి నుంచి అందే సమాచారంతో నక్సలైట్ల వేటను పోలీసులు కొనసాగించేవారు. దీంతో పాటు అటవీ ప్రాంతంలో జంతువులను లెక్కించేందుకు, వాటి కదలికలను గమనించేందుకు అటవీ శాఖ ఏర్పాటు చేసే సిసి కెమెరాలను వాడి నక్సలైట్ల ఏరివేతకు పోలీసులు ఆపరేషన్లు చేబట్టే వారని సమాచారం వుంది. ఇక తాజా విషయానికి వస్తే డ్రోన్లు పోలీసుల ఆపరేషన్‌కు తమవంతుగా సహకరిస్తున్నాయి. ఎంపిక చేసిన ప్రాంతాలలో నక్సలైట్ల కోసం పోలీసులు ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించే సమయంలో ఈ డ్రోన్లు కీలకంగా వుంటున్నాయి. ముందుగా >>2




దావోస్‌లో బుధవారం 'కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్' వేదికపై
తెలుగు సిఎంలు రేవంత్, చంద్రబాబుతో మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్

## దావోస్‌లో ఒకే వేదికపై ముగ్గురు సిఎంలు..
# రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, ఫడ్నవిస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి22:** దావోస్‌లో ఒకే వేదికపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ కనిపించారు. ఇక్కడ జరిగిన 'కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్' వేదికపై జరిగిన సమావేశంలో ఈ ముగ్గురు ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. దేశం ఒక యూనిట్‌గా పెట్టుబడులు రాబట్టేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. రాష్ట్రాల అభివృద్ధి సంక్షేమం, ఆర్థిక వ్యవస్థ, గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రక్షణ రంగంలో పెట్టుబడులకు సంబంధించిన అంశాలు సమావేశంలో చర్చకు వచ్చాయి.

# భారీ సోలార్ ప్రాజెక్టులు

>> వేదికపై తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న భారీ ఒప్పందం ఇదే కావటం విశేషం.సన్ పెట్రో కెమికల్స్ ఎండీ దిలీప్ సాంఘ్వీతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్బాబు ఈ ఒప్పందంపై కీలక చర్చలు జరిపారు.,పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ఇన్వెస్టిమెంట్స్ ప్రమోషన్ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సమక్షంలో ఎంవోయూపై సంతకాలు చేశారు. సుస్థిరమైన ఇంధన వృద్ధి సాధించే తెలంగాణ లక్ష్య సాధనలో ఈ ఒప్పందం మైలు రాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భారీ పెట్టుబడులకు ముందుకు వచ్చిన సన్ పెట్రో కెమికల్స్ ప్రతినిధులను అభినందించారు. ఈ ఒక్క ఒప్పందంతో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం గత ఏడాది దావోస్లో సాధించిన రూ.40 వేల కోట్ల పెట్టుబడుల రికార్డును సమం చేసిందని అన్నారు. భవిష్యత్తు ఇంధన అవసరాల దృష్ట్యా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీకి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. హరిత ఇంధన ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. సన్ పెట్రో కెమికల్స్ భాగస్వామ్యంతో భవిష్యత్తులో డిమాండ్కు అనుగుణంగా ఇంధన వనరులు సమకూరుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలతో పాటు నాగర్కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాలు పారిశ్రామికంగా వృద్ధి చెందుతాయని అన్నారు. తమ ప్రభుత్వం జరిపిన సంప్రదింపులు, తమ చర్చలు ఫలించాయని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఇంత భారీ పెట్టుబడుల ఒప్పందం సాధించటం ఆనందంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తాము చేపట్టబోయే ప్రాజెక్టు తెలంగాణలోనే కాకుండా దేశంలోనే అత్యంత ప్రభావవంతంగా ఉంటుందని సన్ పెట్రో కెమికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ దిలీప్ సాంఘ్వీ ధీమా వ్యక్తం చేశారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో అందరి దృష్టిని ఆకర్షిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో తెలంగాణ పెట్టుబడుల గమ్య స్థానంగా మారిందని, రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవటం గర్వంగా ఉందన్నారు.

## ఫిబ్రవరి 5న ప్రధాని మోడీ
# కుంభ్‌మేళాలో పవిత్ర స్నానం

**న్యూఢిల్లీ, జనవరి 22:** యూపిలోని ప్రయాగ్ రాజ్‌లో భారీ ఎత్తున జరుగుతున్న మహాకుం భ్‌లో ప్రధాని నరేంద్రమోడీ పవిత్రస్నానం ఆచరించేందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఫిబ్రవరి ఐదో తేదీన ప్రధాని మోడీ త్రివేణి సంగమ స్థలిలో పుణ్యస్నానం ఆచరిస్తారని బిజెపినేతలు చెపుతున్నారు. మరోవైపు ఈనెల 27వ తేదీ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా త్రివేణి సంగమంలో పవిత్రస్నానం ఆచరిం చను న్నారు. గంగాహారతి కార్యక్రమంలోనూ పాల్గొంటారు. అధికారులతో భేటీ కానున్నా రు. ప్రధాన కూడాళ్లవద్దమరోసారి అధికారు లు కూడాషా రాక సందర్భంగా గట్టిబందో బస్తు తనిఖీలుచేసారు. వచ్చేనెల ఒకటవ తేదీ ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌కడ్ దంపతు లు, ఫిబ్రవరి 10వ తేదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రయాగరాజ్‌కు రానున్నారు. దట్టమైన మంచు కప్పుకున్నప్పటికీ భక్తులు లక్షలాదిమంది పుణ్యస్నానాలు ఆచరించారు. జనవరి13న మ ఒదలైన కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీ పూర్తి అవుతుంది. మౌని అమావాస్య రెండో షహీ స్నానం జనవరి 29న ఫిబ్రవరి 3న వసంతపంచమిరోజు మూడో షహీస్నాన్, ఫిబ్ర వరి 12న మాఘపూర్ణిమ సందర్భంగా అత్య ధికంగా భక్తులు వస్తారని అంచనా. ఫిబ్రవరి 26న మహాశివరాత్రితోకుంభమేళా ముగుస్తుం ది. యుపి రాష్ట్ర గణాంకాలప్రకారం జనవరి 20 నాటికి 8.81 కోట్లమందికిపైగాభక్తులు పుణ్య స్నానాలు చేసారు.

## జనపనారకు 'మద్దతు'
# రూ.315 పెంపు

>> పొందుతున్నారు. అలాగే జూట్ వ్యాపారం చేస్తున్నారు. గతేడాది 1 లక్షా 70 వేల మంది రైతుల నుంచి జనపనారను కొనుగోలు చేశారు. జనపనార రైతులలో అత్యధికంగా 82 శాతం పశ్చిమ బెంగాలుకు చెందినవారు కాగా మిగిలిన, అస్సాం మరియు బీహార్లు జూట్ ఉత్పత్తిలో 9 వాటా కలిగి ఉన్నారు. జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జేసీఐ) ప్రైస్ సపోర్టు కార్యకలాపాలను చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా కొనసాగుతుంది. అయితే ఈ కార్యకలాపాలలో ఏవైనా నష్టాలు ఉంటే, కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రీయింబర్స్ చేస్తుంది.

# మావోయిస్టుల 'వేట'!

>> నక్సలైట్ల కదలికలపై నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం ఆధారంగా పోలీసుల ఆపరేషన్లు మొదలువతాయి. ఇందుకోసం వందల సంఖ్యలో సాయుధ పోలీసులు కొన్ని బృందాలుగా ఏర్పడి ముందుకు సాగుతారు. ఇలా ముందకు సాగుతున్న పోలీసులకు కొంత ఎత్తులో ఎగురుతూ వారికన్నా ముందు వుండే డ్రోన్లు నక్సలైట్ల కదలికలపై పక్కా సమాచారాన్ని అందిస్తున్నాయి. నక్సలైట్ల కదలికలను పసిగట్టేందుకు పోలీసు బలగాలు వాడుతువన్న డ్రోన్లు అధునాతన టెక్నాలజీతో తయారు చేసినవి కావడం గమనార్హం. ఆకాశంలో ఎగురుతూ వెళ్లే డ్రోన్లు అందిస్తున్న సమాచారం ఛత్తీస్‌ఘడ్‌లో నక్సలైట్ల ఏరివేతకు పోలీసులకు ఉపయోగకరంగా వుంటున్నాయి. ఇది వరకు నక్సలైట్ల సమాచారం కోసం పోలీసులు సుదూరం ప్రయాణించే డ్రోన్లను వాడుతుండే వారు. ఇదే సమయంలో నక్సలైట్లు కూడా పోలీసుల ఆచూకీ కోసం డ్రోన్లు వాడిన సందర్భాలున్నాయి. కొన్ని సందర్భాలలో అటు నక్సలైట్లు ఇటు పోలీసులు పరస్పరం డ్రోన్లను కూల్చివేసిన ఉదంతాలు కూడా వున్నాయి. వాస్తవానికి డ్రోన్ల వాడకం దేశ సరిహద్దుల్లో ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్‌లో ఎక్కువగా వుంది. వీటిని పాక్ ఉగ్ర వాదులు భారత మిలటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ప్రయోగిస్తుండగా రక్షణ బలగాలు వాటిని ఆకాశంలోనే కూల్చివేస్తున్నాయి. దేశ సరిహద్దుల్లో కొన్నేళ్లుగా వా డుతున్న డ్రోన్లు ఇప్పుడు ఛత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టుల ఏరివేత విషయంలో పోలీసులకు ఉపకరిస్తున్నాయి. గడచిన ఆరు నెలల కాలంలో మావోయిస్టులపై పోలీసులు సాధించిన విజయాల వెనుక డ్రోన్లు కీలకంగా వున్నాయి. ఎదురు కాల్పుల సమయంలో నక్సలైట్లు కచ్చితంగా ఎక్కడ వున్నారనేది డ్రోన్లు పసిగట్టి పోలీసు బలగాలకు సమాచారం ఇస్తున్నాయి. ఈ కారణంగా పోలీసుల తరపున పెద్దగా నష్టం లేకుండా చూడడంలో భద్రతా బలగాలు సఫలమవుతున్నాయి. ఇదే సమయంలో మావోయి స్టుల తరపున భారీ నష్టం వుంటోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 21 రోజుల్లో 45 మంది నక్సలైట్లు మరణించడం వెనుక డ్రోన్లు అందిచే సమాచారం కీలకంగా వుంద ని తెలిసింది. ఛత్తీస్‌ఘడ్‌లోని మావోయిస్టుల కోట అబూజ్‌మడ్‌ను స్వాధీనం చేసుకునేందుకు డ్రోన్ల సేవలను వాడుకునేందుకు పోలీస బలగాలు నిర్ణయించాయి. మొత్త ం మీద మావోయిస్టుల కట్టడికి డ్రోన్లు పోలీసులకు సరికొత్త అస్త్రంలా మారాయి.

# పట్టాలపై ఘోరం

>> సమీపంలోని పలు ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతునాననయి. ఈ సాయంత్రం ఐదు గంటల సమయంలో పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులోమంటలు వ్యాపించినట్లు వదంతులు వ్యాపించగా భయంతోప్రయాణీకులు ఆరైలు చైన్‌లాగి పట్టాలపై దిగారు. ఈ క్రమంలో పట్టాలు దాటుతుండగా పచోరా రైల్వేస్టేషన్ సమీపంలో కర్ణాటక ఎక్స్‌ప్రెస్ వచ్చి వారిని ఢీకొని వారిపైనుంచి దూసుకుపోయింది. అందిన వివరాలను బట్టిచూస్తేపుష్పక్ ఎక్స్‌ప్రెస్‌రైలులోనొ ఇక కోచ్‌లో హాట్ యాక్సిల్ లేదా బ్రేక్ బైండింగ్‌కారణంగా నిప్పురవ్వలు లేచాయని రైల్వేఅధికారులు తెలిపారు. ప్రయాణీకులు భయాందోలనలకు గురై చైన్ లాగారనితెలిపారు. కొందరుట్రాక్‌లపై దూకేసిన సమయంలో కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రావడంతో ఈదుర్ఘటన జరిగినట్లు తేలింది. మరోవైపు ఈఘటనలో ఇప్పటివరకూ 10నుంచి 12 మందివరకూ మృతిచెంది ఉంటారని మహారాష్ట్ర మంత్రి గిరీశ్‌మహాజన్ అన్నారు. ప్రయాణీకులు చైన్‌లాగితే లక్నో ముంబయి పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌రైలు ఆగిందని, ఈరైలు ఆగాక ఒకబోగీనుంచి కొందరుప్రయాణీకులు దిగి మరోట్రాక్‌పైకి వెళుతుననన క్రమంలో అటుగా వస్తున్న బెంగళూరు ఢిల్లీ కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణీకుల్ని ఢీకొట్టిందని గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించేందుకు అంబులెన్సులు పంపించామని ఘటనాస్థలికి విపత్తు సహాయక రైలు బయలుదేరిందని తెలిపారు. రైలు ప్రమాదంపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ విచారం వ్యక్తంచేసారు. ఈ విషాదఘటనలో పలువురుప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని ఈఘటన తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. మృతులకు ప్రగాఢ సంతాపం తెలుపుతూ సోషల్‌మీడియాలోపోస్టుపెట్టారు. నామంత్రివర్గ సహచరుడు గిరీశ్‌మహాజన్ జిల్లాఎస్పీ ఘటనా స్థలానికి వెళ్లారని, జిల్లాకలెక్టర్‌కూడా అక్కడకు వెళ్లారని జిల్లా యంత్రాంగం మొత్తం రైల్వే అదికారులతోసమన్వయం అవుతూ పనిచేస్తోందని సీఎం అన్నారు. ఎనిమిది అంబులెన్స్‌లను పంపించారని, క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు జనరల్ ఆసుపత్రులతోపాటుసమీపంలోని ఇతర ప్రైవేటూసుపత్రులను సిద్ధంచేసామన్నారు. గ్లాస్ కట్టర్లు, ఫ్లడ్‌లైట్లు వంటి అత్యవసర పరికరాలను సైతం సిద్ధంచేసారు. మేమంతా అక్కడిపరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని అవసరమైన సాయం తక్షణమే అందిస్తున్నామని సీఎం ఫడ్నవిస్ అన్నారు.



బుధవారం ప్రయాగ్‌రాజ్‌లోని సంగమం వద్ద పుణ్యస్నానాలాచరిస్తున్న యుపి సిఎం యోగీ ఆదిత్యనాథ్, మంత్రులు

## త్రివేణి సంగమంలో యోగి కేబినెట్ పవిత్ర స్నానం

**ప్రయాగరాజ్, జనవరి 22:** ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రయాగరాజ్‌లో బుధవారం ప్రత్యేక కేబినెట్‌సమావేశం నిర్వహించారు. అనేక ముఖ్యప్రతిపాదనలను చర్చించి ఆమోదించారు. గంగానదిపై ఆరులైన్ల వంతెన నిర్మించాలనినిర్ణయించారు. ప్రయాగరాజ్, చిత్రకూట్‌ప్రాంతాన్ని పర్యాటకప్రదేశంగా తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. ప్రయాగరాజ్ మరియు పరిసర ప్రాంతాల స్థిరమైన అభివృద్ధిపై దృష్టిసారించారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుపై కూడా ప్రత్యేక దృష్టిపెట్టారు. ప్రయాగరాజ్‌ని మీర్జాపూర్, భదోహి, కాశీ, చందౌలికి కలుపుతూ ఘాజీపూర్‌లోని పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేకి అనుసంధానం చేస్తూ గంగా ఎక్స్‌ప్రెస్‌వే పొడిగింపును చేపడుతున్నట్లు సీఎం యోగి ఆదిత్యనాథ్ కేబినెట్‌భేటీ అనంతరం తెలిపారు. ఆ తర్వాత యూపి సీఎ యోగి, ఉప ముఖ్యమంత్రులు కేశవ్‌ప్రసాద్‌మౌర్య, బ్రజేష్ పాఠక్, 54 మంది మంత్రులు కూడా పవిత్ర త్రివేణి సంగమంలో పవిత్రస్నానాలుచేసారు. ఇలా పవిత్రస్నానాలుచేయడం ఇది రెండోసారి అని రాష్ట్ర అధికారులు చెపుతున్నారు.

# గాంధీభవన్‌లో బాహాబాహీ

>> రావడంతో ఇరువర్గాలు ఎదురుపడటంతో గొడవ మొదలైంది. యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ సిద్దిరాల సుధీర్ చొక్క దాడిలో చినిగిపోయింది. అక్రమనియామకాన్ని అడిగితే దాడిచేశారని హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ నాయకులు కూడా మాపై దాడులు చేశారని భద్రాది నుంచి ఫిర్యాదు చేయడానికి వచ్చిన నాయకులు వాపోయారు.

**బిఆర్ఎస్ నుంచి వలస వచ్చిన వారికే అన్ని పదవులు**

పదేళ్ళు ప్రతిపక్షంలో ఉండి ఆనాటి ప్రభుత్వంపై తీవ్రంగా పోరాటం చేసి ప్రజామద్దతు కూడగట్టి అధికారంలోకి వస్తే జెండా మోసిన కార్యకర్తలకు ప్రాధన్యత లభించడంలేదని రాజశేఖర్ ఆవేదన చెందారు. ప్రభుత్వ నామినేటడెడ్ పదవులు కనకదుర్గగుడిచైర్మన్, ఆంజనేయస్వామి దేవాలయం చైర్మన్ మార్కెట్ యార్డులచైర్మన్‌లతోపాటు పలు నామినేటెడ్ పదవులు వలసపక్షులు తన్నుకుపోతుంటే కాంగ్రెస్ కార్యకర్తలం జెండా మోసి అన్యాయంకు గురవుతున్నామని ఆయన ఆవేదన చెందారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ఎక్కువ ఓట్లు వచ్చిన కార్తీక్‌కు అధ్యక్షపదవి ఇచ్చామని త్రివేదిద ఆమోదం కూడా ఉందని తెలిపారు. కొత్తగూడెంలో బీఆర్ఎస్‌నుండి వచ్చిన వారికి పోస్టులు ఇచ్చారంటూ అభ్యంతరం వ్యక్తం చేసిన ఒరిజినల్ యూత్ కాంగ్రెస్ నేతలు గాంధీభవన్ వేదికగా వాపోయారు.

# సిడబ్ల్యుసి సూచన మేరకే మూడు బ్యారేజీలు

>> మాత్రమే ఎత్తిపోసే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణకు కనీసం 200టిఎంసిలు ప్రాణాహితచేవెళ్ళ వరకు నీరు అందించడానికి, అదేవిధంగా అప్పర్‌మానేరు,సింగూరు ఆయకట్టు స్థిరీకరణకు అదనంగా నీరు వాడుకోవడానికి తుమ్మిడిహట్టి ప్రాజెక్టు వల్ల కలిగే నీటి లభ్యతతో సాధ్యం కాదని ఈ నిర్మాణాలు చేశారని తెలిపారు.45లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీటి వసతి కల్పించాలని ఈ కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కట్టాలని ఆనాటి ముఖ్యమంత్రి భావించారని తెలిపారు.తెలంగాణ బిడ్డలు కేంద్ర జలశక్తిసలహాదారు వెదిర శ్రీరాం, సాగునీటి,విద్యుత్‌రంగనిపుణులు కె. రఘు, కోదండరామ్‌లు ఉద్దేశ్యపూర్వకంగా విచారణ కమిటిని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఎక్స్‌పర్ట్ కమిటీ మేడిగడ్డ బ్యారేజీకి వ్యతిరేకంగా రిపోర్ట్ ఇచ్చింది కదా? కమిషన్ అడిగిన ప్రశ్నకు ప్రకాష్ సమాధానం ఇస్తూ మేడిగడ్డ వద్ద కట్టొద్దని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ చెప్పలేదని ప్రకాష్ సమాధానం ఇచ్చారు.2016లో హరీష్, ఈటెల, తుమ్మల ఆధ్వర్యంలో సబ్ కమిటీ కాళేశ్వరం ప్రస్తావన తేలేదు కదా? అన్న కమిషన్ ప్రశ్నించింది. వారిచ్చిన ప్రాజెక్టుల రిపోర్టు ఆధారంగానే నీటి లభ్యత అంశాన్ని బేరీజ్ చేసుకుని కాళేశ్వరం నిర్మాణం జరిగిందని నీటిపారుదలరంగ నిపుణులు వి. ప్రకాష్ సమాధానం ఇచ్చారు.మొత్తంగా 17 నిమిషాల్లో సాక్షిని కమీషన్ ప్రశ్నించి పంపించివేసింది.

అనంతరం బయట విలేఖరులతో వి.ప్రకాశ్ మాట్లాడుతూ తుమ్మిడిహట్టిలో బ్యారేజి కడితే అందులో 63టిఎంసిలు పొరుగురాష్ట్రాలకు ఇవ్వాల్సి ఉంటుందని అంటే మనకు 165టిఎంసిలు నీరు అక్కడ లభ్యత ఉందని చెప్పినా మనకు వాడుకొనేందుకు102టిఎంసిలు మాత్రమే ఉంటుందని అని తెలిపారు. ఎత్తువిషయంలో పొరుగురాష్ట్రాల ఒత్తిడికి తలొగ్గితే 44టిఎంసిలు మాత్రేమ ఎత్తిపోసుకొనే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిన తర్వాత ప్రకాష్ మాట్లాడుతూ మేడిగడ్డ ప్రాజెక్టుపై కాళేశ్వరం కమిషన్‌ను తప్పుదో పట్టిస్తున్నారన్నారు. మేడిగడ్డ కట్టవద్దని రిటైర్డ్ ఇంజనీర్స్ ఎక్స్పర్ట్ కమిటీ రిపోర్ట్ ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీ కూడా అలాంటి అభిప్రాయం వ్యక్తం చేయలేదన్నారు. ప్రజల డిమాండ్, ఎక్స్పర్ట్ ఇంజనీర్ల అభిప్రాయాలను గత ప్రభుత్వం పరిగణలోకి తీసుకుందని తెలిపారు. తన అభిప్రాయాలను కాళశ్వరం కమిషన్ సానుకూలంగా స్పందించిందని ప్రకాష్ పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో ఎఐ డేటా సెంటర్ క్లస్టర్

>> డి. శ్రీధర్ బాబు, హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో,ఎండీ సి.విజయకుమార్‌తో చర్చలు జరిపారు. హెచ్‌సీఎల్ కొత్త సెంటర్‌లో లైఫ్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సేవలకు ప్రాధాన్యమిస్తుంది. అత్యాధునిక క్లౌడ్, అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్‌లను అందిస్తుంది. హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్ ఏర్పాటవుతుంది. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుండి గోల్డ్ సర్టిఫికేషన్ అందుకుంది. దీంతో దాదాపు 5,000 మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు లభిస్తాయి. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు, ఐటీలో ప్రతిభా వంతులైన నిపుణులతో ఇప్పటికే హెచ్‌సీఎల్ గ్లోబల్ నెట్‌వర్క్ సెంటర్‌గా హైదరాబాద్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ కొత్త సెంటర్ మరింత అత్యాధునిక సామర్థ్యాన్ని అందుబాటులోకి తెస్తుందని,హెచ్‌సీఎల్ టెక్ సీఈవో విజయకుమార్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో హెచ్‌సీఎల్ సేవల విస్తరణను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్వాగతించారు. ప్రపంచంలో ఐటీ హబ్‌గా హైదరాబాద్ తన స్థానాన్ని మరోసారి పదిలం చేసుకుందని అభిప్రాయపడ్డారు. వచ్చే నెలలో కొత్త సెంటర్‌ను ప్రారంభించాలని ఆహ్వానించారు. స్థానిక యువతకు ఉద్యోగాలతో పాటు హైదరాబాద్‌లోని టెక్నాలజీ, ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నగరాలకు ఐటీ పరిశ్రమను విస్తరించాలని హెచ్‌సీఎల్ టెక్ ప్రతినిధులను కోరారు. ప్రభుత్వం తరఫున తగిన సహకారం అందిస్తామని చెప్పారు. 2007 నుంచే హెచ్‌సీఎల్ హైదరాబాద్ నుంచి ప్రపంచ వ్యాప్తంగా తమ క్లయింట్లకు సేవలను అందిస్తోంది. కొత్త కేంద్రంతో హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్ మొత్తం అయిదు సెంటర్లను విస్తరించనుంది

# ట్రిలియన్ ట్రీ ఉద్యమంలో భాగమవుతాం

### దావోస్- ప్రపంచ ఆర్థిక వేదికలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రతిజ్ఞ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి22:** ఒక ట్రిలియన్ మొక్కలు నాటి భూమిని సతత హరితంగా మార్చే 'ట్రిలియన్ ట్రీ ఉద్యమం'లో భాగమవుతానని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రమాణం చేశారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, భవిష్యత్ తరాల మనుగడను సురక్షితంగా మార్చే ప్రయత్నంలో పాలుపంచుకుంటానని ప్రతిజ్ఞ చేశారు. దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా వన్ ట్రిలియన్ ట్రీ ఆర్గనైజేషన్ నిర్వాహకులు తెలంగాణ పెవిలీయన్‌ను సందర్శించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబును కలిసి పర్యావరణ ప్రమాణాన్ని చేయించారు.

తెలంగాణ రైజింగ్ విధానంలో పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రతి అంశంలోనూ నెట్ జీరో విధానాలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు, నేచర్ పాజిటివ్ పిల్లర్ సహ వ్యవస్థాపకురాలు నికోల్ ష్వాబ్, 1టి.ఓఆర్‌జి నిర్వాహకులు ఫ్లోరియన్ వెర్నాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి22:** రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. రేవంత్ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలు, ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతోనే అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విమర్శించారు. రైతు ఆత్మహత్యలపై వేసిన తమ కమిటీ వెనుక ఎలాంటి రాజకీయ ఉద్దేశ్యం లేదని, కేవలం రైతాంగానికి అండగా నిలబడాలన్న ఆలోచన తప్ప ఇంకేం లేదని స్పష్టం చేశారు. బుధవారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో సమావేశమైన అధ్యయన కమిటీ తొలి సమావేశం జరిగింది.

అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ, ఆదిలాబాద్ బ్యాంకులో ఆత్మహత్య చేసుకున్న రైతు విషాద ఘటనే ఈ కమిటీ వేయడానికి కారణం అని పేర్కొన్నారు. బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ ఆదేశం మేరకు ఏర్పాటైన ఈ కమిటీ శుక్రవారం(జనవరి 24) నుంచి పూర్వ ఆదిలాబాద్ జిల్లా నుంచి పని ప్రారంభిస్తుందన్నారు. రాబోయే నెల రోజులపాటు అన్ని జిల్లాలలో అన్ని వర్గాల రైతులను కలిసి రుణమాఫీ ఎంత మేరకు జరిగింది..? అసలు రాష్ట్రంలో ఏం జరుగుతుంది..?..కరెంటు సరఫరా ఎలా ఉంది..?.. సాగు పరిస్థితి ఎలా ఉంది..? మద్దతు ధర దొరకుతుందా..? బోనస్ ఏమైంది..? కొనుగోలు కేంద్రాలు ఏమయ్యాయి..? రైతు వేదికలు పని చేస్తున్నాయా.. ? వంటి అంశాలను అధ్యయనం చేస్తుందని తెలిపారు.

రైతాంగం ఎదుర్కుంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు ఆత్మహత్యలకు కారణాలను అధ్యయనం చేసి నివేదికను రూపొందిస్తుందని, ఆ నివేదికను బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తుందని వెల్లడించారు.

## వారం - వర్జ్యం

తేది : 23-01-2025, గురువారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
నవమి సా.5.38
విశాఖ తె.5.07
వర్జ్యం : ఉ.8.45-10.31
దు.ఉ.10.34-11.19
2) మ.3.05-3.50
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** అధిక శ్రమను పంచుకోవడానికి నమ్మకస్తులైన వారికి కొన్ని బాధ్యతలు అప్పగిస్తారు.

**వృషభం:** లిఖిత పూర్వక ఒప్పందములకు వక్ర భాష్యములను తెచ్చే తుంటరి వర్గం పట్ల అప్రమత్తంగా ఉండండి.

**మిథునం:** బరువు బాధ్యతలకు దూరంగా కొంతకాలం ఒంటరిగా కాలం గడపాలనుకుంటారు.

**కర్కాటకం :** సుదూర ప్రాంత ప్రయాణాలలో ముఖ్యమైన వ్యవహారాలలో స్వల్పమైన ఆటంకాలు ఏర్పడతాయి.

**సింహం:** కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడానికిగాను కావలసిన సలహాలను పెద్దల నుండి తీసుకొంటారు.

**కన్య :** మారుతున్న కాలానికి అనుగుణంగా మీరూ మార్పును కోరుకుంటారు. వాహన యోగం.

**తుల :** నిష్కారణమైన తగాదాలు అపనిందలు తప్పకపోవచ్చు. జీవిత భాగస్వామితో వివాదాలు ఏర్పడతాయి.

**వృశ్చికం:** మిత్ర బృందంలోనికి కొత్తవారికి చోటు కల్పిస్తారు. మీ నడవడి సూటిగా ఉంటుంది.

**ధనుస్సు:** రొటీన్ సంతకాల విషయంలో జాగ్రత్తలు పాటించండి. అనుకోని ప్రయణాలు లాభిస్తాయి.

**మకరం:** న్యాయ నిపుణుల సలహాలను పరిగణలోనికి తీసుకుంటారు. నూతన ప్రణాళికలను రూపొందించుకుంటారు.

**కుంభం:** మీపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్న వారిని గుర్తించి వారికి దూరంగా ఉంటారు.

**మీనం :** ఆర్థిక విలువైన పత్రాల భద్రతా విషయంలో జాగ్రత్తలు అవసరం. సోదరుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## మానవ రహిత ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్
### జెఎస్ డబ్ల్యు రూ.800 కోట్ల పెట్టుబడులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి22:** రాష్ట్రంలో మానవ రహిత ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్ స్థాపించనున్నట్లు జేఎస్ డబ్ల్యూ సంస్థ ప్రకటించింది. అమెరికా కు చెందిన డిఫెన్స్ టెక్నాలజీ సంస్థ అనుబంధంతో ఈ యూనిట్ నెలకొల్పనుంది. దాదాపు రూ.800 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.దీనికి సంబంధించి దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో జెఎస్ డబ్ల్యు డిఫెన్స్ అనుబంధ సంస్థ అయిన జె ఎస్ డబ్ల్యు యూఏవీ లిమిటెడ్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో దాదాపు 200 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు తెలంగాణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు క్రియాశీలంగా మారనుంది. ఐటీ, ఫార్మాతో పాటు అన్ని రంగాల పరిశ్రమలు తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయని, ఈ ఒప్పందంతో రక్షణ రంగంలో కీలక ఆవిష్కరణలతో పాటు డ్రోన్ టెక్నాలజీకి తెలంగాణ ప్రధాన కేంద్రంగా మారుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం రక్షణ రంగంలో సరికొత్త ట్రెండ్ సృష్టిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు.

## అదనపు జడ్జిలు

>> ఏపీ హైకోర్టు అడిషనల్ జడ్జిలుగా రెండేళ్ల పాటు కొనసాగుతారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఈ ఆరుగురుని ఆయా హైకోర్టులలో అదనపు జడ్జిలుగా నియమించాలన్న ప్రతిపాదనకు జనవరి 11న జరిగిన సమావేశంలో సుప్రీంకోర్టు కొలీజయం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

# తొక్కిసలాటలో మనిషి చనిపోవడం అర్జున్ చేతుల్లో లేకపోవచ్చు

### 10,12 రోజులు ఆ కుటుంబాన్ని పట్టించకోలేదు

## అల్లు అర్జున్ అరెస్టుపై మరోసారి స్పందించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి22:** పుష్ప2 ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో సినీ నటుడు అల్లు అర్జున్‌పై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరోసారి స్పందించారు. దావోస్ పర్యటనలో ఉన్న సీఎం... ఓ ఇంగ్లీష్ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. తొక్కిసలాట ఘటనకు అల్లు అర్జున్ నేరుగా బాధ్యుడు కాదు కదా? అని మీడియా ప్రతినిధి ప్రశ్నించారు.

దీనికి సీఎం స్పందిస్తూ... రెండు రోజుల ముందు అనుమతి కోసం వస్తే పోలీసులు నిరాకరించారని, అయినా అల్లు అర్జున్ థియేటర్ వద్దకు వచ్చారని తెలిపారు. ఈ క్రమంలో అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారని, దీంతో సెక్యూరిటీ సిబ్బంది వారిని పక్కకు తోసేశారన్నారు. ఈ తొక్కిసలాటలో ఒకరు చనిపోయినట్లు చెప్పారు. ఒక మనిషి చనిపోవడం అనేది ఆయన (అల్లు అర్జున్) చేతుల్లో లేకపోవచ్చు కానీ... ఆ మహిళ కుటుంబాన్ని పది పన్నెండు రోజులు పట్టించుకోలేదన్నారు. ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం మంచిది కాదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు కదా? అని మీడియా ప్రతినిధి ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సమాధానమిస్తూ... అల్లు అర్జున్‌ను ఎందుకు అరెస్ట్ చేశామో చంద్రబాబుకు పూర్తిగా తెలిసి ఉండకపోవచ్చన్నారు

# అది అలక'దందా' ఆసుపత్రి!

### అనుమతి లేకుండా కిడ్నీ మార్పిడి వాస్తవమేనని తేల్చిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స వ్యవహారంలో భయంకర నిజాలు వెలుగుచూస్తున్నాయి. సరూర్‌నగర్‌లోని అలకనంద ఆసుపత్రిలో అనుమతి లేకుండా కిడ్నీ మార్పిడి నిజమేనని ప్రభుత్వం నియమించిన కమిటీ తేల్చింది. ఆర్థిక కారణాలతోనే తమిళనాడు, కర్నాటకల నుంచి వచ్చిన ఇద్దరు వితంతువులు కిడ్నీలు విక్రయించినట్లు ఒప్పుకున్నారని డీఎంహెచ్ఓ డాక్టర్ వాణి వెల్లడించారు. ఈ ఘటనపై విచారణ చేసేందుకు ఉస్మానియా ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ నాగేందర్ ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య శాఖ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కిడ్నీ మార్పిడి కోసం వచ్చిన ఇద్దరు దాతలు, ఇద్దరు గ్రహీతలు కూడా ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో ఉన్నారని తెలిపారు. డాక్టర్ నాగేంద్ర నేతృత్వంలోని నలుగురు సభ్యుల కమిటీ కిడ్నీ దాతలు, గ్రహీతలతో మాట్లాడిందని, విచారణ సమయంలో కిడ్నీ దాతలు పూర్ణిమ అనే మహిళ పేరు ప్రస్తావించారని డీఎంఈ తెలిపారు. కుటుంబ, ఆర్థిక కారణాలతో కిడ్నీలు ఇచ్చేందుకు అంగీకరించినట్లు చెప్పారని అన్నారు. కిడ్నీలు అమ్మిన ఇద్దరు మహిళలు కూడా వితంతువులేనని, కిడ్నీ దాతలు, గ్రహీతలు కన్నడ, తమిళం మాట్లాడుతున్నారని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని రాష్ట్రానికి తీసుకొచ్చి కిడ్నీ రాకెట్ నిర్వహిస్తున్నారని వెల్లడించారు. అలకనంద ఆస్పత్రికి సంబంధించి ఒక ప్లాస్టిక్ సర్జన్‌కు మాత్రమే గుర్తింపు ఉందని, ఆ ప్లాస్టిక్ సర్జనే ఈ కిడ్నీ శస్త్ర చికిత్సలు చేశారా? లేదా అనేది ఆరా తీస్తున్నామన్నారు. అనుమతి లేకున్నా శస్త్ర చికిత్స చేసిన వైద్యు లను కఠినంగా శిక్షిస్తామని డీఎంఈ స్పష్టం చేశారు. అక్రమ కిడ్నీ శస్త్ర చికిత్సల వ్యవహారంలో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆసుపత్రి నిర్వాహకుడు సుమంత్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అతన్ని లోతుగా విచారిస్తున్నట్లు తెలిసింది. ఆసుపత్రి ఎప్పటి నుంచి నిర్వహిస్తున్నారు.. ఎవరి ప్రమేయంతో కిడ్నీ మార్పిడి చేస్తున్నారు, ఎంత మంది వైద్యులు శస్త్ర చికిత్సలు చేస్తున్నారనే కోణాల్లో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. అయితే ఆసుపత్రి యాజమాన్యం కిడ్నీ గ్రహీతలు ఒక్కొక్కరి నుంచి రూ. 50 లక్షలకు పైగా నగదు తీసుకున్నట్టు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.



ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ సభ్యులు



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

**రంగారెడ్డిజిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ అనుమతులు లేని ఆస్పత్రులను గుర్తించి సీజ్ చేయాలి: ఏఐవైఎఫ్ డిమాండ్**

**హుడా కాంప్లెక్స్:** నిబంధనలకు విరుద్ధంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లకు పాల్పడిన సరూర్ నగర్ డాక్టర్స్ కాలనీలోని అలకనంద మల్టీ స్పెషలిటీ ఆసుపత్రి వైద్యులు, యాజమాన్యం పై క్రిమినల్ కేసు నమోదు చేసి రిమాండ్ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆసుపత్రివద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్య దర్శి కె. ధర్మేంద్ర,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలకనంద మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ యాజమాన్యం 9 పడకలకు మాత్రమే అనుమతి పొంది, 30 పడకలను అక్రమంగా నిర్వహిస్తున్నా ఎందుకు చర్యలు చేపట్టలేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నిన్న జరిగిన పేషెంట్‌కు కిడ్నీ మార్పిడి జరిగేవరకు చేస్తే కానీ స్పందించని అధికారుల వైఖరి చూస్తుంటే ఏ స్థాయిలో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో అధికారులు కుమ్మక్కు అవుతున్నారో అర్థం చేసుకోవాలని వారు అన్నారు. ఇతర రాష్ట్రాలు తమిళనాడు, కర్నాటక నుండి లైసెన్స్ లేని జూనియర్ వైద్యులతో ఈ సర్జరీలు చేస్తున్నారన్నారు.

## మే 25న సివిల్స్-2025 ప్రిలిమ్స్ పరీక్ష

### ఫిబ్రవరి 11 వరకు దరఖాస్తుల స్వీకరణ

### 979 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన యుపిఎస్‌సీ

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** దేశంలో అత్యున్నత సర్వీసులైన ఐఏఎస్, ఐఆర్ఎస్, ఐపీఎస్ పోస్టుల భర్తీ కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్‌సీ) సివిల్స్-2025 నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఇందులో భాగంగా మే 25న ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఇందుకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియను బుధవారం నుంచే ప్రారంభిస్తున్నట్లు కమిషన్ పేర్కొంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను యూపీఎస్‌సీ బుధవారం జారీ చేసింది. సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్)-2025తోపాటు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ప్రిలిమ్స్) పరీక్ష నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అఖిల భారత సర్వీసుల్లో దాదాపు 979 పోస్టుల భర్తీ కోసం సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్(సీఎస్ఈ)-2025 పరీక్షకు యూపీఎస్‌సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఏడాది అన్ని సర్వీసులకు కేవలం 979 ఖాళీలను మాత్రమే భర్తీ చేయనున్నారు. గత ఏడాది భర్తీ చేసిన 1056 పోస్టులతో పోల్చితే ఈసారి 77 పోస్టులు తక్కువగా ఉన్నాయి. సివిల్స్-2025 ప్రిలిమ్స్ పరీక్ష కోసం జనవరి 22 నుంచి ఫిబ్రవరి 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ప్రిలిమినరీ పరీక్ష మే 25న జరగనుంది. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో మరో 150 పోస్టులను విడిగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షకు సైతం ఫిబ్రవరి 11 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యర్థులు నోటిఫికేషన్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను ఎప్పటికప్పుడు అధికారిక యూపీఎస్‌సీ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని ప్రకటించింది. యూపీఎస్‌సీ పరీక్షలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 40వేల నుంచి 50వేల మంది వరకు హాజరవుతారు.

### ఏకశిలా నగర్ వెంచర్ సంఘటనలో

## ఎంపి ఈటలతో పాటు మరో 29 మందిపై కేసు నమోదు

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 22, ప్రభాత వార్త:** కొర్రెముల ఏకశిలా నగర్ వెంచర్ వద్ద జరిగిన సంఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు మొత్తం 30 మందిపై కేసు నమోదు చేసినట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ సీఐ రాజు వర్మ తెలిపారు. ఈ నెల 21 వ తేదిన పోచారం మున్సిపల్ కొర్రెముల ఏకశిలా నగర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితుల స్థలాలు కబ్జాకు గురి అవుతున్నాయని ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు స్థానిక బీజేపీ నాయకులు, ప్లాట్ల బాధితులు వెంచర్‌ను సందర్శించారు. ఈసందర్భంగా రియల్ వ్యాపారి అనుచరులు అక్కడే తచ్చాడుతూ ఉండటంతో ఎంపీ వారి వద్దకు వెళ్లి చెంపపై కొట్టాడు. ఇదే క్రమంలో స్థానిక నాయకులు దాడికి పాల్పడటంతో నారపల్లికి చెందిన గ్యార ఉపేందర్, మహ్మద్ రఫీక్‌లు గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, శివారెడ్డి, బస్వరాజ్ గౌడ్, జుబేర్ అక్రం, వి. శ్రీనివాస్‌తోపాటు మరో 24 మందిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ రాజు వర్మ తెలిపారు.

## ఆ నలుగురు రైతులను విడుదల చేయండి

### లగచర్ల ఘనటలో హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇటీవల సంచలనం కలిగించిన లగచర్ల ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. లగచర్ల సంఘటనలో సంబంధం ఉందంటూ అరెస్ట్ చేసిన నలుగురు రైతులను విడుదల చేయాలని హైకోర్టు ఆదేశించింది. వారి వద్ద 25 వేల రూపాయల వ్యక్తిగత బాండ్ తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా జైలు సూపరింటెండెంట్‌కు తెలిపింది. ఒకే అంశంపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడాన్ని పోలీసుల వైఖరిని ధర్మాసనం తప్పుపట్టింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ న్యాయవాదికి స్పష్టం చేస్తూ, తదుపరి విచారణ ఫిబ్రవరి 12కు వాయిదా వేసింది. కాగా వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై దాడి ఘటనకు సంబంధించి బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్లో రైతులు ముదావత్ రమేశ్, గోపాల్ నాయక్, మదారయ్య, మంగ్యా నాయక్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. తొలి ఎఫ్ఐఆర్ 153లో వీరిని అరెస్టు చేయగా, బెయిల్‌పై విడుదలయ్యారు. ఆ తర్వాత ఎఫ్ఐఆర్ 154, 155లోనూ వీరు నిందితులని పేర్కొంటూ పోలీసులు మరోసారి అరెస్టు చేశారు. దీనిపై రైతులు కోర్టును ఆశ్రయించారు. ఒకే అంశంపై పలు ఎఫ్ఐఆర్లు నమోదు చేశారని, కావాలని పోలీసులు మరో రెండు కేసులు పెట్టారని రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 154, 155లను రద్దు చేసేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున పీపీ పల్లె నాగేశ్వర్రావు వాదనలు వినిపిస్తూ, సాక్షులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా 154, 155 ఎఫ్ఐఆర్‌లలో పిటిషనర్లను పోలీసులు నిందితులుగా చేర్చారని చెప్పారు. అయితే పిటిషనర్ల పేర్లు ప్రస్తావించడం తప్ప వారికి వ్యతిరేకంగా ఏమీ పేర్కొనలేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. పిటిషనర్ల పాత్ర ఏంటో వివరించలేదన్నారు. పిటిషనర్లు వ్యవ సాయదారులని,దాదాపు మూడునెలలుగా జైల్లో ఉంటున్నారని గుర్తు చేశారు. వారివద్ద వ్యక్తిగత బాండ్ తీసుకుని విడుదల చేయాలని ఆదేశించారు.

## ఆర్టీసీ పరిరక్షణకై 27న సమ్మె నోటీస్

### టీజీఎస్ఆర్టీసీ జేఏసీ

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆర్టీసీ పరిరక్షణతోపాటు ప్రభుత్వ హామీల అమలు కోసం ఈ నెల 27న సమ్మె నోటీస్ ఇవ్వాలని టీజీఎస్ఆర్టీసీ జేఏసీ నిర్ణయించింది. బుధవారం హైదరాబాద్‌లోని ఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర జేఏసీ సమావేశం జరిగింది. సమావేశంలో ఆర్టీసీ పరిరక్షణ కోసం సమ్మె నోటీ ఇవ్వాలని తీర్మానం చేసినట్టు జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, కో కన్వీనర్ సుద్దాల సురేష్, కో కన్వీనర్ బి యాదగిరి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్న .. ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన ప్రధాన హామీలైన ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, 2021 నుంచి వేతన సవరణతోపాటు అతి ముఖ్యమైన .. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి ఆంగట్లో సరుకుల్లాగ రోజుకొక డిపో చొప్పున ప్రవేటు ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో కార్పొరేట్ సంస్థలైన జేబీఎం, ఒలే కత్రాలకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. ఎలకట్రిక్ బస్సులకి ఈ ప్రభుత్వం ఒక్క పైసా పెట్టుబడి పెట్టలేదు, ఆర్టీసీ సంస్థ కొనలేదు అలాంటప్పుడు ఈ బస్సులను హంగులు ఆర్బాటలతో ప్రారంభించే హక్కుప్రభుత్వానికి, ప్రభుత్వ మంత్రులకి ఎక్కడిదని జేఏసీ నాయకులు ప్రశ్నించారు. ఈ ప్రవేటు బస్సులను ప్రభుత్వ బస్సులుగా ప్రజలను, తెలంగాణ సమాజాన్ని నమ్మించాడానికి చేస్తున్న చర్యగా జేఏసీ భావిస్తోందన్నారు. ఈ బస్సుల వలన ఆర్టీసీ సంస్థలో వేలాది మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, ఒక బస్సుకు 5గురు చొప్పున బడుగు, బలహీన వర్గాలకు చట్టప్రకారం ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయి పూర్తిగా ప్రవేటు వ్యక్తుల చేతిలోకి నెట్టి వేయబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత యూపిఏ ప్రభుత్వం జెన్నారం (జేఎన్ఎన్‌యూఆర్ఎం) బస్సులను ఆర్టీసీకి కొనిచ్చిన మాదిరిగా ఈ ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీకి కొనిచ్చి ప్రజా రవాణాను కాపాడాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో దశలవారిగా ఉద్యమ కార్యచరణలు చేపట్టి ప్రభుత్వానికి, ఆర్టీసీ యాజమాన్యానికి మెమోరాండంలను సమర్పించినప్పటికి నేటి వరకు ఎలాంటి స్పందన లేకపోవడంతో సంస్థని రక్షించు కోవడానికి కార్మికుల న్యాయమైన డిమాండ్లసాధనకై మెజారిటీ ఉద్యోగులఅభిప్రాయం మేరకు విధిలేని పరిస్థితిలో సమ్మెబాట పట్టాల్సి వస్తోందని ఈ నెల 27న సోమవారం ప్రభుత్వ, యాజమాన్యానికి సమ్మెనోటీసులుఇవ్వడానికి జేఏసీనిర్ణయించిందని తెలిపారు.

## బాలపెల్లిలో ఐదు కుటుంబాల బహిష్కరణ

**జగిత్యాల రూరల్ ప్రభాత వార్త:** జగిత్యాల మండలం రూరల్ గ్రామం బాలపెల్లిలో ఐదు కుటుంబాలు గంగారాం సయ్యవ్వ శారద రాధ దుబయ్య యాదవ కుర్మావర్గానికి చెందిన కుటుంబాలను టిఆర్ఎస్ నాయకులు బహిష్క రించడంతో భాదిత కుటుంబాలు కోర్టును ఆశ్రయించగా కుల బహిష్కరణ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోర్టు తీర్పు ఇవ్వడం జరిగింది. అయినప్పటికీ పోలీసులు కోర్టుతీర్పును పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ మళ్ళీజిల్లా కలెక్టర్ ఎస్పీలకు ఫిర్యాదు అందజేస్తూ తమకు న్యాయం చేయాలని బిఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.

## రెండవ రోజునా కొనసాగిన ఐటి దాడులు

### పుష్ప డైరక్టర్ సుకుమార్, దిల్ రాజు కుమార్తె సహా పలువురి ఇళ్లలో సోదాలు

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** టాలీవుడ్‌లోని ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాలలో వరుసగా రెండవ రోజు కూడా ఐటి దాడులు కొనసాగాయి. మంగళవారం ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు. మ్యాంగో మీడియా, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాత నవీన్ సహా మరికొందరి ఇళ్లు కార్యాలయాలలో ఐటి అధికారులు దాడులు చేయడం తెలిసిందే. మంగళవారం రాత్రి పొద్దుపోయే వరకు దాడులు చేసిన ఐటి అధికారులు తిరిగి బుధవారం ఉదయం దాడులు మొదలుపెట్టారు. బుధవారం నాడు మైత్రీ మూవీస్, మ్యాంగో మీడియా సంస్థలతో పాటు దిల్ రాజు, ఆయన కుమార్తె హన్షిత రెడ్డి సహా పలువురు ప్రముఖుల ఇళ్లు కార్యాలయాలపై దాడులు చేసిన ఐటి అధికారులు ఇదే సమయంలో కొండాపూర్‌లో నివసించే ప్రముఖ దర్శకుడ సుకుమార్ ఇంట్లో కూడా సోదాలు నిర్వహించారు. దిల్‌రాజు ఇటీవల భారీ బడ్జెట్‌లతో పలు భాషల్లో సినిమాలు నిర్మించడం తెలిసిందే. ఆయనతో పాటు పుష్క, మైత్రీ మూవీస్ సంస్థలు కూడా భారీ బ డ్జెట్ సినిమాలు రూపొందించడం విదితమే. దిల్ రాజు సినిమాలను నిర్మించడంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేస్తుండడం తెలిసిందే. ఆయన రియల్ ఎస్టేట్ కార్యాలయాలతో పాటు సినిమాలకు సంబంధించిన కార్యాలయాలలోనూ ఐటి అధికారులు సోదాలు చేశారు. దీనికి సంబంధించిన లెక్కల్లో తేడాలు వున్నాయని అందిన సమాచారంతో 55 బృందాలతో ఐటి అధికారులు అన్నిచోట్ల ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఐటి దాడులు జరిగిన సమయంలో సుకుమార్‌తో పాటు ఆ యన కుమార్తె ఇంట్లోనే వున్నారు. దిల్ రాజు ఆయన కుమార్తె ఇళ్లలో సినిమాల నిర్మాణ వ్యయం, ఐటి చెల్లింపుల పత్రాలను అధికారులు పరిశీలించారు. ఈ సోదాలు సాయంత్రం వరకు కొనసాగాయి. ఇదే సమయంలో దర్శకుడు సుకుమార్ ఇల్లుతో పాటు కార్యాలయంలోనూ ఐటి అధికారులు సోదాలు నిర్వహించారు. పుష్ప 2 సిని మా 1800 కోట్ల రూపాయల కలెక్షన్ వచ్చినట్లు నిర్మాతలు ప్రకటించడం తెలిసిందే. ఇంత మేర కలెక్షన్‌కు సంబంధించి ఐటి చెల్లించారా...? అనే దానిపై ఐటి అధికారులు లెక్కలు తీస్తున్నారు. టాలీవుడ్ నిర్మాతలు సినిమాలను రూపొందించిన సమయంలో వ్యాపార లావాదేవీలు ఎలా జరిగాయి...? ఇదే సమయంలో వచ్చిన లాభా లకు సంబంధించి పలువురు నిర్మాతలు ఐటి సవ్యంగా చెల్లించడం లేదని వచ్చిన అభియోగాలతో ఐటి అధికారులు ఈ దాడులు చేసినట్లు తెలిసింది. దిల్ రాజుతో పా టు పుష్ప 2 నిర్మాత నవీన్ యర్నేని నివాసంలోనూ ఐటి అధికారులు సోదాలు నిర్వహించారు. దీంతో పాటు మ్యాంగో మూవీ మేకర్స్ కార్యాలయంలోనూ సోదాలు జరిగాయి. జూబ్లీహిల్స్, మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, బంజారాహిల్స్‌లలో ఐటి అధికారుల సోదాలు జరిగాయి. సోదాల సమయంలో బయటి వ్యక్తులను లో పలికి రానివ్వలేదు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఫ్లడ్‌రూటింగ్ అంతర్రాష్ట్ర సిఇలతో సాంకేతిక బృందం ఏర్పాటు

### సమన్వయంతో కృష్ణాగోదావరి బేసిన్‌ల ప్రాజెక్టుల నిర్వహణ

### ఎన్‌డిఎస్ఏ సిఫార్సులకు అనుగుణంగా ఐఐటి రూర్కీ ఐఐటితో అధ్యయనం

### ఆనకట్టభద్రతపై రాష్ట్రకమిటీ సమావేశంలో ఇఎన్‌సి అనీల్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 22,ప్రభాతవార్త:** ఫ్లడ్ రూటింగ్‌పై అంతరాష్ట్ర సిఇలతో ఒక కమిటీ వేసుకొని ప్రమాదరహితంగా వరద నిర్వహణ చేయాలని దీనికోసం ఒక అంతరాష్ట్ర వ్యవస్తను ఏర్పాటు చేసుకోవాల్సి ఉందని ఇఎన్‌సి అనీల్‌కుమార్ అన్నారు. బుధవారం ఐదవ ఆనకట్ట భద్రత సమావేశం జలసౌధలో జరిగింది. గత వర్షాకాలంలో విజయవాడలో ముంపుకు గురైన విషయం తెలియడం ద్వారా నాగార్జునసాగర్ డ్యామ్ గేట్లు ఎత్తలేదని అదే సయమంలో నీటి వరద పైనుంచి రావడంతో తీవ్ర అనిశ్చితికి గురైన సంఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా ఇక ఎగువ రాష్ట్రాలతో ఎప్పటికప్పుడు అనుసంధానం చేసుకోవడానికి మెరుగైన సమాచార వ్యవస్థతోపాటు డ్యామ్ నిర్వహణ పద్దతులు చేపట్టాలని అనీల్‌కుమార్ తెలిపారు. 174 ఆనకట్టల పరిస్థితిపై సమీక్ష చేయడంతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా సహాయం తీసుకోవడానికి వీలైన మార్గలను చర్చించారు.వరదల సమయంలో గేట్ ఆపరేషన్ ప్రోటోకాల్‌లను అభివృద్ధి చేయడానికి గోదావరి మరియు కృష్ణా బేసిన్ రిజర్వాయర్‌లలో వరద రూటింగ్ అధ్యయనాలను చేపట్టడానికి, అన్ని బేసిన్ రాష్ట్రాల మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తెలంగాణనుండి చీఫ్ ఇంజనీర్ల కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించబడింది.


ఈ క్రింది వాటిపై దృష్టి సారించి ఐఐటి రూర్కీ లేదా ఐఐటి హైదరాబాద్ ద్వారా అధ్యయనాలు నిర్వహించబడతాయని ఆయన వివరించారు.డేటా ఇంటిగ్రేషన్ జరుగాలని తెలిపారు. సాధారణంగా కురిసే వర్షపాతం వాస్తవంగా కురిసే వర్షాపాతం డేటా ఎడబ్ల్యుఎస్ రాడార్, ఉపగ్రహం ద్వారా , నవీకరించాలని సూచించారు. డిఇఎంలు, నది వరదల ప్రవాహాల రికార్డులను ఉపయోగించడంద్వారా డ్యామ్‌ల భద్రత చర్యలు చేపట్టాలని కోరారు. అధునాతన నమూనాలైన హైడ్రాలిక్ అనుకరణలతో వరద అంచనాలు, టెలిమెట్రీ నెట్‌వర్క్‌లను అమలు చేయడానికి అనుసం ధానం చేయాలని సూచించారు. రిజర్వాయర్ కార్యకలాపాలు ఎప్పటికప్పుడు అప్రమత్తంతో చూడాలని సూచించారు. నిజసమయ నమూనాలను ఉపయోగించి రిజర్వాయర్ విడుదలలను ఆప్టిమైజ్ చేయాలని అన్నారు, వాతావరణ మార్పులు ఎప్పటికప్పుడు అంచనవేయాలని కోరారు.

## సైబర్ నేరాలకు అడ్డాగా ఉన్న రష్యా

### తరువాతి స్థానాల్లో ఉక్రెయిన్, చైనా, అమెరికా

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** సైబర్ నేరాల పేరు చెప్పగానే అందరు గోల్డన్ ట్రయాంగల్‌గా పిలిచే మియన్మార్, వియత్నాం, కాంబోడియా దేశాల పేర్లే అం దరికి గుర్తుకు వస్తాయి. ఆసియా దేశాలు ముఖ్యంగా భారత్‌లో జరిగే 90 శాతం సైబర్ నేరాలకు గోల్డన్ ట్రయాంగల్ దేశాలే కీలకంగా వున్నాయని పోలీసు గణాంకా లు చెబుతున్నాయి. గోల్డన్ ట్రయంగల్ దేశాలను మించి సైబర్ నేరాలు జరిగేది రష్యా దేశం కావడం గమనార్హం. వరల్డ్ సైబర్ క్రైం ఇండెక్స్ 2024 అనే సంస్థ విడు దల చేసిన వార్షిక నివేదిక ప్రకారం ప్రపంచంలో జరిగే సైబర్ నేరాలకు మూలాలు రష్యాలోనే వున్నాయి. రష్యాలో పేరుమోసిన సైబర్ నేరగాళ్లు వున్నారని, వీరంతా ఎక్కడికి ప్రయాణించకుండా కేవలం వున్నచోటు నుంచే నేరాలకు పాల్పడుతూ కోట్లాది రూపాయలను కొల్లగొడుతున్నారని వరల్డ్ సైబర్ క్రైం ఇండెక్స్ 2024 వెల్లడించి ంది. రష్యా తరువాత సైబర్ నేరాలకు మూలాలు వున్న దేశం ఉక్రేయిన్‌గా ఆ సంస్థ పేర్కొంది. దీని తరువాత చైనా, అమెరికా, నైజీరియా, రొమేనియా దేశాలు సైబర్ నేరాలకు, బడా సైబర్ నేరగాళ్లకు సురక్షిత స్థావరాలుగా వున్నాయి. ఈ దేశాలలో వుండే బడా సైబర్ నేరగాళ్లు ప్రపంచంలోని అనేక దేశాలకు చెందిన సైబర్ నేరగా ళ్లతో దోస్తీ వుండడం విశేషం. మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లోని మహేష్ బ్యాంకులో వెలుగు చూసిన సైబర్ క్రైంలో మూలాలు నైజీరియా, రష్యాలో వెలుగు చూడడం గమనార్హం. ఈ కేసులో సైబర్ నేరగాళ్లు 12 కోట్ల రూపాయల నగదును కాజేయడం అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. మహేష్ బ్యాంకు సర్వర్‌లో చొరబడి తెలివిగా బ్యాంకులోని కీలక సమాచారాన్ని చోరీచేసి దీని ఆధారంగా నగదును కాజేయడ బ్యాంకింగ్ రంగాన్ని షాక్‌కు గురిచేసింది. ఈ కేసులో కొందరు నేరగాళ్లు పట్టుబడినా అసలైన నేరస్తులు ఇప్పటికీ చిక్కకపోగా పోయిన నగదు కూడా తిరిగిరాలేదు. ఇక గ్లోబలన సైబర్ క్రైం నివేదిక ప్రకారం 2025 నాటికి ప్రపంచ దేశాలు సైబర్ భద్రతకు పది ట్రిలియన్ డాలర్లు (సుమారు 300 కోట్ల రూపాయలు) ఖర్చు చేయాల్సి వుంటుంది. ఇదే సమయంలో ప్రపంచ దేశాలు సైబర్ నేరాల నివారణ లో సమన్వయంగా మెలగుతూ నేరగాళ్ల సమాచారంతో పాటు కొత్త తరహా నేరం జరిగిన వెంటనే ఇతర దేశాలకు దీనిపై సమాచారం అందించి ఆయా దేశాల్లో ఇటు వంటివి జరగకుండా జాగ్రత్త పడాల్సి వుంది. గడచిన 11 ఏళ్లలో సైబర్ నేరాలు 15.63 ట్రిలియన్ డాలర్లకు చేరినట్లు సైబర్ నేరాలపై పరిశోధన చేసే స్టాటిస్టా అనే మరో అంతర్జాతీయ సంస్థ పేర్కొంది. 2029 నాటికి ఇది మూడు రెట్లు పెరిగి 47 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆ సంస్థ పేర్కొంది. సైబర్ నేరగాళ్ల ధాటికి ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా అనేక కంపెనీలు కృత్రిమ మేధస్సుతో తమ డాటాను భద్రపరుచుకుంటున్నాయని ఆ సంస్థ వెల్లడించింది. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొ ందించిన టూల్స్‌ను సమ కూర్చుకుంటున్నాయని ఆసంస్థపేర్కొంది. అయినప్పటికీ సైబర్ నేరగాళ్ల నుంచిఆయా కంపెనీలకుపూర్తిగా భద్రత లభించడంలేదని ఆసంస్థ పేర్కొంది.

## ఉద్దెమర్రిలో గ్రామసభ బహిష్కరణ: కాంగ్రెస్ నేతల నిరసన



ఉద్దెమర్రి గ్రామసభలో కార్యదర్శి, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం దృశ్యం

**శామీర్‌పేట్, జనవరి 22, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలో బుధవారం గ్రామసభను కాంగ్రెస్‌పార్టీ నాయకులు బహిష్కరించారు. అర్హు లైన లబ్దిదారులకు ఇందిరమ్మఇండ్లు, రేషన్‌కార్డులు కేటాయించకుండా బీఆర్ఎస్ నాయకులుకు ఇండ్లు మంజూరు చేయడంపై కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభను కాంగ్రెస్ నాయకులు బహిష్కరించి నిరసన తెలిపారు. గ్రామసభలో అధికారులు ఎంపికైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల వివరాలు తెలియజేస్తుండగా సభ జరుగనిచ్చేది లేదని నాయకులు భీష్మించుకొని బైఠాయించారు. అధికారులు, పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికి ఫలితం లేకపోవడంతో గ్రామసభను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఉద్దెమర్రి మాజీ సర్పంచ్ వెంకటేశ్, విష్ణుగౌడ్‌లు మాట్లాడుతూ ఉద్దెమర్రి పంచాయతీ కార్యదర్శి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు చెందిన ధనవంతులకు ఇందిరమ్మఇండ్లు మంజూరు చేయించి అవినీతికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. కార్యదర్శి బీఆర్ఎస్ నేతలతో కుమ్మక్కై కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిడిఓ వత్సలాదేవి, ఎంపిఓ మంగతయారు, కార్యదర్శి మోహన్‌సింగ్, ఏఓ రవి, గిర్దావర్ తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ మార్పిడి రాకెట్‌పై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సీరియస్

### బాధ్యులైన వైద్యులపై చర్యలకు రంగం సిద్ధం

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసు పత్రిలో జరిగిన అక్రమ కిడ్నీ మార్పిడి రాకెట్‌పై తెలంగాణ వైద్య మండలి సీరియస్‌గా రియాక్ట్ అయింది. అక్రమ కిడ్నీ రాకెట్‌పై తెలంగాణ వైద్య మండలి సుమోటోగా స్వీకరించి విచారణ చేయనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. అక్రమ కిడ్నీ మార్పిడి రాకెట్‌కు సంబంధించిన అలకనంద హాస్పిటల్ వైద్యులపై టీజీఎంసీ చైర్మన్ డా మహేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీజీఎంసీ వైస్ చైర్మన్ డా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కి న్యాయస్థానాన్ని పోలిఉండే అధికారాలు కలిగి ఉన్నాయని అక్రమ కిడ్నీ మార్పిడి కుంభకోణంలో ఉన్న వైద్యులపై ప్రభుత్వ, పోలీస్ సహకారంతో ఎతికల్, మాల్ ప్రాక్టీసెస్ కమిటీ ఆధ్వర్యంలో విచారణ జరిపి బాధ్యులైన వైద్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా కిడ్నీ మార్పిడి చేయడం, లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, నకిలీ వైద్యులను ప్రోత్సహించడం చట్ట విరుద్ధమైన చర్యలు అని.. అందుకు బాధ్యులు అయినా వైద్యులను అవసరం అయితే శాశ్వతంగా మెడికల్ కౌన్సిల్ రిజిస్టర్ నుండి తొలగిస్తామని.. అలాంటి వైద్యులు వైద్య పరంగా ఎటువంటి సేవలు అందించలేరని మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేష్ కుమార్ తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం

**రెవెన్యూ శాఖ (భూ సేకరణ)**

**ఫారం-6**

**ప్రాథమిక నోటిఫికేషన్**

(చట్టం-30/2013 లోని సెక్షన్ 11 (1) లోని సబ్ రూల్ (1) రూల్ (19) ప్రకారం)

G1/49/2025 తేది: 03.01.2025

ఫైల్ నెం. సి/18/2023 తేది: .01.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా కట్టంగూర్ గ్రామం, మండలం కట్టంగూర్ భూమి విస్తీర్ణం: ఎ.16.18 1/2 గుంటలు పట్టా భూమి ప్రజా ప్రయోజనార్థం ఉదయసముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ లో భాగంగా డి-8, కుడి ప్రధాన కాలువ కి.మీ. 17.200 నుండి కి.మీ. 18.535 & డి-7 కి.మీ. 14.291 నుండి కి.మీ. 14.900 & 27 ఎల్ మైనర్ కాలువ కి.మీ. 0.685 నుండి కి.మీ. 1.240 మరియు 24ఎల్ మైనర్ కాలువ కి.మీ. 0.000 నుండి కి.మీ. 1.025 వరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 30/2013 లోని సెక్షన్ (11) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

తెలంగాణా ప్రభుత్వం వారు జి. ఓ. యం. ఎస్. నెం.54 ఇరిగేషన్ (ఎల్.ఎ., ఆర్ & ఆర్/2ఎ) కాడ్ & డిపార్ట్మెంటు తేది: 26-07-2017 నాడు జారీ చేసినారు అట్టి జి.ఓ. నందు ఉదయ సముద్రం భూసేకరణ చట్టం 2013 క్రింద అధ్యాయము II & III ఈ ప్రాజెక్ట్ నుండి మినహాయించబడినది.

కావున ఈ ప్రాజెక్టు క్రింద నల్లగొండ జిల్లా, కట్టంగూర్ గ్రామం, మండలం కట్టంగూర్ విస్తీర్ణం ఎ.16.18 1/2 గుంటలు పట్టా భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

షెడ్యూలు

గ్రామం: కట్టంగూర్ మండలం: కట్టంగూర్ జిల్లా: నల్లగొండ

| క్ర.మ సంఖ్య | సర్వే నెం భూమి స్వభావం ఖుష్కి / తరి | భూసేకరణ చేయు విస్తీర్ణం ఎ.గుం. | భూమిని కోల్పోయే రైతు/ అనుభవదారు పేరు తండ్రి / భర్త పేరు | ప్రదేశముపై ఉన్న చెట్లు/ నిర్మాణములో ఉన్న ఇతరములు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| డీ8 డి-8 కుడి ప్రధాన కాలువ కి.మీ. 17.200 నుండి 18.535 | | | | |
| 1 | 31 ఖుష్కిపట్టా 2.03 1/2 | 0.20 | చింతల ఎల్లయ్య తండ్రి వర్దయ్య | --- |
| 2 | | 0.14 | రూపాని లక్ష్మం తండ్రి ఉదయ్య | -- |
| 3 | | 1.09 1/2 | ఐతగోని సైదులు, ఎల్లయ్య మరియు జానయ్య తండ్రి వెంకులు | 103 నిమ్మ చెట్లు పైప్ లైన్ |
| 4 | 35 ఖుష్కిపట్టా 0.31 1/2 | 0.13 | ఐతగోని నాగేష్, సైదులు & లక్ష్మీనారాయణ తండ్రి అంజయ్య | పైప్ లైన్ |
| 5 | | 0.18 1/2 | పచ్చల లక్ష్మమ్మ భర్త వెంగయ్య | -- |
| 6 | 37 ఖుష్కిపట్టా 0.17 1/2 | 0.09 | పచ్చల వెంగయ్య తండ్రి వెంకటయ్య | హెచ్.డి.పి.ఇ. పైప్‌లైన్ |
| 7 | | 0.06 1/2 | రాజిపేట శైలజ భర్త అమరేందర్ | -- |
| 8 | | | రాజిపేట అమరేందర్ తండ్రి బ్రహ్మచారి | --- |
| 9 | | 0.02 | ఎర్రల సత్తయ్య తండ్రి వీరయ్య | 2 మామిడి చెట్లు 8 తాటి చెట్లు |
| 10 | 38 ఖుష్కిపట్టా 0.20 | 0.20 | ఎర్రల పద్మావతి భర్త సత్తయ్య | -- |
| 11 | 40 ఖుష్కిపట్టా 1.11 1/2 | 0.12 | ఎర్రల పెంటయ్య తండ్రి ఉదయ్య | 2 తాటి చెట్లు |
| 12 | | 0.04 1/2 | కన్న నాగేశ్వరి భర్త రాజులు | -- |
| 13 | | 0.15 | వేదిరె సుదర్శన రెడ్డి తండ్రి జైపాల్ రెడ్డి | -- |
| 14 | | | నమ్మూరి సీతారాం రెడ్డి తండ్రి జనార్దన్ రెడ్డి | -- |
| 15 | | | పల్లె రాంరెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి | -- |
| 16 | | | కతకుడు శ్రీనాథ్ రెడ్డి తండ్రి హరినాథ్ రెడ్డి | -- |
| 17 | 43 ఖుష్కిపట్టా 0.35 1/2 | 0.20 | బోగుల రాములు తండ్రి వెంకట్రాములు | -- |
| 18 | | 0.12 | సుంకరబోయిన శంకర్ తండ్రి సోములు | పైప్ లైన్ |
| 19 | | 0.06 1/2 | పొడిచేటి సైదులు తండ్రి రాములు | -- |
| 20 | | 0.10 | సుంకరబోయిన శంకర్ తండ్రి సోములు | -- |
| 21 | | 0.07 | గడిగొని ఎల్లమ్మ భర్త అశయ్య | 1 బోర్ |
| 22 | 66 ఖుష్కిపట్టా 0.35 1/2 | 0.07 | గడిగొని అశయ్య తండ్రి ముత్తిలింగయ్య | -- |
| 23 | | 0.07 1/2 | గడిగొని శ్రీను తండ్రి రాములు | 1 తాటి చెట్టు |
| 24 | | 0.05 | గడిగొని జానమ్మ భర్త ఎల్లయ్య | 1 తాటి చెట్టు |
| 25 | | 0.04 1/2 | మడిగొని సోములు తండ్రి నల్లయ్య | 1 తాటి చెట్టు |
| 26 | | 0.011 1/2 | గడిగొని ఎల్లమ్మ భర్త అశయ్య | -- |
| 27 | 67 ఖుష్కిపట్టా 0.03 | 0.03 | గడిగొని రేణుక తండ్రి లక్ష్మీనారాయణ | -- |
| 28 | 65 ఖుష్కిపట్టా 0.32 | 0.25 | మడిగొని సోములు తండ్రి మల్లయ్య | -- |
| 29 | | 0.07 | పొడిశెట్టి కళ్ళమ్మ భర్త నరసింహ | -- |
| 30 | 64 ఖుష్కిపట్టా 0.02 | 0.02 | గుండు నాగమ్మ భర్త సైదులు | -- |
| 27 L Minor from Km. 0.685 to 1.240 | | | | |
| 31 | 307 ఖుష్కిపట్టా 1.01 | 0.09 1/2 | బండి నర్సిరెడ్డి తండ్రి నారాయణ రెడ్డి | 29 నిమ్మ చెట్లు 14 తాటి చెట్లు |
| 32 | | 0.14 1/2 | ఊటుకూరి నాగి రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి | 40 నిమ్మ చెట్లు 30 తాటి చెట్లు |
| 33 | | 0.09 | ముడిరెడ్డి వెంకటరమణ రెడ్డి తండ్రి లక్ష్మం రెడ్డి | 9 తాటి చెట్లు |
| 34 | | 0.08 | పొడిశెట్టి రామలింగయ్య తండ్రి లింగయ్య | 10 మామిడి చెట్లు 11 తాటి చెట్లు 2 నిమ్మ చెట్లు |
| 35 | 309 ఖుష్కిపట్టా 0.32 | 0.09 | పొడిశెట్టి రామలింగయ్య తండ్రి లింగయ్య | -- |
| 36 | | 0.10 1/2 | పొడిశెట్టి శంకరయ్య తండ్రి లింగయ్య | -- |
| 37 | | 0.12 1/2 | పొడిశెట్టి భిక్షమయ్య తండ్రి లింగయ్య | -- |
| Reach D7 from Km 14.291 to 14.900 | | | | |
| 38 | 553 ఖుష్కిపట్టా 1.30 | 0.09 | మారగొని రాములు తండ్రి లింగయ్య | -- |
| 39 | | | మారగొని సైదమ్మ భర్త మారయ్య | --- |
| 40 | | 0.25 | వేనం కృష్ణ తండ్రి వెంకటయ్య | -- |
| 41 | | | వేనం సైదులు తండ్రి వెంకటయ్య | -- |
| 42 | | 0.03 | బండమీది అందాలు భర్త కృష్ణయ్య | -- |
| 43 | | | మన్నెం లింగయ్య తండ్రి బాలయ్య | -- |
| 44 | | 0.33 | మన్నెం ఎల్లయ్య తండ్రి బాలయ్య | -- |
| 45 | 554 ఖుష్కిపట్టా 1.15 1/2 | 0.02 | కంబంపాటి శ్రీను తండ్రి భిక్షమయ్య | -- |
| 46 | | 0.29 | మన్నెం లింగయ్య తండ్రి బాలయ్య | -- |
| 47 | | | మన్నెం ఎల్లయ్య తండ్రి బాలయ్య | -- |
| 48 | | 0.01 | బల్లుబండి కృష్ణ మూర్తి తండ్రి రామలింగయ్య | -- |
| 49 | | 0.11 | కంబంపాటి వీరయ్య తండ్రి రామలింగయ్య | -- |
| 50 | | 0.12 1/2 | మద్దెల రాములమ్మ భర్త నర్సయ్య | -- |
| 51 | 552 ఖుష్కిపట్టా 0.22 1/2 | 0.22 1/2 | మద్దెల రాములమ్మ భర్త నర్సయ్య | -- |
| 52 | 568 ఖుష్కిపట్టా 0.20 | 0.20 | పడకంటి రంగారెడ్డి తండ్రి జంగారెడ్డి | -- |
| 53 | | | ఆక్కి రఘునాథ రెడ్డి తండ్రి నరసింహారెడ్డి | -- |
| 54 | 567 ఖుష్కిపట్టా 0.00 1/2 | 0.00 1/2 | వంగాల పిచ్చమ్మ భర్త జీడికల్లు | -- |
| Reach 24 L Minor 0.000 to 1.025 | | | | |
| 55 | 434 ఖుష్కిపట్టా 0.15 1/2 | 0.07 | ఎర్రల శంకరయ్య తండ్రి కృష్ణయ్య | -- |
| 56 | | 0.08 1/2 | ఎర్రల సత్తయ్య తండ్రి జీడికల్లు | -- |
| 57 | 420 ఖుష్కిపట్టా 0.18 1/2 | 0.10 1/2 | బుర్ర జితేందర్ తండ్రి సారయ్య | -- |
| 58 | | 0.06 | పచ్చ కృష్ణమూర్తి తండ్రి వెంగయ్య | -- |
| 59 | | 0.02 | ఎర్రల శంకరయ్య తండ్రి కృష్ణయ్య | -- |
| 60 | 419 ఖుష్కిపట్టా 0.16 | 0.16 | సోమగోని శంకర్ గౌడ్ తండ్రి వీరయ్య | 51 బత్తాయి చెట్లు |
| 61 | 415 ఖుష్కిపట్టా 0.34 1/2 | 0.34 1/2 | సోమగోని శంకర్ గౌడ్ తండ్రి వీరయ్య | -- |
| 62 | 416 ఖుష్కిపట్టా 0.20 | 0.20 | సోమగోని శంకర్ గౌడ్ తండ్రి వీరయ్య | -- |
| | మొత్తం విస్తీర్ణం | 16.18 1/2 | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని కేంద్ర భూసేకరణ చట్టం, 2013 (చట్టం నెం. 30/2013) లోని నియమంలోని సెక్షన్ 11 (1) సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లింపుకు గాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్.ఏ., విభాగం-2, నల్లగొండ మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్, డివిజన్ నెం. 6, జి. వి. గూడెం, నల్గొండ గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా కార్యాలయము పనిదినములలో మరియు పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్.ఏ. విభాగం-2, నల్లగొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్-12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే, భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర్వాది పనులు చేపట్టటానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణ కొరకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ముందస్తు అనుమతి లేకుండా, ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో పరిహరించబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకాలు, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల, మరియు నష్టపరిహారము సంప్రదింపుల ద్వారా పరిష్కారం కొరకు చట్టంలోని సెక్షన్-15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్లగొండ గారికి లేదా ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్.ఏ. విభాగము-2, నల్లగొండ గారికి లిఖిత పూర్వకముగా ప్రకటన జారీ చేసిన 60 (అరవై) దినముల లోపల తెలియజేయవలసి ఉన్నది.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్ & ఆర్ & ఎల్.ఏ. విభాగం-2 నల్లగొండ

సం/- అదనపు కలెక్టర్ నల్లగొండ

సం/- జిల్లా కలెక్టర్ నల్లగొండ

DIPR.RO.NO: 616/LA/PP/Advt/Pub/2024-25

వార్త

నేరం చేసిన వాడిని శిక్షించడమే ప్రధానం కాదు. ఆ నేరం చేయడానికి ఏ పరిస్థితులు అతణ్ణి పురికొల్పాయో వాటిని తొలగించడం ప్రధానం.

-ఎమ్.ఎన్.రాయ్

# భూగర్భజల సంక్షోభం?


నీటిని నీలిబంగారం అంటారు. వాస్తవంగా చెప్పాలంటే అసలు బంగారం కన్నా నీలి బంగారమే అత్యంత విలువైంది. గొంతు తడారి పోతున్న వ్యక్తికి కావల్సింది గుక్కెడు నీళ్లే తప్ప బండెడు బంగారం కాదు. దురదృష్టం ఏమిటంటే వేసవిలో నీరు గగనమైపోతున్నది. వర్షాకాలంలో అంచానకు మించి వర్షాలు కురుస్తున్నా వేసవి వచ్చేసరికి నీటికష్టాలు ఇబ్బడిముబ్బడిగా ఏర్పడుతున్నాయి. ఈసారి కూడా ఎండాకాలంలో మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చే పరిస్థితులు గోచరిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో భూగర్భ మట్టాలు యేడాదియేడాదికి దిగజారిపోతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా కూడా భూగర్భజలాల వాడకం ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. ఇందులో ఎనభై శాతానికిపైగా వ్యవసాయానికి, పదిహేను శాతం పరిశ్రమలకు, తాగునీటి అవసరాలు తీర్చుకోవడానికి వినియోగించుకుంటున్నారు. వినియోగం నానాటికీ తీవ్రస్థాయిలో పెరుగుతున్నప్పటికీ ఆ మేరకు భూగర్భ జలాల భర్తీకి ప్రయత్నాలు జరగకపోవడంతో మట్టాలు నానాటికీ తగ్గిపోతున్నాయి. మరొకపక్క గోదావరి, కృష్ణా, గంగా, యమున, కావేరి లాంటి జీవ నదుల నుండి కోట్లాది ఎకరాలకు సరిపడే నీరు నిరుపయోగంగా సముద్రం పాలవుతున్నది. ప్రపంచంలో ఎక్కడలేని విధంగా దాదాపు మూడువందల ఘనపుకిలో మీటర్లకుపైగా భూగర్భజలాలు భారత్‌లో వినియోగించుకుంటున్నారు. దేశంలో ఆరువేల ఐదువందల డెబ్బైరెండు భూగర్భజలాల బ్లాకులు ఉండగా, వీటిలో మూడో వంతు బ్లాకుల్లో అవసరానికి మించి భూగర్భజలాలు తోడేస్తున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మిగతా బ్లాకులు పరిధిలోకి చేరుకొని దేశంలో భూగర్భజలాలు మరింత అడుగంటిపోతాయి. భారత్‌లో బోరుబావుల సంఖ్య గత అరవైయేళ్లలో దాదాపు నూటయాభై రెట్లుపైగా పెరిగింది. ఇంకా పెరుగుతూనే ఉన్నది. వీటివల్ల కోట్లాది మంది సన్నకారు, చిన్నకారు రైతులు లాభపడిన మాట వాస్తవమే అయినా నీటి సంరక్షణ పద్ధతులు పాటించకుండా పొదుపు విస్మరించడంతో నానాటికీ బోరుబావుల మీద అధికంగా ఆధారపడే పరిస్థితి అనేక అనర్థాలకు దారితీస్తుందని భూగర్భ శాస్త్ర నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. భూగర్భ జలాలను వృధాచేయడం కూడా పెరిగిపోతున్నది. పంజాబ్‌లో డెబ్బైఐదు శాతం, రాజస్థాన్‌లో అరవైశాతం, కర్ణాటకలో, తమిళనాడుల్లో నలభైశాతంపైగా భూగర్భజలాలు వాడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరో రెండు దశాబ్దాల్లో దేశ వనరుల్లో అరవైశాతంపైగా హరించుకుపోతాయని ప్రపంచబ్యాంకు గతంలో ఒక నివేదికలో హెచ్చరించింది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు రాజస్థాన్, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లో యేటా అరవైలక్షల కోట్ల లీటర్ల మేర భూగర్భజలాలను తోడేస్తుండడంతో సముద్ర మట్టాల్లో దాదాపు ఐదుశాతం పెరుగుదల నమోదు అవుతుందని గతంలో జరిపిన అధ్యయనంలో వెల్లడయింది. మరొకపక్క దేశంలో అధికశాతం జిల్లాల్లో భూగర్భజలాలు తాగుయోగ్యమైనవే కావని, కేంద్రప్రభుత్వం అంగీకరించడం కలవరపరిచే పరిణామమే. గతంలో ప్రభుత్వం వెల్లడించిన గణాంకాల ప్రకారం 254 జిల్లాల్లోని భూగర్భ జలాల్లో ఇనుము 224 జిల్లాల్లో ఫ్లోరైడ్, 162 జిల్లాల్లో క్షారత, 34 జిల్లాల్లో భూగర్భజలాలలో పాషాణస్థాయి అధికంగా ఉన్నట్లు వెలుగుచూసింది. రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ముఖ్యంగా పాషాణం లాంటి లోహాలను భూగర్భజలాల నుంచి తొలగించడం కష్టతరంగా మారుతుందని అధికార వర్గాలు అంగీకరిస్తున్నాయి. ఉచిత విద్యుత్ సరఫరాకూడా బోరుబావుల సంఖ్య పెరగడానికి కారణం అవుతున్నది. చట్టాలు, నిబంధనలు ఎన్ని ఉన్నా అంతగా అమలు కాకపోకవడం కూడా మరొక కారణంగా చెప్పొచ్చు. ఇక కొన్ని పరిశ్రమలు ప్రధానంగా శీతలపానీయాలు, మద్యం తయారీ కంపెనీలు భారీ స్థాయిలో భూగర్భజలాలను వినియోగించుకుంటున్నాయి. ఇంకొక పక్క దేశవ్యాప్తంగా మునిసిపాలిటీల్లో కూడా వాడకం పెరిగిపోతున్నది. పాలకులకు చిత్తశుద్ధి, ప్రజల్లో అవగాహన లోపించిన కారణంగానే భూగర్భజలాల సమస్య రోజురోజుకు తీవ్ర రూపం దాలుస్తుందనే ఆందోళనలను తోసిపుచ్చలేం. భూగర్భ జలాల మట్టాల పెంపునకు దేశవ్యాప్తంగా చర్యలు తీసుకోవాల్సిన తరుణమిది. తెలంగాణ ప్రభుత్వం గతంలో మిషన్ కాకతీయ కార్యక్రమం తర్వాత చెరువులు, కుంటల్లో పూడికలు తీయించి మరమ్మత్తులు చేయించడంతో చాలా ప్రాంతాలలో భూగర్భజలాలు కొంతమేరకు పెరిగాయని చెప్పొచ్చు. కానీ అవి వాడుతున్న భూగర్భ జలాల మట్టాల ను భర్తీ చేయలేకపోతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలకు మంచినీటి సమస్య తీవ్రరూపం దాలు స్తున్నది. కోట్లాది మంది ప్రజలు పడరానిపాట్లు పడుతు న్నారు. దాహం తీర్చుకునేందుకు అందుబాటులో ఉన్న కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. కేవలం కలుషిత నీరువల్లనే దాదాపు ఇరవైఎనిమిది రకాల వ్యాధులు సంభవిస్తున్నాయని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. మరొకపక్క దేశవ్యాప్తంగా కోట్లాది రూపాయల మంచినీటి వ్యాపారం జరుగుతున్నది. యేడాది యేడాదికి ఆ వ్యాపారం విస్తరించిపోతున్నది. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా ఇప్పటికీ ప్రజలందరికీ కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన మంచినీరు అందించలేని దురదృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టిసారించాలి.

అవసరానికి ఆదుకొనే మిత్రులున్న వ్యక్తి అదృష్టవంతుడు. కానీ మిత్రుల సహాయాన్ని స్వీకరించాల్సిన అవసరం రాని వ్యక్తి ఇంకా అదృష్టవంతుడు.



వార్విక్

అతిథి అంటే ఇంటికొచ్చిన బంధువు మాత్రమే కాదు. ఆకలి బాధతో మిమ్మల్ని ఆశ్రయించిన ప్రతిజీవి, పశుపక్ష్యాదులు సైతం అతిథులే.



వి.జాన్సన్

# ప్రజావాక్కు



### ఏమిటీ హత్యలు, ఆత్మహత్యలు?

ఇవి కొత్త కాకపోయినా ఈ మధ్య మరీ ఎక్కువయ్యాయి. భార్య భర్తలు మస్పర్థలతో పవిత్ర వివాహ బంధానికి ఏమాత్రం విలువనివ్వక ఒకరినొకరు చంపుకుంటున్నారు. ఇక ప్రేమించలేదని, పెద్దలు ఒప్పుకోలేదని, పరువు హత్యలు. ఇలా బహురూపాలలో జీవితాలు నాశనమైపోతున్నాయి. పిల్లలు సెల్ ఫోన్లను వదలటం లేదు. మందలిస్తే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీరికి ఫోన్లను అలవాటు చెయ్యొద్దు మొర్రోఅనిమేధావులు పేపర్లలో టీవీలలో మొరపెట్టినా కన్నవారికి జ్ఞానోదయం కాకపోవటం మిక్కిలి విషాదకరం. ఇకపోతే కోల్‌కతాహాస్పిటల్ హత్యాచారం కేసులో నిందితుడు సంజయ్ రాయ్‌కు చనిపోయే వరకూ జీవిత ఖైదువిధించడం, అలాగే ప్రియుడికి కూల్ డ్రింక్‌లో విషం కలపి హతమార్చిన యువతికి మరణ శిక్ష ఖరారు చేయడం చాలామంచిపని. హత్యలు, మానభంగాలు చేసిన వారికి సైబర్ క్రిమినల్స్‌కు మరణ దండనే సరియైన తీర్పు కాగలదు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి

మహిళా సాధికారతకావాలని అనుకుంటే మరింత ఊతం పొదుపుసంఘాలకు అందించడంఅవసరం. ఉపాధి హామీలోఒక వ్యక్తికి ఉన్నఅర్హత కలిగిన 100రోజుల పని పూర్తి చేయించడం ద్వారా ఉన్నతి కార్యక్రమం ద్వారా మరింత మంది మహిళలను వ్యాపార వేత్తలుగా సొంత వ్యాపారస్తులుగా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడం సాధ్యం అవుతుంది. ఆహార రంగాలు, బట్టల పరిశ్రమ కుట్లు అల్లికలు వాతావరణం వేడెక్కకుండా చేపట్టేపేపర్ ప్లేట్ల పరిశ్రమలకు యజమానులుగా మహిళలు ఎదిగే అవకాశము ఉంది. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్ లాంటిరాష్ట్రాలు నేత పరిశ్రమ హబ్‌లుగా తీర్చిదిద్దే అవకాశం ఉంది.

-భారత అవినాష్, జనగామ

### ప్రమాదకరం

ఈమధ్య కొందరు ట్రిపుల్ రైడింగ్ చేస్తూ వాహనాలను వేగంగా నడుపుతూ ప్రమాదాలబారిన పడుతున్నారు. రోడ్డుదాటుతున్న పాదచారులని ఢీ కొడుతూవారి ప్రాణాలు పోవడానికి, అంగవైకల్యానికి కారణమవుతున్నారు. అంతేకాదు రాంగ్‌రూట్లో వెళుతూ ఇతర వాహనదారులని ఇబ్బందిపెడుతున్నారు. ప్రమాదాలకుకారకులవుతున్నారు.

-ఎం.సాగర్, నల్గొండ

### నకిలీ డాక్టరేట్లు

విద్యార్థులు ఏళ్ల తరబడి రాత్రింబవళ్లు చదివి డాక్టరేట్ పట్టా తీసుకుంటుంటే, వివిధవిభాగాల్లో ప్రముఖులు, పలు రంగాల్లో అత్యున్నత సేవలుఅందించిన వారికిగుర్తింపుగా గౌరవ డాక్టరేట్ ప్రదానం చెస్తున్నాయి. పలుయూనివర్సిటీలు అయితే అలాంటి గౌరవడాక్టరేట్ల విశిష్టమైనపట్టాకు విలువ లేకుండా చేస్తున్నారు. కొందరు ప్రబుద్ధులు నకిలీ యూనివర్సిటీలను పెట్టి, డబ్బులు తీసుకొని గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేస్తున్నారు. అత్యంత గౌరవప్రదమైన డాక్టరేట్లను సంతలో కూరగాయలను అమ్మినట్టు అమ్ముతున్నారు. దేశంలో కొందరు నకిలీ యూనివర్సిటీల నిర్వాహకులు సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకొని, ఏజెంట్ల ద్వారా ప్రచారం చేసుకుని ఫేక్ డాక్టరేట్లను యథేచ్ఛగా విక్రయిస్తునాయన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా ఈ నకిలీ దందా జోరుగా సాగుతున్నా ప్రభుత్వ పరంగా నియంత్రణా చర్యలు చేపట్టడం దురదృష్టకరం. ఇటువంటి నకిలీ డాక్టరేట్లతో కొందరు యునివర్సిటీలలో అధిక వేతనాలకు ఉద్యోగాలు కూడా పొందుతున్నారు.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

### సిబ్బందిని నియమించాలి

దేశవ్యాప్తంగా పులుల అభ్యరణ్యాలనిర్వహణకు దేశవ్యాప్త విధానం ఉండాలని సుప్రీంకోర్టు సూచించడం ఎంతో అవసరం, విలువైనది. ఏపిలో కొన్ని జిల్లాల్లో పులి ప్రయాణికులకు ఎదురుపడిన భయానక స్థితికి ప్రభుత్వ యంత్రాంగం సవాలుగా తీసుకొని చర్యలు చేశారు. ఇచ్చట ఇతర శాఖల సమన్వయం కోసం దేశవ్యాప్త విధానం రాష్ట్రాలకు ఎంతో మార్గదర్శకం. దీని అమలు కొంత భయాన్ని నివారిస్తుంది. సిబ్బంది అందుబాటు కూడా ముఖ్యం.

-బొల్లోజు మెఘూనాథం, విశాఖపట్నం

### పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి!

పిల్లలు చెడు అలవాట్లకు బానిసలవడానికి ముఖ్య కారణం గారాబమే! పిల్లలను గారాబంగానే పెంచాలి, కాని అది హద్దుమీరినట్లయితే కొంప మునుగుతుంది చిన్నతనంలోనే పిల్లలు చేసే తప్పులను వెంటనే సరిదిద్దాలి. పసిపిల్లలు వాళ్లకేం తెలుసు అని అశ్రద్ధ చేస్తే, అవే క్రమంగా పెద్దవై వారి జీవిత పతనానికి కారణం అవుతాయి. తల్లిదండ్రులు కాస్త తీరిక చేసుకొని రోజుకు కనీసం ఒక గంటసేపయినా పిల్లల వద్ద కూర్చుని చదివించాలి.

- కె. నాగేంద్ర, హైదరాబాద్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్యాకేజీలతో సరా! సొంత గనులివ్వరేం!

**విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మినహా దేశంలో అన్ని ఉక్కు కర్మాగారాలకు 'కాప్టివ్ మైన్స్' (మూల గనులు) ఉన్నాయి. ప్లాంట్ నిరంతరం పని చేయడానికి వీలైనంత ఎక్కువ బఫర్ స్టాక్‌ను ఉంచుకోవడానికి వీలుగా వెంటనే ఇనుప ఖనిజం గనులను కేటాయించవలసిన అవసరం ఉంది. విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంతంగా గనులు కేటాయించడం అవసరం. దీనిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్పకుండా కేంద్రప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ప్యాకేజీ ప్రకటించడం కేవలం కంటితుడుపు చర్య మాత్రమే. స్టీల్ ప్లాంట్‌కు ఉన్న సమస్యలకు అది ఎంత మాత్రమూ శాశ్వత పరిష్కారం కాదు.**

చిమ్మె.జాన్ బర్నబాస్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆరు దశాబ్దాల క్రితం అమృతరావు అనే దళితుడు నిరాహార దీక్ష చేయగా 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అంటూ పెద్ద ఉద్యమానికి దారితీసింది. అప్పటి విశాఖ పట్టణం, లోక్‌సభ సభ్యుడు తెన్నేటి విశ్వనాథం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విశాఖ ఉక్కు కోసం కమిటీల్ప ఏర్పడి నిరాహార దీక్షా శిబిరాలు అన్ని పట్టణాలలో ఏర్పాటు చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు తీవ్రమైన నిరసనలు చేపట్టారు. ఈ పోరాటంలో అనేక మంది ప్రజలు ప్రాణాలర్పించారు. సుదీర్ఘమైన పోరాటంతో దిగివచ్చి ఆనాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ఆంధ్రప్రదేశ్‌కు ఉక్కు ఫ్యాక్టరీని ప్రకటించి విశాఖ పట్టణంలో ఏర్పాటుకు అంగీకరించింది. ఇలా పోరాట ఫలితంగా ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్రప్రభుత్వం సన్నాహాలు చేస్తుండడంతో తెలుగు ప్రజలు తీవ్ర ఆవేదన చెందారు. దాదాపు ఐదు సంవత్సరాల నుంచి విశాఖపట్టణంలో నిరసనలు, నిరాహార దీక్షలు, రాస్తారోకోలు, సభలు అన్నీ ఏర్పాటు చేశారు. అందులో పనిచేస్తున్న కార్మికులు, వాటి అనుబంధ సంఘాలు వారికి సంఘీభావం తెలుపుతున్న ప్రజలు ప్రజాసంఘాలు ఆందోళనతో పాల్గొంటున్నారు. దాదాపు వెయ్యిరోజుల నుంచీ నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. తాజాగా ఈ నిరసనలను శాంతింప చేయడానికీ, ప్రజలను మభ్యపెట్టడానికే కేంద్రప్రభుత్వం 11వేల 500 కోట్ల నిధులతో ఒక ప్రత్యేక ప్యాకేజీని ఈ ఉక్కు ఫ్యాక్టరీని ప్రకటించింది. కానీ వాస్తవానికి ఉక్కు ఫ్యాక్టరీకి కావలసింది ప్యాకేజీలు కాదు సొంత గనులు కావాలి. రాష్ట్రానికి సమీపంలో ఉన్న ముడిఖనిజం గనులతోనే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని పునరుజ్జీవింప చేసే విధంగా యోచించాలి. అదే ఆంధ్ర ప్రజల ఆకాంక్ష. కేంద్రప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీకేవలం కంటి తుడుపు చర్య మాత్రమే. ఈప్యాకేజీని రాష్ట్ర ప్రజలు అంగీకరించడం లేదు. ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకొని ప్రభుత్వమే దానిని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేట్‌పరం చేయబోమనే ప్రకటన ఇంత వరకూ కేంద్రప్రభుత్వం చేయడం లేదు. తెలుగుదేశం జనసేన, భారతీయ జనతా ప్రభుత్వం అధికారంలో ఉన్నందున కలిసివచ్చే లోక్‌సభ సభ్యుల మద్దతుతో కేంద్రప్రభుత్వాన్ని ఇప్పుడే ఒప్పించాలి. కేంద్రప్రభుత్వం ఆధారపడి ఉన్నది కాబట్టి ఈ సమయంలో కాకుండా భవిష్యత్తులో కేంద్రప్రభుత్వం రాష్ట్రప్రభుత్వ మాటను అంగీకరించే పరిస్థితిఉండదు. కేంద్రప్రభుత్వం రూ. 11,500 కోట్ల ప్యాకేజీ ఇచ్చేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ కూడా ఆమోదించింది. దీనికి అనుకూల మీడియా కేంద్రం 'విశాఖ ఉక్కుకు ప్రత్యేక ప్యాకేజీ' అంటూ గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. కేంద్రం నిర్ణయాన్ని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటిస్తూ 'ఇది భారీ పునరుద్ధరణ ప్యాకేజీ స్టీల్ రంగంలో విశాఖ ఉక్కు ప్రధానమైన సంస్థ. విశాఖ ఉక్కుపోర్ట్ ఆథారిటీ స్టీల్‌ప్లాంట్. ఈ పరిశ్రమను ఏళ్లతరబడి సమస్యలు వేధిస్తున్నాయి. విశాఖ ఉక్కును ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీ తక్షణమే అమలులోకి వస్తుంది. త్వరలో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ప్రారంభమవుతాయి. ఆగస్టు నాటికి మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు అందుబాటులోనికి వస్తాయి. ముడి ఖనిజం కోసం ఎన్ఎమ్‌డిసితో చర్చి



స్తున్నాం. ఆత్మనిర్భర్ భారత్‌లో విశాఖ ఉక్కుది కీలకపాత్ర. దేశ ఉక్కు అవసరాలు తీర్చడంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ది కీలకపాత్ర. అంటూ అధికారికంగా కేంద్రమంత్రి ప్రకటించారు. అయితే ఆచరణలో కేంద్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని గౌతమ్ అదానీకి అప్పచెప్పడానికి గత నాలుగు సంవత్సరాలుగా తీవ్ర ప్రయత్నం చేసిన నేపథ్యంలో తాజా ప్రకటన కాస్త ఊరట నిచ్చిందనుకున్నా ఉక్కు ఫ్యాక్టరీ భవిష్యత్‌పై ఇంకా ఆందోళన తొలగలేదు. విశాఖఉక్కు ఫ్యాక్టరీని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాతో విలీనం చేయడానికి కేంద్రప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోంది? ఈ ప్రశ్న ఉదయిస్తోంది. విశాఖఉక్కును బలోపేతం చేయడానికి అవసరమైన గనులను కేంద్ర ప్రభుత్వం కేటాయించకుండా ఒకరకంగా విశాఖ ఉక్కును బలహీనపరుస్తున్నదనే చెప్పాలి. బలోపేత చర్యలు చేపట్టకుండానే ఇప్పుడు ప్యాకేజీ ప్రకటించింది. ఎంతో మంది కార్మికులు విశాఖ ఉక్కు నిలబెట్టుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. గతఐదు సంవత్సరాల నుంచి కేంద్రప్రభుత్వ చర్యలను తిప్పికొడుతున్నారు. ప్రజాపోరాటాలకు భయపడే కేంద్రప్రభుత్వం ఈ ప్యాకేజీ ప్రకటించింది. ఒక పథకం ప్రకారం మోడీప్రభుత్వం ఉక్కు ఫ్యాక్టరీని నష్టాల్లోకి నెడుతున్నదనే సందేహం రాక మానదు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని నిలబెట్టేందుకు మద్దతు అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంతకు ముందు అధికారంలో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి కూడా విశాఖ ఉక్కు పరిరక్షణ కొరకు కృతనిశ్చయంతో ప్రయత్నం చేయలేదు. ప్రతి సంవత్సరం 7:3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యమున్న విశాఖఉక్కు కర్మాగారం 2023-24లో రూ.4,848.86కోట్లు, 2022-23లో రూ. 2,858.74 కోట్లు నష్టాన్ని మూటగట్టుకొన్నది. ఉక్కు ఉత్పత్తి కొరకు పెట్టుబడి కోసం చేసిన అప్పులు పెరగడం దీనికి ప్రధాన కారణం. కర్మాగారం నడవడానికి చేసిన అప్పులు పెరగడం, తగినంత ముడిసరుకులు లేకపోవడం, ఇతర సమస్యలు దీనికి అదనం. ఉత్పత్తిలో విశాఖ స్టీల్ ప్లాంట్ 120 శాతం రేటింగ్ సామర్థ్యంతో ప్రసిద్ధి చెందింది. గతంలో లాభాలు ఆర్జించింది. పాత ఆర్థిక వనరులను ఉపయోగించి ఉత్పత్తి 3.4మిలియన్ టన్నుల నుంచి 7:3మిలియన్ టన్నుల సామర్థ్యానికి పెరిగింది. మూలధన పెట్టుబడి, ముడిసరుకు సరిపడినంత సమకూరకపోవడంతో ప్రస్తుతం 50శాతం సామర్థ్యంతోనే నడుస్తున్నది. ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా పునరుద్ధరిస్తే వీలైనంత త్వరగా లాభాల్లోకి వస్తుంది. దీనికోసం వెంటనే మూలపెట్టుబడిని ఏర్పాటు చేసి అవసరమైన బ్యాంక్ రుణాలు తీసుకునేందుకు 'లెటర్ ఆఫ్ కంఫర్ట్' జారీ చేయాలి. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మినహా దేశంలో అన్ని ఉక్కు కర్మాగారాలకు 'కాప్టివ్ మైన్స్' (మూల గనులు) ఉన్నాయి. ప్లాంట్ నిరంతరం పని చేయడానికి వీలైనంత ఎక్కువ బఫర్ స్టాక్‌ను ఉంచుకోవడానికి వీలుగా వెంటనే ఇనుప ఖనిజం గనులను కేటాయించవలసిన అవసరం ఉంది. విశాఖఉక్కు కర్మాగారానికి సొంతంగా గనులు కేటాయించడం అవసరం. దీనిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్పకుండా కేంద్రప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని ఎన్నికలసమయంలో ఇచ్చినహామీని నిలబెట్టుకోవాలి. ప్యాకేజీ ప్రకటించడం కేవలం కంటితుడుపుచర్య మాత్రమే. స్టీల్ ప్లాంట్‌కు ఉన్న సమస్యలకు అది ఎంత మాత్రమూ శాశ్వత పరిష్కారంకాదు. ఇచ్చిన ప్యాకేజీ కేవలం రెండులేదామూడు నెలలకు మాత్రమే సరిపోతుంది. ప్యాకేజీలతో ఒరిగేదేమీ లేదు. స్టీల్‌ప్లాంట్‌కు 17వేల కోట్ల రూపాయలు అప్పులున్నాయని చెప్తుతున్న ప్రభుత్వం ప్యాకేజీ పేరుతో కేవలం 11,500కోట్ల రూపాయలు కేటాయించడం సమస్యకు పరిష్కారంకాదు. విశాఖస్టీల్ ప్లాంట్‌ను కాపాడడానికి కేంద్రప్రభుత్వం 'కాప్టివ్‌మైన్స్' కేటాయించి స్టీల్‌అథారిటీ ఆఫ్‌ఇండియాలో విలీనం చేయడం ఒక్కటే శాశ్వతపరిష్కార మార్గం. ●

# పర్యాటక రంగంపై యుద్ధాల ప్రభావం

కనుమ ఎల్లారెడ్డి

రష్యా, ఉక్రైన్ యుద్ధం ఎప్పుడు ఆగుతుందో తెలియదు కాని రోజుకో మలుపు తిరుగుతోంది. ఇరు పక్షాలు మాటల తూటాలు పేలుస్తున్నాయి. ఒకరి కీలక ప్రాంతాలపై మరొకరు దాడి చేశామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కి మాట్లాడుతూ 38 వేలకు పైగా శత్రు సైన్యం ను హతం చేశాం అని చెప్పారు. రష్యా ప్రధాన భూభాగం ఖికర్స్క్ లో ఉక్రెయిన్ దళాలు ఉధృతంగా పోరు సల్పుతున్నాయి. మా దాడిలో రష్యా సైన్యం ఉత్తర కొరియా సైన్యం మరణించారు. అదే సమయంలో రష్యా కూడా మేము ఉక్రైన్ సైనికులను తమ బలగాలు హతమార్చాయని రష్యా ప్రకటించింది. ఇలా రెండు దేశాలు పరస్పర ప్రకటనలు చేయడం చూస్తున్నదే. ఇద్దరిలో ఎవరిది పై చేయో అర్థం కావడం లేదు. ప్రోక్రోస్క్ ప్రాంతంలో రెండు దీటుగా పోరాడుతున్నాయి. ఫలితంగా ఉక్రైన్ లోని ఖర్కివ్, సుమి ప్రాంతాలలో రష్యా బాంబులు వేస్తోందని ఉక్రైన్ ఆరోపించింది. ఇది ఇలా ఉండగా రష్యా మిలిటరీ ఆస్తులు ధ్వంసం చేశామని జెలెన్ స్కి ప్రకటించారు. వెంటనే రష్యా కూడా ఓ ప్రకటన జారీ చేసింది. ఉక్రైన్ మాపై ప్రయోగించిన అమెరికా క్షిపణులను, డ్రోన్లను కూల్చి, కోలుకోలేని దెబ్బతీశామని రష్యా ప్రకటించింది. ఇలా రెండు దేశాలు వ్యూహ ప్రతివ్యూహాలతోనే సరిపెట్టుకుంటున్నాయి. దేశ క్షేమంకోసం ఎవరూ చూడటంలేదు. ఇక అభివృద్ధి ఎక్కడ ఉంటుంది. ఎవరి భూభాగాల పరిరక్షణకు వాళ్లు మార్గం సుగమం చేసుకుంటున్నారు. రెండు దేశాలు ఏభూభాగంపై దాడి చేద్దామా అనే సమాలోచనలు చేస్తున్నారు కాని శాంతికి అడుగు ముందుకు పడటం లేదు. అసలు ఆదిశలో అవి ఆలోచించడం లేదు, ప్రయత్నాలు చేయడంలేదు. రెండు దేశాలు కూడా ఏ కీలక ప్రాంతంపై దాడిచేద్దామా అనే ఆలోచనతో ఉన్నాయి. ఇటువంటి సమయంలోరష్యాను దర్శించటానికి ఇక పర్యాటకులు ఎలా వస్తారు. అదేవిధంగా ఉక్రెయిన్‌లో వైద్య విద్యను అభ్యసించటానికి విదేశీ విద్యార్థులు ఎలా వస్తారు? రెండు దేశాలు గణనీయ మైన ఆదాయాన్ని కోల్పోతున్నాయి. రష్యాలో పర్యాటకులు ఎవరూ అడుగు పెట్టడం లేదు. ఉక్రైన్ లోని మెడికల్ కళాశాలలో కూడా విదేశీ విద్యార్థులు లేరు. పోరు తగ్గి మాములు పరిస్థితులు వచ్చినా కొంత కాలం ఎవరూ ఆయా దేశాలలో అడుగు పెట్టరు. ఎందుకంటే పునర్నిర్మాణ పనులలో అవి నిమగ్నమై ఉంటాయి. విదేశీ ధనం రావాలి అంటే రెండుదేశాలు శాంతి వాతావరణం నెలకొల్పాలి. వీటి సయోధ్యకు అమెరికా నూతన అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏ విధమైన చర్యలు తీసుకుంటాడో, ఒక వేళ యుద్ధం ఆగితే అతని చొరవతోనే ఆగిపోవాలి. ఉక్రైన్ కు ఆయుధ సరఫరా ఇక అందించం, శాంతి కోసం ప్రయత్నం చేస్తాం అందుకు ఇతర దేశాలు కూడా కలసిరావాలి అని పిలుపు ఇవ్వవచ్చు. దీనికి భారత్ సంసిద్ధతవెలిబుస్తుంది. రష్యా కూడా యుద్ధాన్ని సమాప్తిచేసి దెబ్బతిన్న ఉక్రైన్‌కు ఆర్థిక సహకారం అందచేసి తన ఉదారతను చాటుకోవాలి. ఉక్రైన్ కూడా చేతనైనంత సహాయ, సహకారాలు రష్యాకు అందచేయాలి. రెండు దేశాలు చాలా వరకు తీవ్రంగా దెబ్బతిన్నాయి కాబట్టి, ఒకరికొకరు దాడి, ప్రతిదాడి చేసుకోకుండా దేశం, పౌరులకోసం, ప్రగతి, అభివృద్ధి, శాంతి కోసం అడుగు ముందుకు వేయాలి. ●



# నిరుద్యోగుల ఆశలు తీరేనా?

శ్రవణ్ కుమార్

మన దేశంలో మిగితా రాష్ట్రాలు భౌగోళికంగా ఏర్పడితే, తెలంగాణ ఒక భావోద్వేగా రాష్ట్రం. కదిలిస్తే ఇక్కడ అమర వీరుల తల్లుల కన్నీళ్లు కన్పిస్తాయి. నీళ్లు, నిధుల కోసం నాయకులు కొట్లాడితే కొలువులే కొలమానంగా తొలి నుండి తుది తెలంగాణ ఉద్యమంలో కొట్లాడింది విద్యార్థులే. తెలంగాణ వస్తే కోరుకున్న కొలువు వస్తదని, గొప్పగా బతుకుతాం అని విద్యార్థులు తమ జీవితాలని లెక్కచేయకుండా, ప్రాణాలని పణంగా పెడితే ఆ త్యాగాల పునాదులపై తెలంగాణ పురుడుపోసుకున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తొలి ఫలితం విద్యార్థులకే దక్కాలి. అది వారిహక్కు కూడా. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో నిరుద్యోగుల నిరాశనీ, అసంతృప్తినీ, ఆందోళనీ అర్థం చేసుకోవాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు పదేపదే మాది నిరుద్యోగుల ప్రభుత్వం అని, మా ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల బాధలు, సమస్యలు వినడానికి సిద్ధంగా ఉన్నదని ప్రకటించడం అంటే ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై సీరియస్‌గా ఉందనే విశ్వాసాన్ని నిరుద్యోగులకి కల్పించారు. కాంగ్రెస్ పార్టీ తనమేనిఫెస్టోలో పెట్టిన 2లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండరు అనేది ఒక సంచలనం. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలని శరవేగంగా భర్తీచేసి కొత్త సంవత్సరంలో పకడ్బందిగా జాబ్ క్యాలెండరు అమలు చేసే దిశగా ప్రజా ప్రభుత్వం అడుగులు పడుతున్నాయి. టీజీపిఎస్సీ ఛైర్మన్ పదవీకాలం పూర్తి కాకముందే కొత్త ఛైర్మన్‌ని నియమించడం మంచి పరిణామం. కోచింగ్ సెంటర్ల దోపిడీ నుండి గ్రామీణ పేద విద్యార్థులకీ విముక్తి కల్పించి, తల్లిదండ్రులకి లక్షల రూపాయల కోచింగ్ ఫీజు భారం తగ్గించేలా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తాం అని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుత జాబ్ క్యాలెండరు అమలుకు ముందే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లని ఏర్పాటు చేసి అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత ఖరీదైనా కోచింగ్‌ని ఉచితంగా అందించడంతోపాటు వసతి సౌకర్యం కల్పించాలి. కమ్మటి మాటలతో కడుపు నింపుతున్నదని, కానీ కొలువులు ఇవ్వకుండా కాంగ్రెస్ నిరుద్యోగులని నిలువునా మోసం చేస్తున్నదని నిరుద్యోగులంతా తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. సంవత్సరం తిరిగేలోపే ఇచ్చిన హామీలని నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం నిరుద్యోగులని నమ్మించి మోసం చేసిందని నిరుద్యోగులంతా భగ్గుమంటున్నారు. కొలువుల కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పైకోటి ఆశలు నిరుద్యోగులు పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం వచ్చి సంవత్సరం పూర్తి అయ్యింది. రెండులక్షల ఉద్యోగాలు దేవుడెరుగు, 12వేల ఉద్యోగాలు ఇచ్చి 55 వేల ఉద్యోగాలు ఇచ్చామని ప్రభుత్వం చెప్పుకుంది. ఇచ్చింది లేదు ఇచ్చేది లేదు అయినా నాయకులు పోటాపోటీగా కృతజ్ఞత సభలు ఎందుకు పెడుతున్నారో అర్థంకావడం లేదు. నిరుద్యోగులంటే నిరక్షరాస్యులు కాదు, చదువుకున్న వారిని కూడా సునాయసంగా మోసం చేస్తాం అంటే ఎలా? ఉద్యోగాల ఊసే లేదు. గౌరవ ముఖ్యమంత్రి పదేపదే చెప్తున్నా 55000 ఉద్యోగాల రికార్డు గురించి పరీక్ష రాసిన నిరుద్యోగులకి, పరీక్ష పట్టిన ప్రభుత్వానికి తెలుసు కానీ సామాన్య ప్రజలకి తెలియదు. ఇదే వాళ్ల బలం. పదేపదే రికార్డు స్థాయిలో ఉద్యోగాలని భర్తీ చేస్తున్నాం అని చెప్తూ ఇటు ప్రజల దృష్టిని ఆకర్షిస్తూ, అటు జాబ్ క్యాలెండరు, 2లక్షల ఉద్యోగాలని తొక్కిపెడుతు



న్నారు. చివరికి అప్పులంటూ, వర్గీకరణ అంటూ కాలయాపన చేస్తున్నారని నిరుద్యోగులంతా ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ఉద్యోగాల భర్తీవిషయంలో ఎస్సీ వర్గీకరణఅడ్డంకి కాదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుచేస్తాం అంటూనే జాబ్ క్యాలెండరుని ఇటీవల విడుదల చేసింది. జాబ్ క్యాలెండరు అమలులో, ఉద్యోగాల భర్తీ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లోరాని అడ్డంకి తెలంగాణలో ఎందుకు వస్తున్నది?. నిరుద్యోగులు ఎన్నో కలలు కన్నారు, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తే 2లక్షల ఉద్యోగాలని, జాబ్ క్యాలెండరు ద్వారా భర్తీ చేస్తుందని అనుకున్నారు. అంతే కాని అప్పులతో నిరుద్యోగుల జీవితాలని ముడివేయడం నిజంగా బాధాకరం. ప్రస్తుతం ఉన్న అప్పులు గత ప్రభుత్వం చేసిన అప్పులే, అయినా అప్పటి ప్రభుత్వం మీద ఉద్యోగాలు భర్తీ చేయడంలేదు అని ప్రస్తుత ప్రభుత్వ పెద్దలుపోరాడారు కదా, కొట్లాడారు కదా? అప్పుడు మీరు అప్పులుతో ఉద్యోగాలని ఎందుకు ముడిపెట్టలేదు? మేనిఫెస్టోలో పెట్టిన రెండు లక్షల ఉద్యోగాలని భర్తీ చేయాలనీ నిరుద్యోగులంతా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం రిటైర్మెంట్ వయస్సు పెంపు చేస్తున్నట్టు, ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఉద్యోగుల వయస్సు పెంపు ప్రతిపాదనలని సిద్ధం చేయాలనీస్వయంగా ముఖ్యమంత్రి ఆదేశించడంతో మళ్లీ నిరుద్యోగులలో తీవ్ర నిరాశ నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కొలువు వస్తదనీ అనుకున్న నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్టే, ప్రభుత్వం ఇచ్చిన హామీనీ నిరవేర్చకుండా రిటైర్మెంట్ వయస్సు పెంపు అనేది నిరుద్యోగుల కలలకి మరణ శాసనమే. యేండ్లకేండ్లు కుటుంబాలకి దూరంగా, అర్ధ ఆకలితో, అగ్గిపెట్టె అంత సైజు గదిలో ఉంటూ, అప్పులు చేస్తూ పోటీ పరీక్షలకి ప్రాణం పెట్టి చదివే నిరుద్యోగులపై కోలుకోలేని విధంగా కాంగ్రెస్ చేస్తున్న మోసంపై పోరాటం చేయాలనీ నిరుద్యోగులంతా నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఆర్థిక ఇబ్బందులు అనే కారణంతో ప్రభుత్వం రిటైర్ అయ్యే ఉద్యోగుల అన్ని రకాల బెనిఫిట్స్ చెల్లించకుండా తాత్కాలిక ఉపశమనం కోసం ఇలా ప్రభుత్వమే నిరుద్యోగుల ఉద్యోగ కలలని సమాధి చేస్తదని ఊహించలే. పేదరికం కారణంగా తల్లిదండ్రులకి ఆర్థిక భారం కాకూడదనే కారణంతోట్యూషన్ చెప్పాడమో, రోజంతా క్యాటరింగ్ వెళ్లడమో, కరపత్రాలు పంచడమో, రాపిడో, జొమాటో, స్విగ్గివంటి పనులు చేస్తూ దయానియా పరిస్థితిలో, బాధని భరిస్తూ, దుఃఖన్ని దిగమింగుతూ పోటీ పరీక్షలకి సన్నద్ధం అవుతున్నారు. ప్రభుత్వం నిరంకుశంగా ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు పెంచడంపై రానున్న రోజులలో ఈ సమస్యపై మరో తెలంగాణ తరహా ఉద్యమం చేయాలనే ఆలోచనలో నిరుద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం నిరుద్యోగులకి ఇచ్చిన హామీని నెరవేర్చకుండా, ఇలా ఉద్యోగాల వయస్సు పెంచుకుంటూఉన్న ఉద్యోగాలని, జాబ్ క్యాలెండరు అమలు చేయకుండా ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని, అవసరమైతే త్వరలో ఢిల్లీలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఎలా మోసం చేసిందో ఢిల్లీ ఓటర్లకి వివరించాలని నిరుద్యోగులు నిర్ణయం తీసుకున్నారు. ప్రతిష్టాత్మకమైన గ్రూప్ 1 ఉద్యోగాలనీ ప్రభుత్వం ఏదోతప్పుడు జీవో 29 తీసుకువచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీల ఉద్యోగాలని లక్కోవాలనీ చూస్తున్నది. ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధమైన జీవో 29తీసుకువచ్చిందని నిరుద్యోగులంత ప్రభుత్వంపై పోరాడారు. ఇ జీవో 29ప్రత్యేకత ఏమిటంటే రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్స్ పాటించకుండా కేవలం మెరిట్‌కే ప్రాధాన్యతఇవ్వడంవల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వంటి బలహీన వర్గాల వారి కలలకి మరణశాసనం జీవో29. ఇప్పటికి జీవో 29 రాజ్యాంగ బద్ధ మని హై కోర్ట్‌కానీ, ఏన్యాయస్థానం తెల్చాలే. కేవలం సాంకేతిక కారణంతో, కేసువేయడంలో జాప్యం అనే కారణంతో హై కోర్ట్ 29పై ఉన్నకేసులన్నింటిని కొట్టివేసింది. నిరుద్యో గమే లేని తెలంగాణకోసం ప్రభుత్వం కృషి చేయాలి. ఎప్పటికప్పుడు ఖాళీఅయ్యే ప్రతి ఉద్యోగాన్ని, భర్తీ అయ్యేలా ప్రభుత్వం కృషి చేయాలి. ●

# జన్మతః పౌరసత్వం రద్దుపై
# 22 రాష్ట్రాలు న్యాయపోరాటం

## తొలి అడుగులోనే వివాదాస్పదంగా ట్రంప్ నిర్ణయాలు



**వాషింగ్టన్ డిసి, జనవరి 22:** వివాదాలతో సవారీచేయడం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అలవాటుగా మారిపోయింది తన తొలివిడత అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో అనుసరించిన దూకుడు కూడా ఏమాత్రం తగ్గలేదు. ఆయన ప్రమాణస్వీకారంచేసిన తర్వాత చేసిన తొలి సంతకాలు ఇపుడు ఆయనకు వివాదాలు తెచ్చిపెడుతున్నాయి. తాజాగా అమెరికా రాజ్యాంగం 14వ అధికరణం కింద ప్రవేశపెట్టిన జన్మతఃపౌరసత్వ హక్కు చట్టాన్ని రద్దుచేస్తున్నట్లు ప్రకటించి అందుకు సంబంధించిన కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకంచేసారు. శతాబ్దానికి పైగా అమలులో ఉన్న ఈ చట్టాన్ని రద్దుచేయడం వల్ల అమెరికాలో పుట్టిన పిల్లలకు ఇపుడు పౌరసత్వం లభించే అవకాశాలు లేకుండా పోతున్నాయి. వీటిపై ఇపుడు డెమొక్రాట్ల ఆధ్వర్యంలోని 22 రాష్ట్రాలు ఉద్యమిస్తున్నాయి. న్యాయపరంగా పోరాటానికి దిగుతున్నాయి. అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్, వలస వాదుల సంఘాలు, తల్లులు కాబోతున్నవారు ట్రంప్ సంతకం చేసిన వెనువెంటనే కోర్టుల్లో పోరాటానికి పిటిషన్లు దాఖలుచేసారు. 22 డెమొక్రాట్ల అధీనంలోని రాష్ట్రాలతోపాటు కొలంబియా జిల్లా, శాన్‌ఫ్రాన్సిస్కో నగరానికి చెందినవారు బోస్టన్, సియాటెల్‌కోర్టుల్లో దావాలు వేసారు.

అధ్యక్షుడు తనఅధికారాలు, పరిధినిమించి వ్యవహరించారని, అమెరికా రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని, అమెరికా గడ్డపై జన్మించినవారికి పౌరసత్వం మంజూరు అనేది దానంతటదే వస్తుందని అయితే ట్రంప్ ఉత్తర్వుకారణంగా ఇపుడు అన్నీ నిలిచిపోయేప్రమాదం ఉందని ప్రవాసభారతీయులందరూ కలిసి మరో దావావేసారు. ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేకుండా సుమారు 1.50 లక్షలమంది ఏటా అమెరికాలో జన్మిస్తున్న వారికి ఇపుడు పౌరసత్వం లేకుండాపోయే ప్రమాదం ఏర్పడుతుందని మసాచుసెట్స్ అటార్నిజనరల్ ఆండ్రియా జాయ్ కాంప్‌బెల్ అన్నారు. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ ఆధారంగా 1868 నుంచి కూడా ఎవరు అమెరికాలో జన్మించినా వారికి ఆదేశ పౌరసత్వం లభిస్తుంది. ఇమ్మిగ్రేషన్ నేషనాలిటీ చట్టం 1952 ప్రకారం ఈ పౌరసత్వం మంజూరవుతుంది. 1868లోనే అమెరికా 14వ సవరణను ధృవీకరించారు. నాలుగేళ్ల అమెరికా సివిల్‌వార్ తర్వాత సుప్రీంకోర్టు నిర్ణయం ప్రకటిస్తూ ఆఫ్రికన్ అమెరికన్లకు పౌరసత్వ హక్కులేదన్నారు. ఆఫ్రికన్ అమెరికన్లకున్న ప్రాథమిక హక్కులు హరించవేసేవిధంగా ఈనిర్ణయం ఉందని అప్పట్లో అమలుచేయలేదు. చైనిసలుగా వచ్చిన వారు అమెరికా పౌరులు కాలేరని అందువల్ల ఫెడరల్‌ప్రభుత్వంనుంచి వారికి రక్షణ లభించదని సుప్రీంకోర్టు డ్రెడ్ స్కాట్ వర్సెస్ సాన్‌ఫోర్డ్ కేసులో పౌరసత్వం మంజూరును తిరస్కరించింది. ఇపుడు ట్రంప్ ద్వారా ఈ వివాదాన్ని మళ్లీ రాజేసినట్లయింది. తండ్రి అమెరికన్ పౌరుడు కాకపోయి ఆతని భార్య అంటే జన్మించిన బిడ్డతల్లి అక్రమంగా అమెరికాలో ఉంటూ ప్రసవించినప్పటికీ ఆబిడ్డకు పౌరసత్వం మంజూరు కాదని ట్రంప్ ఉత్తర్వులు చెపుతున్నాయి. తాత్కాలికంగా చట్టబద్ధంగా తల్లి అమెరికాలో ఉన్నా, విద్యార్థి, టూరిస్టు వీసాలపై ఉన్నవారు, తండ్రి అమెరికా పౌరుడు కాకపోయినా లేదా శాశ్వత నివాసి కాకపోయినా వారిపిల్లలకు పౌరసత్వం వర్తించదు. ఇప్పటికిప్పుడు లెక్కలుచూస్తే అమెరికాలో 11 మిలియన్ల వరకూ అక్రమ వలసదారులున్నారు. గతేడాది జనవరినాటికి ఉన్న ఈ గణాంకాలు ఇపుడు 14 మిలియన్లకు పెరిగే అవకాశం ఉంది. వారి అమెరికాలోపుట్టిన పిల్లలకు అమెరికా పౌరసత్వం ఇచ్చే అవకాశం ఇవ్వాలి. ఇపుడు ట్రంప్ ఉత్తర్వులప్రకారం అయితే వారికి మెడికెయిడ్ ఆరోగ్య బీమాకూడా వర్తించదు. వారు పెద్దవారయి చట్టబద్ధంగా ఓటింగ్‌లో పాల్గొనడం, ఉద్యోగాలుచేస్తుంటే వారికి పౌరసత్వం ఇవ్వమంటే ఎలా అని రాష్ట్రాలు ఇపుడు కోర్టుల్లో వాదనలు వినిపిస్తున్నాయి. ఆయనకు నచ్చింది ఆయనకు చేసుకుపోతున్నా చివరకు కోర్టులు నిర్ణయిస్తాయని ఆయన సొంతంగా ఏదీ నిర్ణయించడానికి లేదని ట్రంప్ నిర్ణయం లక్షలాదిమందికి నచ్చలేదని అన్నారు. ఇపుడు చట్టరూపంలోకి రావాలంటే ప్రతినిధుల సభలో మూడింట రెండొంతుల మెజార్టీ అవసరం అవుతుంది. సెనేట్‌లో రిపబ్లికన్లకు 53 మంది ఉన్నారు. 220 మంది ప్రతినిదులసభలో ఉంటే గ్రాండ్‌ఓల్డ్‌పార్టీకి ఇక మెజార్టీపరంగా ఢోకాలేదని అందుకే ట్రంప్ దూకుడుగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఇపుడు మసాచుసెట్స్, న్యూహ్యాంప్‌షైర్‌లలో నాలుగు కేసులు నమోదయ్యాయి. నాలుగు రాష్ట్రాలు అయితే వాషింగ్టన్‌లో వేరవేరు కేసులు దాఖలుచేసారు. ఐదో లాసూట్ మేరిలాండ్ ఫెడరల్‌కోర్టులో దాఖలు చేసారు. గర్భిణీలబృందం ఈ కేసును దాఖలు చేసింది. అయితే ఇప్పటికిప్పుడు తాత్కాలిక ఉపశమనం వీరికి లభించవచ్చన్న భావన వ్యక్తం అవుతోంది. ప్రకృతి వైపరీత్యాలున్న దేశాలు, సాయుధ విప్లవాలున్న దేశాలు, అత్యంత తీవ్రస్థాయి సంఘటనలు చోటుచేసుకున్న దేశాలకు కొంత ఉపశమనం లభించవచ్చన్న అంచనాలున్నాయి. మొత్తం 17 దేశాలకు సంబంధించి పదిలక్షలమంది ప్రజలకు ఈ బర్త్‌రైట్ సిటిజన్‌షిప్ సమస్యాత్మకం కానున్నదనే చెప్పాలి. ఈ దావాలతోపాటు నేషనల్ ట్రెజరీ ఉద్యోగుల సంఘం కూడా ప్రత్యేక లాసూట్ దాఖలు చేసింది. 37 ఏజెన్సీలకు ఈ ఏజెన్సీ ప్రాతినిధ్యం వహిస్తోంది.



## మణిపూర్ బీరేన్‌సింగ్ సర్కార్‌కు జెడియు మద్దతు ఉపసంహారణ

### ఏకైక జెడియు ఎమ్మెల్యే ఇపుడు ప్రతిపక్షంలోకి...

**ఇంఫాల్, జనవరి 22:** బీహార్ సిఎం నితీష్ కుమార్ ఆధ్వర్యంలోని జెడియు ఈశాన్యరాష్ట్రం మణిపూర్‌లోని బీరేన్‌సింగ్ ప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. ఆపార్టీకి ఉన్న ఏకైక ఎమ్మెల్యే ఇపుడు ప్రతిపక్ష బెంచ్‌ల్లో కూర్చుంటున్నారు. మణిపూర్‌ప్రభుత్వ స్థిరత్వంపై ఈ ప్రభావం మచ్చుకయినా ఉండకపోయినా ఓపక్క బీహార్‌లో కీలక మిత్రపక్షంగా కొనసాగుతూ మణిపూర్‌లో ప్రతిపక్షంగా మారడాన్ని ఎవ్వరూ కూడా ఊహించని విషయంగా చెపుతున్నారు. కోన్రాడ్ సంగ్మా ఆధ్వర్యంలోని నేషనల్‌పీపుల్స్ పార్టీ కూడా మణిపూర్‌లో బీరేన్‌సింగ్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో జెడియు ఆరుస్థానాలు గెలిచింది. ఎన్నికల తర్వాత కొన్ని నెలలకే ఐదుగురు ఎమ్మెల్యేలు బిజెపికి వెళ్లిపోయారు. దీనితో అధికారపార్టీ నంబర్లు మెజార్టీకి అనుగుణంగా మారాయి. ప్రస్తుతం బిజెపికి అసెంబ్లీలో 37 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. 60 మంది సభ్యులున్న అసెంబ్లీలో నాగా పీపుల్స్ ఫ్రంట్ ఐదుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్రులు మద్దతివ్వడంతో ఇపుడు మెజార్టీ తగ్గుతుందన్న ప్రశ్న ఉదయించదు. బీరేన్‌సింగ్ జెడియు బీహార్ యూనిట్‌ను రన్‌చేస్తున్నారు. గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు ఆయన లేఖరాసారు. 2022లో జరిగిన ఎనినకల్లో మణిపూర్‌లో ఎన్నికలు జరిగాయి. జనతాదళ్ యునైటెడ్ నుంచి గెలిచిన ఆరుగురు అభ్యర్థులు వెనక్కి వచ్చేసారు. కొన్ని నెలల తర్వాత ఐదుగురు ఎమ్మెల్యేలు బిజెపికి పార్టీ ఫిరాయించారు.

స్పీకర్ ట్రిబ్యునల్‌లో ఈ అంశం పెండింగ్‌లో ఉంది. ఇండియా కూటమిలో జెడియు భాగస్వామి అయిన తర్వాత బిజెపి ఆధ్వర్యంలోని ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించింది. ఇపుడు ఏకైక జెడియు ఎమ్మెల్యేకు సీటింగ్ కూడా మార్చారు. మహ్మద్ అబ్దుల్ నసీర్‌కు విపక్ష బెంచ్‌ల్లో స్థానం కల్పించారు. నితీష్ కుమార్ ఆధ్వర్యంలోని జెడియు ఈ ఏడాది ఎన్నికల్లో 12 స్థానాలు గెలిచింది. బిజెపి మెజార్టీ మార్కు చేరేందుకువీలుగా మిత్రపక్షాలకు సైతం సీట్లు లభించాయి.

బిజెపి, జెడియులు బీహార్‌లో మిత్ర పక్షంగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికలు ఈఏడాదే జరగాల్సి ఉంది. జెడియు అధ్యక్షుడు బీహార్‌సీఎం నితీష్‌కుమార్ రాజకీయంగా ఎత్తుపల్లాలను చవిచూసిన వ్యక్తికావడంతో తిరిగి ఎన్డీయే కూటమిలోకి వచ్చేసారు.

## ఫెడరల్ డైవర్సిటీ, ఈక్విటీ, ఇన్‌క్లూజన్ సిబ్బందికి లేఆఫ్‌లు!

### మెమో జారీ చేసిన ట్రంప్ కార్యవర్గం

**వాషింగ్టన్, జనవరి 22:** అగ్రరాజ్యానికి రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ పాలనలో దూకుడు పెంచారు. ఇప్పటికే గత అధ్యక్షుడు జో బైడెన్ ఇచ్చిన 78 ఆదేశాలను రద్దు చేస్తూ డజన్ల కొద్దీ కార్యనిర్వాహక ఆదేశాలను జారీ చేశారు. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫెడరల్ డైవర్సిటీ, ఈక్విటీ, ఇన్‌క్లూజన్ సిబ్బంది అందరికీ లేఆఫ్‌లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు వారందరినీ సెలవులో ఉంచాలని ఆదేశిస్తూ ట్రంప్ కార్యవర్గం ఓ మెమో జారీ చేసింది. అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికి చెందిన డైవర్సిటీ, ఇన్‌క్లూజన్ ప్రోగ్రామ్‌లను నిర్వీర్యం చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. ఈ నేపథ్యంలోనే సిబ్బంది నిర్వహణ కార్యాలయం మెమో విడుదల చేసింది. దాని ప్రకారం డైవర్సిటీ, ఈక్విటీ, ఇన్‌క్లూజన్ సిబ్బంది అందరినీ వేతనంతో కూడిన సెలవుపై పంపించాలని సంబంధితఏజెన్సీలకు ఆదేశాలు అందాయి. ఈ విభాగాలకు చెందిన అన్ని వెబ్ పేజీలను కూడా ఈ గడువులోగాతొలగించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. దీంతో పాటు డిఇఐ సంబంధిత శిక్షణ కార్యక్రమాలను తక్షణమే ముగించాలని ఏజెన్సీలకు సూచించారు. ఈ విభాగాలు చేసుకున్న ఒప్పందాలనుకూడా రద్దు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే కొన్ని వెబ్ సైట్లను తొలగించారు.

వచ్చే శుక్రవారం నాటికి వీరికి లేఆఫ్‌లు ఇచ్చి ఫెడరల్ సిబ్బంది సంఖ్యలో కోత విధించాలని ట్రంప్ సర్కార్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగాలకోతపై నూతనఅధ్యక్షుడి యంత్రాంగం నుంచి ఇంకా ప్రకటన వెలువడలేదు. అయితే తాజా నిర్ణయం ఎంతమందిపై ప్రభావం చూపనుందనేది ఇంకా స్పష్టం కాలేదు.



## ఓటమి తప్పదని తెలిసే ఆప్ రోజుకో హామీ

### ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ, జనవరి 22:** దేశరాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న కొద్దీ ప్రచారం ఊపందుకుంది. బిజెపి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పాల్గొని ఆమ్ ఆద్మీపార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేసారు. ఢిల్లీలో ఆప్‌కు ఓటమి తప్పదని, అది తెలిసేరోజుకో హామీ ఇస్తోందని, ఆపార్టీ గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయిందని, దీనిపై అధికార పార్టీని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఆప్‌మోసాలకు శీష్‌మహల్ ఒక ఉదాహరణ అని ఢిల్లీ ఎన్నికల్లో కార్యకర్తలవల్లే బిజెపికి విజయం దక్కుతుందన్నారు. పోలింగ్‌కేంద్రంలో 50 శాతం ఓట్లు బిజెపికేపడేలా కార్యకర్తలు ప్రచారం చేయాలని మోడీ సూచించారు. ఎన్నికలకు గడువు సమీపిస్తున్న కొద్దీ ఢిల్లీలో ప్రచారం హోరెత్తుతోంది. ఈసారి ఎలాగైనా రాష్ట్ర అధికారం చేపట్టాలని పట్టుదలతో ఉన్న బిజెపి అడుగడుగునా ఆప్ పై అవినీతి ఆరోపణలు, మద్యం పాలసీ, నేతల అరెస్టులను ప్రస్తావిస్తోంది. ప్రధానంగా ఇపుడు శీష్‌మహల్ అంటూ కేజ్రీవాల్ అద్దాలమేడ నిర్మించుకున్నారంటూ ప్రధాని తనదైనశైలిలో ఆరోపణలుచేస్తూ దూసుకుపోతున్నారు. ఆప్‌కూడా అందుకు తక్కువేమీ కాదన్నట్లుగా ఓపక్క లేఖాస్త్రాలు సంధిస్తూ, బిజెపిని ఇరుకున పెట్టేప్రశ్నలు సంధిస్తోంది.

## కోటలో మరో ఇద్దరు జెఇఇ విద్యార్థుల ఆత్మహత్య

**జైపూర్, జనవరి 22:** రాష్ట్రంలోని కోటలో కోచింగ్‌కు వస్తున్న అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. ఈనెలలోనే మొత్తంగా ఆరుగురు ఆత్మహత్యలపాలయ్యారు. అస్సాంకు చెందిన నాగాంవ్‌కు చెందిన పరాగ్ అనే విద్యార్థి విద్యార్థి బుధవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆతడు నివసిస్తున్న మహావీర్‌నగర్ ప్రాంతంలోని ఆతని ఇంట్లోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఇపుడు ఆత్మహత్యలకు కోట హబ్‌గా మారడంతోపాటు చెడ్డపేరు వస్తోందని విద్యాసంస్థలు కూడా కలవరపాటుకు గురవుతున్నాయి. వర్సిటీ ప్రవేశపరీక్షలు, పోటీపరీక్షల్లో తమ సత్తాను నిరూపించుకునేందుకుగాను విద్యార్థులు ఎక్కువగా రాజస్థాన్‌లోని కోటకు వస్తున్నారు. పరాగ్ ఉదంతానికి కొన్ని గంటలముందే అఫ్సాషేక్ అనే యువతి కూడా




హాస్టల్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందింది. ఆమె గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన షేక్ వైద్యకళాశాలలో ప్రవేశం కోసం నీట్ పరీక్షకు సిద్ధం అవుతోంది. ఈ మృతదేహాలను పోస్టుమార్టం కోసం పంపించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు. ఈనెలలోనే 19 ఏళ్ల నీరజ్ ఐఐటి జెఇఇకోసం చదువుకుంటున్న యువకుడు 7వ తేదీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఆ తర్వాత 24 గంటలకే 20 ఏళ్ల అభిషేక్ అనే జెఇఇ విద్యార్థి మరణించాడు. ఇక ఈనెల 16వ తేదీ 18 ఏళ్ల అభిజిత్ జెఇఇకోసం శిక్షణకు వచ్చి ఆత్మహత్యకుపాల్పడ్డాడు. 24 గంటలు గడిచిన వెంటనే మనన్‌శర్మ అనే యువకుడు జెఇఇకోసమే వచ్చి ఆత్మహత్యచేసుకున్నాడు. పరీక్షలకు నాలుగురోజులకు ముందే జెఇఇ అభ్యర్థి ఒకరు ఆత్మహత్యచేసుకున్నాడు. గత ఏడాది 17 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోగా మొత్తం 38 కేసులునమోదయితే వాటిలో 23 కేసులు ఆత్మహత్యలుగా పోలీసులు నిర్ధారించారు. గత ఏడాది ఈ ఆత్మహత్యలు పెరుగుతున్న క్రమంలో విద్యార్థుల సంఖ్య తగ్గినప్పటికీ కోచింగ్ సంస్థలకు రూ.3500 కోట్లు ఆదాయం లభించింది.

## ఆర్జీకర్ ఘటనలో దోషికి మరణశిక్ష విధించాలి

### హైకోర్టును ఆశ్రయించిన బెంగాల్ సర్కార్

### దోషి, సిబిఐ, మృతురాలి కుటుంబ సభ్యుల వాదనలు విన్న తర్వాతే పిటిషన్‌ను స్వీకరిస్తామన్న కోర్టు



**కోల్‌కత్తా, జనవరి 22:** ఆర్జీకర్ ఘటనలో దోషి సంజయ్‌రాయ్‌కు మరణశిక్ష విధించాలంటూ బెంగాల్ సర్కార్ కలకత్తా హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అందరి వాదనలు విన్న తర్వాతే ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకుంటామని న్యాయస్థానం తెలిపింది. దోషి సంజయ్‌రాయ్, సిబిఐ, మృతురాలి కుటుంబ సభ్యుల వాదనలు విన్న తర్వాత ఆ పిటిషన్‌ను స్వీకరిస్తామని స్పష్టం చేసింది. ఈ కేసుపై విచారణ జరుపుతామని తెలిపింది. కాగా ఈ కేసులో నిందితుడికి సియాల్దా కోర్టు విధించిన శిక్ష సరిపోదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయడాన్ని సిబిఐ వ్యతిరేకించింది.

కేసును విచారించిన సంస్థగా శిక్ష విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు తమకు మాత్రమే ఉందని ఇందులో జోక్యం చేసుకునే అధికారం ప్రభుత్వానికి లేదని పేర్కొంది. గతేడాది ఆగస్టు 9 రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రిలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన కేసుపై ఇటీవల విచారణ జరిపిన కోల్‌కతాలోని సియాల్దా కోర్టు నిందితుడు సంజయ్‌రాయ్‌కు జీవితఖైదు విధించింది. అలాగే బాధిత కుటుంబానికి రూ.17 లక్షల పరిహారం చెల్లించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఈ ఘటన అరుదైన కేసు కేటగిరీలోకి రాదని వ్యాఖ్యానించింది. మరణశిక్ష విధించకపోవడానికి ఇదే కారణమని వివరించింది. దీనిపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ ఈ తీర్పుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దోషికి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ బెంగాల్ సర్కార్ కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది.

## తుర్కియే ప్రమాదంలో 76కు పెరిగిన మృతుల సంఖ్య




**అంకారా, జనవరి 22:** వాయవ్య తుర్కియేలోని ప్రముఖ స్కీ రిసార్టుహోటల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతులసంఖ్య పెరిగింది. ఇప్పటివరకూ 76 మందిచనిపోయినట్లు అధికారికంగా ప్రకటించారు. మరో 51 మంది తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల్లో చికిత్సలుపొందుతున్నారు. బోలు ప్రావిన్స్‌లోని కర్తాల్కాయ రిసార్టులోని 12 అంతస్తుల గ్రాండ్ కర్తాల్ హోటల్ రెస్టారెంట్‌లో తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగిన సమయంలో 234 మంది హోటల్‌లో ఉన్నట్లు అంచనా. ఆదేశ అంతర్గత మంత్రి ఆలీ యెర్లికాయ మాట్లాడుతూ కర్తాల్‌కాయలోని 12 అంతస్తుల హోటల్‌లో తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగిందని రిసార్టుగదుల్లోని తెరలను ఉపయోగించి కిందకు దిగేందుకు యత్నించారని అదికారులు తెలిపారు.

## కుంభమేళాలో మహాప్రసాదాన్ని వడ్డించిన రాజ్యసభ ఎంపి సుధామూర్తి!

**ప్రయాగ్‌రాజ్, జనవరి 22:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహాకుంభమేళాను సందర్శించుకున్నారు ప్రముఖ వితరణశీలి, రాజ్యసభ ఎంపి సుధామూర్తి. మూడు రోజుల పర్యటన నిమిత్తం ప్రయాగ్‌రాజ్ చేరుకున్న ఆమె పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. స్థానిక ఇస్కాన్ క్యాంప్‌ను సందర్శించి భక్తులకు స్వయంగా మహాప్రసాదాన్ని వడ్డించారు. తొలుత ఇస్కాన్ కిచెన్‌కు వెళ్లిన ఎంపి అక్కడి వలంటీర్లతో కొంతసేపు ముచ్చటించారు. మెషిన్లతో భోజన తయారీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కౌంటర్ వద్ద నిలబడి కుంభమేళాకు వచ్చిన భక్తులకు చపాతీ, భోజనం వడ్డించారు. ఈ మహా కుంభమేళాను ఆమె 'తీర్థరాజ్'గా అభివర్ణించారు. తన పూర్వీకులకు తర్పణం వదిలేందుకు ఇక్కడకు వచ్చానని చెప్పారు. మహాకుంభమేళాలో ప్రముఖ ఆధ్యాత్మిక సేవాసంస్థ ఇస్కాన్, అదానీ గ్రూప్‌తో కలిసి నిత్యం లక్షమంది భక్తులకు భోజనాలు సమకూరుస్తోంది. తమ శిబిరాల్లో ఈ భోజనాలు వండి ప్రయాగ్‌రాజ్‌లోని కేంద్రాలకు చేరవేస్తోంది. ఆహారం పంపిణీకి అదానీ గ్రూప్ వంద వాహనాలు, వలంటీర్లనుసమకూర్చింది. దీంతో పాటు గీతా ప్రెస్‌తో కలిసి కుంభమేళాకు వచ్చిన భక్తులకు ఆర్తి సంగ్రహ పుస్తకాలను ఉచితంగా అందిస్తోంది. అదానీగ్రూప్ ఛైర్మన్ గౌతమ్ ఆదానీ కూడా తన కుటుంబంలో కలిసి ఇస్కాన్ శిబిరాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. ఇక్కడ భోజన తయారీలో వారు పాలుపంచుకున్నారు. యాత్రికులకు స్వయంగా వడ్డించారు..

## ఆరోగ్యశాఖలో 'ఆప్' రూ. 382 కోట్ల అవినీతి: అజయ్ మాకెన్

**న్యూఢిల్లీ, జనవరి 22:** దేశరాజధానిలోని ఆమ్ ఆద్మీ పార్టీ సర్కార్‌పై కాంగ్రెస్ విరుచుకుపడింది. ఆరోగ్యశాఖలో ఆప్ సర్కార్ రూ.382 కోట్ల అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ ఆరోపించారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ లీకైన నివేదికలోని వ్యత్యాసాలను పేర్కొంటూ ఆప్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందంటూ 14 కాగ్ నివేదికలు చూపుతున్నాయని తెలిపారు. అవినీతిపై పోరాటం చేస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అవినీతిలో కూరుకుపోయారని దుయ్యబట్టారు. ఢిల్లీ మద్యం పాలసీ కారణంగా ప్రభుత్వానికి రూ.2,026 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కాగ్ నివేదిక పేర్కొందని అన్నారు. ఆప్ నేతలు తమ అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని అసెంబ్లీలో నివేదికలను ప్రవేశపెట్టకుండా నిలిపివేస్తున్నారని ఆరోపించారు. కొవిడ్ మహమ్మారి సమయంలో కేంద్రం మంజూరు చేసిన నిధులలో 56 శాతం నిధులను ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి వినియోగించుకోవడంలో ఆప్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఆసుపత్రుల్లో రోగుల కోసం పడకలను పెంచడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఆసుపత్రుల్లో పడకలు, ఇతర సౌకర్యాలను కాగ్ తనిఖీ చేసిందని, సిబ్బంది కొరత కారణంగా ఉన్నట్లు గుర్తించిందని అన్నారు.



## ట్రంప్ వ్యాఖ్యలకు పనామా అధ్యక్షుడు ఘాటుగా కౌంటర్

**దావోస్, జనవరి 22:** పనామా కాలువ తమదేనంటూ గత కొన్నిరోజులుగా వ్యాఖ్యలుచేస్తున్న డొనాల్డ్‌ట్రంప్ ఇటీవల తన ప్రమాణస్వీకారం సమయంలోనూ ప్రస్తావించారు. ఆ కాలువను తప్పకుండా వెనక్కి తీసుకుంటామని ఘంటాపథంగా చెప్పారు. దీనిపై పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో తీవ్రంగా స్పందించారు. ఈ కాలువను అమెరికా తమకేం బహుమతిగా ఇవ్వలేదని ఘాటుగా అన్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ములినో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పనామాకాలువపై ట్రంప్ చెప్పిన ప్రతిమాటను కూడా మేం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఎందుకంటే అదంతా నిజం కాదని, ఆకాలువ అమెరికానుంచి మాకు బహుమతిగానో, రాయితీగానో వచ్చింది కాదని, ఆ కాలువ మాదేనని మాకు మాత్రమే సొంతం అని చెప్పారు. ప్రమాణస్వీకారంలో ట్రంప్ మాట్లాడుతూ పనామా కాలువను చైనా పరోక్షంగా నిర్వహిస్తోందని మేం దాన్ని చైనాకు ఇవ్వలేదని పనామాకు ఇచ్చామని ఇపుడు దాన్ని వెనక్కి తీసుకుంటామని అన్నారు. ఈ వ్యాఖ్యలపైనే ములినో స్పందించారు. అంతేకాకుండా ఈ కాలువ విషయంలో చైనా ఎలాంటిజోక్యంలేదని ఆయన స్పష్టంచేసారు. పనామా ప్రజలు ఇలాంటిప్రకటనలతో తప్పుదారి పట్టించలేదరన్నారు. పనామా కాలువను 1914లో అమెరికా నిర్మించింది. ఆ తర్వాత ఇరుదేశాలమధ్య జరిగిన ఒప్పందంమేరకు 1999 డిసెంబరులో దీన్ని పనామాకు ఇచ్చేసింది. అయితే అమెరికా వాణిజ్య, నావికాదళ నైకలనుంచి పనామా దేశం భారీగా ఫీజులు వసూలుచేస్తోందని వీటిని తగ్గించాలని ట్రంప్ డిమాండ్ చేసారు. లేనిపక్షంలో ఆ కాలువను వెనక్కి తీసేసుకుంటామని హెచ్చరించారు. దీనితో రెండుదేశాల మధ్య వివాదం రాజుకుంది.

## ఆటోడ్రైవర్‌ను ఆప్యాయంగా హత్తుకున్న సైఫ్ అలీఖాన్

**ముంబయి, జనవరి 22:** తన ప్రాణాలను కాపాడిన ఆటోడ్రైవర్‌ను బాలివుడ్ నటుడు తన నివాసానికి పిలిపించుకుని ఆతడిని ఆప్యాయంగా గుండెలకు హత్తుకుని తన ప్రాణాలు కాపాడావని కృతజ్ఞతలు చెప్పారు. ఆటోడ్రైవర్ భజన్‌సింగ్ రాణా దాడిజరిగినరోజు ఆటోతో పోతుండగా ఒక మహిళ బిగ్గరగా అరుస్తూ రోకోరోకో అంటూ వచ్చిం దని, వెంటనే తాను అక్కడ రక్తంతో తడిసిన ఒక వ్యక్తిని చూసానని వెంటనే ఆటోలో ఎక్కించుకుని అక్కడికి సమీపంలోనే ఉన్న లీలావతి ఆసుపత్రికి తీసుకుని వెళ్లినట్లు చెప్పారు. అంతకుముందు ఆసుపత్రిలోనే నటుడు రాణాను లీలావతి ఆసుపత్రిలో కలిసి ఆతడికి కృతజ్ఞులు తెలిపారు. సైఫ్ ఆలీఖాన్ రాణా పక్కనే నిలుచుని చిరునవ్వుతో ఫోటోలకు పోజులిచ్చారు.

ఇదిలాఉంటే సకాలంలో స్పందించి ముఖ్యమైన వ్యక్తులు,ఒక సెలబ్రిటీ నటుడికి సకాలంలో చికిత్స అందేవిధంగా స్పందించినందుకుగాను ముంబయిలోని ఒక ప్రైవేటు సంస్థ ఆటోడ్రైవర్‌కు 11 వేల రూపాయల నగదు బహుమతినిచ్చింది. అంతేకాకుండా భజన్‌సింగ్‌ను దుశ్శాలువతో సత్కరించింది. తనకు మధ్యాహ్నాం 3.30 గంటలకు టైమ్ ఇచ్చారని, తాను అక్కడికి వెళ్లేసరికి 4-5 నిమిషాలుగడిచాక లోనికివెళ్లానని,ఆయన కుటుంబం మొత్తం తనను పలకరించారని, అందరూ తనను ఎంతో గౌరవంగా చూసారని అన్నారు.


బుధవారం ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను పరామర్శిస్తున్న కెటిఆర్, తలసాని, అజయ్ తదితరులు

## ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను పరామర్శించిన నేతలు

**సికింద్రాబాద్, జనవరి 22 ప్రభాతవార్త:** డెహ్రాడూన్ పర్యటనలో గుండె పోటుకు గురై, చికిత్స అనంతరం నగరానికి చేరుకున్న సికింద్రాబాద్ శాసన సభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్‌ను బుధవారం మోండా మార్కెట్ టకారబస్తీలోని ఆయన స్వగృహంలో పెద్ద సంఖ్యలో నేతలు కలుసుకొని పరమర్శించారు. బీ.ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆయనను కలిసి పరామర్శించి కొన్ని రోజులు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని పద్మారావుకు సూచించారు. పద్మారావు గౌడ్‌ను పరావఎర్శించిన వారిలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పార్లమెంటు సభ్యులు రవిచంద్ర, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, పువ్వాడ అజయ్ కుమార్, భారత జాగృతి అధ్యక్షు రాలు కల్వకుంట్ల కవిత, నేతలు డాక్టర్ దాసోజు శర్వాన్, బాల్క సుమన్ సలీం, పలు డివిజన్ల కార్పొరేటర్లు, నేతలు జైసింహా, రాజీవ్ సాగర్‌లతో పాటు సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్, ముషీరాబాద్, ఉప్పల్, అంబర్‌పేట, ఖైరతాబాద్ నియోజకవర్గాల నేతలు ఉన్నారు. యువనేత తీగుళ్ళ రామేశ్వరగౌడ్ ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ పద్మారావు గౌడ్ ఆరోగ్యం మెరుగు పడిందని, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. వైద్యుల సూచన మేరకు కొన్ని రోజుల విశ్రాంతి తరువాత అన్నీ కార్యక్రమాల్లో తిరిగి చురుకుగా పాల్గొంటారని పేర్కొన్నారు. మాజీ స్పీకర్, శాసనమండలి విపక్ష నేత మధుసూదనాచారి, ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠా గోపాల్ ప్రభృతులు పద్మారావు గౌడ్‌ను పరామర్శించి త్వరగా కొలుకోవాలని అభిలషించారు.

## నేడు వ్యవసాయ వర్సిటీని సందర్శించనున్న జాతీయ ఎస్టీ కమిషన్

**అత్తాపూర్ జనవరి22,ప్రభాతవార్త:** జాతీయ ఎస్.టి కమిషన్ సభ్యులు హుస్సేన్‌నాయక్, ఇతర సభ్యులు, అధికారులు తదితరులు గురు వారం (నేడు) ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయవిశ్వవిద్యాలయాన్ని సందర్శిం చనున్నారు. ఈ మేరకు ఢిల్లీలోని కమిషన్ కేంద్ర కార్యాలయం నుంచి విశ్వవిద్యాలయానికి సమా చారం అందినట్లు రిజిస్ట్రార్ డి.శివాజీ తెలిపారు. ఉదయం విశ్వవిద్యాలయానికి చేరుకోనున్న ఎస్.టి కమిషన్ సభ్యులు ముందుగా ఎస్టీ సామా జిక వర్గానికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి వారి సమ స్యలను తెలుసుకుంటారు.

అదేవిధంగా గత 10యేళ్లుగా విశ్వవిద్యాలయంలో చేపట్టిన ఉద్యోగ నియామకాలు, ప్రవేశాలలో ఎస్టీ రిజర్వేషన్ల అమలును వారు పరిశీలించనున్నారు. వారి పర్యటనలో భాగంగా కమిషన్ సభ్యులు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యతో పాటు విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు.


బుధవారం సిద్దిపేట వార్డు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తన్నీరు హారీష్‌రావు

## రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలి: హారీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్నికల ముందు అందరికీ పరమాన్న మన్నారు..అధికారంలోకి రాగానే అందరికి కాంగ్రెస్ సర్కారు పంగనాములు పెడుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హారీష్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ పరిధిలోని గాడిచర్లపల్లి 15వ వార్డు గ్రామ సభలో ఆయన బుధవారం పాల్గొన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో తీసుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఎంత మంది రైతులకు రుణమాఫీ జరిగిందో తెలుపాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డికి నిజాయితీ, చిత్తశుద్ది ఉంటే యాసంగి,వానకాలానికి కలిపి రైతుబంధు ఇవ్వాలన్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. యేడాదికి 2లక్షల ఇండ్లు కడ తామని చెప్పిన సర్కారు యేడాది పాలన పూర్తి అయిన ఒక్క ఇల్లు కట్టలేదన్నారు. ప్రతి మహిళలకు ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.30 వేలు బాకాయి ఉందన్నారు. సభలో అధికారులు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


దేవరాజ్‌ను సన్మానిస్తు కేశవరావు, జగన్మోహన్‌రావు తదితరులు

## దేవ్‌రాజ్‌కు కేకే అభినందనలు

### జగన్ మోహన్ రావు నేతృత్వంలోని హెచ్‌సిఏ కార్యవర్గానికి ప్రశంస

**హైదరాబాద్, జనవరి 22,ప్రభాతవార్త:** వచ్చేనెలలో జరగనున్న ప్రతిష్టాత్మక ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే టీంఇండియా కి మేనేజర్ గా నియమితులైన హెచ్‌సిఏ కార్యదర్శి ఆర్.దేవ్‌రాజ్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె కేశవరావు అభినందించారు. బుధవారం కేశవరావును ఆయన నివాసంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అరిశనపల్లి జగన్ మోహన్ రావు, కార్యదర్శి దేవ్ రాజ్, కోశాధికారి సీజే శ్రీనివాస్ రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిసిసిఐ దేవ్ రాజ్ ను టీమిండియాకు మేనేజర్‌గా నియమించినందుకు హర్షం వ్యక్తం చేశారు. జగన్ మోహన్ రావు అధ్యక్షతన కొత్త కార్యవర్గం ఏర్పాటైన తర్వాత హెచ్ సి ఏ పనితీరు మెరుగుపడిందని ఆయన ప్రశంసించారు. భవిష్యత్తులో తెలంగాణలో క్రికెట్ అభివృద్ధికి సభ్యులంతా ఒక తాటిపైన కలిసి పనిచేయాలని సూచించారు, ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

## ఢిల్లీలో సంక్షేమ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు ఓటేయండి

### తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావ్

**హైదరాబాద్,జనవరి 22,ప్రభాతవార్త:** తెలంగాణ తరహాలో ఢిల్లీలో సంక్షేమం అభివృద్ధితో కూడిన పాలన అందుకోవడానికి కాంగ్రెస్‌కు ఓటేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మొగిలి సునీతారావ్ అన్నారు. బుధవారం ఢిల్లీ ఎన్నికలలో భాగంగా కల్కాజి విధానసభ క్షేత్ర్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నేషనల్ ప్రెసిడెంట్ అల్కా లంబ విజయాన్ని ఆకాంక్షిస్తూ తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆల్కలాంబ పీడిత ప్రజల పక్షాన అనేక పోరాటలు చేశారని ఆమె అన్నారు. ముఖ్యంగా బిజెపి ప్రజావ్యతిరేక విధానాలు చట్టసభల్లో వినిపించే అవకాశం ఆమెకు ఇవ్వడానికి చేతి గుర్తుపైన ఓటు వేయాలని ఆమె కోరారు. నియోజకవర్గం గ్రేటర్ కమ్యూనిటీలో ప్రచారం నిర్వహించారు. ఢిల్లీ ప్రజలు మార్పు కోరుకుంటున్నారుని సునీతారావ్ తెలిపారు. ప్రజల నుండి ఎక్కువ స్పందన అల్కలకు ఉన్నది. కర్ణాటక రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ వచ్చిన విధంగా ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇంచార్జి కోఆర్డినేటర్ నీలం పద్మ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రెసిడెంట్ రాజనోళ్ల లక్ష్మి స్టేట్ ఉపాధ్యక్షులు మంగన్నగారి సుగుణనిర్మల రెడ్డి అంజలి యాదవ్ నాయిని రజిత సంతోష దుబ్బ రూప క్వాలిటీరఫియా బేగంఎస్కే జాను పాల్గొన్నారు .

## అమెరికాలో దుండగుల కాల్పుల్లో మరణించిన హైదరాబాద్ వాసి మృతదేహం రప్పించేందుకు చర్యలు

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** అమెరికాలో చదువుకునేందుకు వెళ్లి అక్కడ దుండగుల కాల్పుల్లో మరణించిన హైదరాబాద్ వాసి రవితేజ మృతదేహాన్ని భారత్‌కు రప్పించేందుకు సర్కారు చర్యలు తీసుకోసాగింది. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి విదేశీ వ్యవహారాల శాఖకు లేఖ రాశారు. వీలైనంత త్వరలో రవితేజ మృతదేహాన్ని భారత్‌కు రప్పించి హైదరాబాద్‌లోని అతని కుటుంబ సభ్యులకు అప్పగించాలని చీఫ్ సెక్రటరీ తన లేఖలో కోరారు.

# యుజిసి సంస్కరణలపై భగ్గుమంటున్న విద్యార్థి సంఘాలు

## సంస్కరణల పేరుతో యూనివర్సిటీలను కేంద్రం గుప్పిట్లోకి తీసుకోవాలని చూస్తోంది

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) విశ్వవిద్యాలయాల్లో సంస్కరణలను తీసుకురావడానికి సిద్ధపడింది. ఇందుకు సంబంధించిన సంస్కరణలపై విద్యార్థి సంఘాలు భగ్గు మంటున్నాయి. యూనివర్సిటీల్లో సంస్కరణలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు యూజీసీ దిష్టిబొమ్మ దహనం చేయగా.. యూజీసీ తమ ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని మరి కొన్ని సంఘాలు డిమాండ్ చేశాయి. యూజీసీ రూపొందించిన ముసాయిదా అమల్లోకి వస్తే విశ్వవిద్యాలయాలు కేంద్ర ప్రభుత్వం గుప్పిట్లోకి వెళతాయని, రాష్ట్రాల హక్కులను హరించడానికే కేంద్రం ప్రభుత్వం ఈ ముసాయిదా తీసుకువచ్చిందని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) విమర్శించింది. యూజీసీ ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో యూజీసీ దిష్టిబొమ్మను దగ్ధం చేసింది. యూజీసీ మార్గదర్శకాలపై ఇప్పటికే కేరళ, తమిళనాడు రాష్ట్రాలు ఈ ముసాయిదాను వ్యతిరేకిస్తూ నిర్ణయం తీసుకున్నాయని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం కూడా వెంటనే యూజీసీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. యూజీసీ ప్రతిపాదించిన ముసాయిదా అమల్లోకి వస్తే వర్సిటీల్లో ధ్వంసం అవుతాయన్నారు. ప్రధానంగా ఉపకులపతుల(వీసీ)ల నియామకాల్లో రాష్ట్రాలకు ఎలాంటి అధికారం ఉండదన్నారు. ప్రస్తుత విధానం ప్రకారం, వీసీల నియామకాలకు



తొలుత ప్రభుత్వం నుంచి ఒకరు, యూనివర్సిటీ నుంచి ఒకరు, యూజీసీ నుంచి మరొకరు సభ్యులుగా సెర్చ్ కమిటీలు ఏర్పాటు చేస్తారు. సెర్చ్ కమిటీ జాబితాను ప్రభుత్వానికి పంపిస్తుంది. వాటిని పరిశీలించిన తర్వాత ప్రభుత్వం గవర్నర్ ఆమోదానికి పంపిస్తుంది. గవర్నర్ ఆమోదం తర్వాత వీసీని నియమిస్తూ నోటిఫికేషన్ జారీ చేస్తారు. అయితే ఇప్పుడు ప్రకటించిన ముసాయిదా ప్రకారం.. వీసీల నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి పాత్ర ఉండదు.. గవర్నర్ వీసీని ఎంపిక చేస్తారని తెలిపారు. ఇక్కడ వీసీ పోస్టుకు అర్హత సాధించాలంటే కనీసం 10 ఏళ్ల పాటు ప్రొఫెసర్‌గా పనిచేసిన అనుభవం ఉండాలన్న నిబంధనను ముసాయిదాలో తొలగించారని గుర్తు చేశారు. వీసీల కోసం పారిశ్రామికవేత్తలతోపాటు వివిధ రంగాల్లోని మేధావులు, పరిశోధన ప్రతినిధులు, పాలనా అనుభవం ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఇకపై వర్సిటీల్లో పనిచేయనివారు, ప్రొఫెసర్లు కానివారు ఎవరైనా వీసీలుగా ఎంపికయ్యే అవకాశం ఉందని తెలిపారు. దాంతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ల నియామకాల్లోనూ మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఈ పోస్టులకు అర్హత సాధించాలంటే ఒకే సబ్జెక్టులో పీజీ, పీహెచ్‌డీ చేసి ఉండాలి.. కానీ తాజా ముసాయిదా ప్రకారం.. గ్రాడ్యుయేషన్, పీజీల్లో ఏ సబ్జెక్టు చదివినా, పీహెచ్‌డీ చేసిన సబ్జెక్టుతో సంబంధం లేకుండా ప్రొఫెసర్ పోస్టులకు అర్హత సాదించే అవకాశం ఉంది. ఇప్పటికే కేంద్రంలోని బీజేపీ వాళ్లకు అనుకూలమైన వ్యక్తులతో ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేస్తున్నారని విమర్శించారు.

యూజీసీ ముసాయిదా ద్వారా వర్సిటీలను తమ ఆధీనంలోకి తీసుకొనే దిశగా కేంద్రప్రభుత్వం కుట్ర దాగి ఉందన్నారు.

యూనివర్సిటీ ల్లో వైస్ ఛాన్సలర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలకు సంబంధించిన నిబంధనల మార్పుల కోసం యూజీసీ జారీ చేసిన ముసాయిదా మార్గదర్శకాలు ఉన్నత విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) విమర్శించింది. కొత్త ముసాయిదా మార్గదర్శకాల ప్రకారం ఎవరైనా పరిశ్రమ నిపుణులు, అలాగే ప్రభుత్వ రంగాలకు చెందిన సీనియర్ నిపుణులను నేరుగా విశ్వవిద్యాలయాల వీసీలుగా నియమించవచ్చని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీల నాణ్యతను తగ్గించడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. వర్సిటీలను ప్రైవేటీకరించే విధంగా, విద్యార్థులను కార్మికులుగా మార్చే పరిస్థితి వస్తుందన్నారు. వీసీల నియామకాలు ఇప్పుడు ఛాన్సలర్లు అంటే గవర్నర్ల పరిధిలోకి రానున్నాయన్నారు. విద్య ఉమ్మడి జాబితా కిందకు వచ్చే అంశమని, ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్ర విశ్వవిద్యాలయాలపై నిబంధనలను బలవంతంగా యూజీసీ అమలు చేయకూడదన్నారు. విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తును పూర్తిగా నాశనం చేయాలని బీజేపీ చూస్తోందన్నారు. ముసాయిదాను యూజీసీ తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌కు డ్రగ్ కల్చర్ తెచ్చిందే బిఆర్ఎస్

### కెటిఆర్ సిఎం రేవంత్‌రెడ్డిపై పిచ్చిమాటలు మానుకో

### ఈటల రాజేందర్ బిజెపిలో బిఆర్ఎస్ కోవర్టు

### కంటోన్మెట్ ఎమ్మెల్యే గణేష్

**హైదరాబాద్, జనవరి 22,ప్రభాతవార్త:** హైదరాబాద్ లో డ్రగ్స్ కల్చర్ తెచ్చిందే బీఆర్ఎస్ ప్రభుత్వం మా ప్రభుత్వం డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతుంది అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ ఆరోపించారు. బుధవారం సిఎల్‌పి కార్యలయంలో విలేఖరులతో మాట్లడుతూ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయడానికి కేటీఆర్ కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు.సీఎం రేవంత్ రెడ్డి పైన కేటీఆర్ పిచ్చి మాటలు మాట్లాడుతున్నావు అది నీకు సరికాదు అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదన్న కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించడారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్ ను ప్రజలు ప్రతిపక్షానికి పరిమితం చేశారని ఎద్దేవాచేశారు.గ్రేటర్ హైదరాబాద్‌లో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గుండు సున్నా చేస్తూ ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించి బీఆర్ఎస్‌ను మూడో స్థానానికి పరిమితం చేశారని గుర్తుచేశారు.కంటోన్మెంట్ లో ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని కితాబు ఇచ్చారు.హైదరాబాద్ కు మెట్రో రైలు తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వం అని స్పోత్కర్షలు చెప్పుకున్నారు.మా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మెట్రో ను నగరం నలువైపులా విస్తరిస్తున్నాంమని వివరించారు. జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక కేసీఆర్ కుటుంబం విమర్శలు చేస్తోందని ఆవేదన చెందారు. కేసీఆర్ కుటుంబం క్రిమినల్స్ తరహాలో అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది అని విమర్శించారు. ప్రజలు మరిచిపోతారన్న భయంతోనే బీఆర్ఎస్ మీడియాలో హడావిడి చేస్తోందని అన్నారు.బీఆర్ఎస్ నాయకులు ఫేక్ ధర్నాలు, దీక్షలు చేస్తున్నారని విమర్శించారు.ఫార్ములా ఈ రేస్ కేసులో విచారణతో కేటీఆర్‌కు మతిభ్రమించినట్లుంది అని అన్నారు. కేటీఆర్ ఎర్రగడ్డ పిచ్చాసుపత్రి లో చికిత్స చేయించుకోవాలని సలహా ఇచ్చారు.సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాభివృద్ధి కోసం రోజులో 18 గంటలు కష్టపడుతున్నారుని గణేష్ ధృవీకరణ పత్రం జారీచేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చి ఉపాధి కల్పించడం కోసమే సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు అని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ నడిరోడ్డుపై హత్యలు జరిగాయని అన్నారు. పాతబస్తీలో నెల రోజుల పాటు కర్ఫ్యూ పెట్టిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిది మాత్రమే అని అన్నారు. ఈ కుట్ర లపై పోలీసులు నిఘా పెట్టాలని కోరుతున్న ప్రతిపక్ష పాత్ర పోషించలేక కెసిఆర్ ఫామ్ హౌస్ కు పరిమితమయ్యాడు అని అన్నారు.బీజేపీ ఎంపీ ఈటలరాజేందర్ బీఆర్ఎస్ కోవర్ట్ అని భాష్యం చెప్పారు. గతంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ కు కమిషన్లు ఎలా తీసుకోవాలో తెలుసు అని విమర్శించారు అవినీతి చేస్తున్నాడని దళితుడైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పైన బట్ట కాల్చి మీదేస్తున్నారు.ఈటె లరాజేందర్ అసహనంగా ఉన్నారు.. రియల్టర్ల పై న వీధి రౌడీలా ఈటల రాజేందర్ వ్యవహరించారు. సమస్య ఉంటే ఈటెల రాజేందర్ చట్టపరంగా ఫిర్యాదు చేయాలి కానీ ఆయనే దాడులు చేస్తే ఎలా అనినిలదీశారు.జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయంఅని జోస్యంచెప్పారు. ఎమ్మెల్యేలను కాపాడుకోవడం కోసమే కేటీఆర్ హడావిడి చేస్తున్నాడు అని అన్నారు.ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతారనే భయం బీఆర్ఎస్ కు పట్టుకుంది.ఎవరి ఇంట్లో కేటీఆర్ సమావేశం పెట్టాడో ఆ ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్‌లో చేరడానికిసిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ గేట్లు తెరిస్తే బీఆర్ఎస్ లో ఒక్క ఎమ్మెల్యే కూడా ఉండదని ఆయన అన్నారు. పార్టీ గ్రీన్ సిగ్నల్ ఇస్తే కాంగ్రెస్ లో చేరడానికి అంతా సిద్ధంగా ఉన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఇంకా ఆట మొదలు పెట్టలేదు. జీహెచ్ఎంసీ మేయర్ పైన బీఆర్ఎస్ అవిశ్వాసం పెడితే ఏం జరుగుతుందో మీరే చూస్తారుని ఆయన వివరించారు.

## ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి

### ఎస్‌జీటీయూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదనరావు

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కల్పించాలని కరీంనగర్- మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సంకినేని మధుసూదన రావు డిమాండ్ చేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్(ఎస్‌జీటీయు) తెలంగాణ తరఫున కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ నియోజకవర్గ గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా సంకినేని మధుసూదన్ రావుని బరిలో ఉంచుతున్నట్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం తెలియజేశారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ అభ్యర్థి సంకినేని మధుసూదన్ రావుతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ)గా ఉపాధ్యాయ వృత్తిని 30 సంవత్సరాలుగా నిర్వహించిన మధుసూదన్ రావు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పరిరక్షణ కోసం ఎస్‌జీటీ యూనియన్‌ను ఏర్పాటుచేసి గత ప్రభుత్వాల ద్వారా నోషనల్ ఇంక్రిమెంట్స్ సాధించారని తెలిపారు. పాఠశాలలకు సర్వీస్ పర్సన్స్ నియమించుటలో తన కృషి మరు వలేనిదని అలాంటి వ్యక్తిని ఎస్‌జీటీ ఉపా ధ్యాయులమందరం సంఘాలకు అతీతంగా ఎస్జీటీల గొంతును శాసనమండలిలో విడిపిం చుటకు.. ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న ఉపాధ్యాయుల సమస్యలను సాధించుటకు, ప్రైవేటు కాంట్రాక్టు, ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరుద్యోగుల సమస్యలను వాటితోపాటు పీఆర్‌సీలో వేతన వ్యత్యాసం తొలగిపోవడానికి ఎమ్మెల్సీగా గెలిపిం చుకోవాలన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కల్పించాలి.. అలాగే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు ఉండాలి. ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కావడానికి మనందరి తరుపున కృషి చేస్తానని మండలిలో ప్రశ్నించే గొంతుకగా పనిచేసే మధుసూదన్ రావుని ఎమ్మెల్సీగా గెలిపించుకుందామని వారు తెలిపారు.

## తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు

### తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ జి.రాధారాణి

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జనవరి 22 ప్రభాతవార్త:** తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు అని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ జి.రాధారాణి అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, శంకరం వేదిక, సంయక్త ఆధ్వర్యంలో 'గిడుగు జాతీయ పురస్కారాలు' ప్రదానోత్సవ సభ కళారత్న, ప్రముఖ కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జస్టిస్ రాధారాణి హాజరై పురస్కారాలను అందించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ పి.విజయలక్ష్మి పండిట్, విమలసాహితీ సమితి అధినేత జల్ది విధ్యాధరరావు, తెలుగువన్ వ్యవస్థాపకులు రవిశంకర్, ఫౌండేషన్ చైర్మన్ కాంతి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిడుగు జాతీయ జీవన పురస్కారాలను ప్రముఖ సినీరచయిత దివాకర్ బాబు, ప్రముఖ నవలాకారులు భగీరథ, సీనియర్ పాత్రికేయులు కస్తూరి శ్రీనివాస్, రాజకీయ విశ్లేషకులు విక్రమ్ పూల, ఆధ్యాత్మిక సేవకురాలు డాక్టర్ పి.సునందబాబు, సాహితీవేత్త డాక్టర్ ముక్తేవి భారతి, సినీ పరిశోధకులు వినయాకరావు, సంఘసేవకులు హనుమంతరావు, రామచంద్రనాయక్‌లకు సాహిత్య పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ కవయిత్రి మామిడాల శైలజ రాసిన అంతర్లీనం కవిత్వం, నామాని సృజనాదేవి రాఇన ఆకాశమంత కథల సంపుటి పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధాకుసుమ నిర్వహణలో కవిసమ్మేళనం జరిగింది. కార్యక్రమానికి వ్యాఖ్యాత్రిగా పద్మశ్రీలత వ్యహరించారు.

## విశ్వ సంగీత గురువు కె.రామాచారి

### తెలంగాణ ప్రభుత్వం పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి

### ప్రముఖ సంగీత గురువు, గాయకుడు కె.రామాచారికి ఘనంగా గురువందనం


కె.రామాచారిని విశ్వసంగీత గురువు బిరుదుతో ఘనంగా సత్కరిస్తున్న కె.వి.రమణాచారి, పి.వి.సాయిబాబా, మామిడిహరికృష్ణ, గరికపాటివెంకట్, ఓలేటి, జనార్ధనమూర్తి, గొర్తిచంద్రశేఖర్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, జనవరి 22 ప్రభాతవార్త :** వేలాది మంది శిష్యులకు సంగీతాన్ని నేర్పిస్తూ గొప్ప గాయనీ గాయకులుగా అత్యున్నతస్థాయికి పయనించే మార్గం సుగమం చేస్తున్న ప్రఖ్యాత సంగీత గురువు కొమాండూరి రామాచారికి గురువందనంతో విశ్వ సంగీత గురువు బిరుదును ప్రదానం చేయడం ఎంతో సబబు హర్షదాయకమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. ఏ కార్యక్రమమైన శుభప్రదం, దిగ్విజయంగా జరగాలంటే ముందుగా తల్లి ఆశీస్సులే ముఖ్యమని, తల్లి నిండైన చల్లనిదీవెనలతోనే జన్మకు, జీవితానికి సార్ధకత ఏర్పడుతుందన్న విషయాన్ని నేడు పుట్టినరోజు జరుపుకుంటున్న కె.రామాచారి ముందుగా తల్లికి తీపితినిపించి ఆశీస్సులు పొందడమే ఈ వేడుక ద్వారా అందరం గమనించి తెలుసుకోవాల్సిన, స్ఫూర్తిని పొందాల్సిన అవసరముందని నిరూపించారని ఆయన అన్నారు. ఒక గొప్ప గురువుగా వేలాదిమందిని ప్రముఖ గాయకులుగా తీర్చిదిద్దుతూ షష్టిపూర్తి చేసుకొంటున్న రామాచారి మరో 4 దశాబ్దాలపాటు ఆయుఃఆరోగ్యాలతో నిండు నూరేళ్ల ఆనందోత్సాహాలతో జీవించి మరింత మంది శిష్యులు దేశం గర్వించదగ్గ మహోన్నత గాయకులుగా తయారుచేయాలని ఆకాంక్షిస్తూ కె.రామాచారి, సుజాత దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, శ్రీరామ సాంస్కృతిక సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధానమందిరంలో బుధవారం జరిగిన ప్రముఖ సంగీత దర్శకుడు, నేపథ్య గాయకుడు, సంగీత గురువు, లిటిల్ మ్యూజిషి యన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు కొమాండూరి రామాచారి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్ గొర్తి నిర్వహణలో వేలాదిమంది శిష్యులు, ప్రముఖ గాయకులు, సంగీత దర్శకులు, సాహితీమూర్తులు, ప్రముఖులు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి, భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, గరికపాటి వెంకట్, ఓలేటి పార్వతీశం, కళా వి.ఎస్.జనార్ధన్‌మూర్తి, పి.వి.సాయిబాబా, దైవజ్ఞశర్మ, సాంస్కృతిక సంస్థల అధ్యక్షులు డా. ఎం.కె.రాము, వంశీరామరాజు, పొత్తూరి రంగారావు, గొర్తి చంద్రశేఖర్, ఎం.రఘురామ్, జి.సత్యనారాయణ, సుబ్బారావుల తోపాటు వివిధరంగాలకు చెందిన ఆర్.పి. పట్నాయక్, డా. బంటి తదితర శ్రేయోభిలాషులు,రామాచారి సుజాత దంపతులను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రంలో ఎరువుల కొరత లేదు: వ్యవసాయ మంత్రి నాగేశ్వరావు

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుత యాసంగి సీజనుకు గాను ఎక్కడా ఎరువుల కొరత లేదని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలో బుధవారంజరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్టంలో వచ్చే నెల వరకు సరిపడ ఎరువులు నిల్వలు అందుబాటులో వున్నా యన్నారు. ఎరువుల సరఫరా కూడా నిరంతరాయం జరిగేటట్లు చర్యలు తీసుకున్నామని వివరించారు. ఎరువుల పంపిణీలో ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు, జాప్యం తలెత్తకుండా చూడాలని చెప్పారు. యూరియా తదితర ఎరువులను ముందుగానే ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘాలు, వ్యవసాయ రైతు సేవా కేంద్రాలు ద్వారా రైతులకు అందుబాటులో వుంచాలన్నారు. రాష్ట్రంలో ఈ యాసంగి సీజనులో 9.80 లక్ష టన్నుల యూరియా, 1.50 లక్ష టన్నుల డిఎపి, 7.00 లక్ష టన్నుల కాంప్లెక్స్, 70 వేల టన్నుల మ్యూరో ఆఫ్ పొటాష్ (ఎంఒపి), 60 వేల టన్నుల సింగిల్ సూపర్ ఫాస్పేట్ (ఎస్ఎస్‌పి) ఎరువులు అవసరమవుతాయని అంచనా వేసినట్లు చెప్పారు.ఈ సీజన్ మొదలు నుంచి ఈ రోజు వరకు 4.98 లక్ష టన్నుల యూరియా, 1.26 లక్ష టన్నుల డిఎపి, 4.66 లక్ష టన్నుల కాంప్లెక్స్, 28 వేల టన్నుల ఎంఒపి, 22 వేల టన్నుల ఎస్ఎస్‌పి ఎరువులను రైతులు ఇప్పటికే కొనుగోలు చేశారని వివరించారు. ఇప్పటికి ఇంకా 3.03 లక్ష టన్నుల యూరియా, 22 వేల టన్నుల డిఎపి, 1.93 లక్ష టన్నుల కాంప్లెక్స్, 38 వేల టన్నుల ఎంఒపి, 16వేల టన్నుల ఎస్ఎస్‌పి ఎరువులు రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయని తెలియచేశారు.

**ఆధునిక పరిజ్ఞానంతో గోదాములు**

రాష్ట్రంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గోదాముల నిర్మాణాన్ని చేపట్టాలని మంత్రి సూచించారు.ఆహార ధాన్యాల నిల్వలో సాంకేతిక పద్ధతులు పాటించినట్లయితే వాటి నాణ్యత దెబ్బతినదన్నారు.

# 'మా అత్యంత పెద్దబలం హైదరాబాద్, యువత'

ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు పకడ్బందీ ప్రణాళికలతో ముందుకెళ్తున్నాం

సరిహద్దు రాష్ట్రాలతో స్నేహపూర్వకంగా ఉంటూ అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడతాం


అభివృద్ధి విషయంలో మా విధానాలు సుస్థిరంగా ఉంటాయి. తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

ఏపీ సిఎం చంద్రబాబు, మహారాష్ట్ర సిఎం వేదిక పంచుకున్న సమావేశంలో రేవంత్‌రెడ్డి ప్రసంగం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి22:** సరిహద్దు రాష్ట్రాలతో స్నేహపూర్వక వాతావరణం కొనసాగిస్తూ అభివృద్ధి విషయంలో ప్రపంచంతో పోటీ పడాలన్నదే తెలంగాణ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఆధ్వర్యంలో దావోస్‌లో బుధవారం జరిగిన "కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్" రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో కలిసి ఒకే వేదిక పంచుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గారు పలు ప్రశ్నలపై మాట్లాడుతూ..."పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు,అలాగే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో వేదికను పంచుకోవడం నాకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. మేము సరిహద్దులతో పాటు నదులు, కృష్ణా, గోదావరి నీటిని కూడా పంచుకుంటున్నాం. ఈ నదులు మహారాష్ట్ర నుండి ప్రారంభమై, తెలంగాణలోకి ప్రవేశించి, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రవహిస్తాయి. అందువల్ల, మేం అభివృద్ధి సాధించడమే మా మొదటి ప్రాధాన్యత" అన్నారు. హైదరాబాద్ రాజధానిగా ఉన్న తెలంగాణ ప్రపంచంతోనే పోటీ పడుతుందని, న్యూయార్క్, టోక్యో లాంటి నగరాల స్థాయికి అభివృద్ధి చెందాలనేది లక్ష్యమని తెలిపారు. తెలంగాణ పొరుగు రాష్ట్రాలతో సుహృద్భావ సంబంధాలను కొనసాగిస్తుందని పేర్కొన్నారు. కంప్యూటర్స్, టెలికాం రంగాల్లో రాజీవ్ గాంధీ ప్రారంభించిన సంస్కరణలు, పీవీ నరసింహారావు సరళీకృత ఆర్థిక విధానాలతో ప్రపంచ దేశాలతో పోటీ పడే మార్గాన్ని చూపించారని చెప్పారు. చంద్రబాబు, రాజశేఖర రెడ్డి రాష్ట్రాన్ని, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన తీరు అసాధారణమని పేర్కొన్నారు. ఇప్పుడు, తెలంగాణ ప్రపంచ స్థాయి నగరాలతో, టోక్యో, సింగపూర్ వంటి నగరాలతో పోటీపడుతోంది. మేము దేశీయ రాష్ట్రాలతో పోటీ పడటం కన్నా చైనా ప్లస్ వన్ కంట్రీకి గమ్యస్థానంగా తెలంగాణ ఉందన్నారు. దేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలన్న భారత ప్రధానమంత్రి లక్ష్యసాధనలో తెలంగాణ భాగస్వామ్యమవుతుందని, ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు తెలంగాణ ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలతో ముందుకుపోతోందన్నారు. తెలంగాణను మూడు ప్రాంతాలుగా అభివృద్ధిని సాధించాలని లక్ష్యంగా నిర్దేశించామని, ఓఆర్ఆర్ లోపల కోర్ అర్బన్ ప్రాంతంలో ఐటీ, ఫార్మా రంగాలున్నాయి. రెండో భాగం ఓఆర్ఆర్ నుంచి 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డు పూర్తయితే 65 శాతం తెలంగాణ నగర ప్రాంతంగా మారుతుందన్నారు. ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి పట్టణీకరణ కీలకం. తెలంగాణ సరిహద్దు వరకు గ్రామీణ ప్రాంతంలో కోల్డ్ స్టోరేజీ, ఆర్గానిక్ ఆహార ఉత్పత్తులు, మాంసం, కోళ్ల చేపల ఎగుమతి పాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించాలని అనుకుంటున్నానని తెలిపారు. ప్రపంచం ఎలా పురోగమిస్తుందో తెలుసుకోవడానికి దావోస్ పర్యటన ఉపయోగపడింది. అదే సమయంలో తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించాలని అనుకుంటున్నామని పేర్కొన్నారు. 'మా అత్యంత పెద్ద బలం హైదరాబాద్, యువత' అని ప్రకటించారు. 'మా ప్రభుత్వ విధానాలు పారదర్శకంగా ఉంటాయి. మాపై నమ్మకం ఉంచండి. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు. కానీ అభివృద్ధి విషయంలో మా విధానాలు సుస్థిరంగా ఉంటాయి. తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి." అని వేదిక నుంచి పారిశ్రామిక వేత్తలను కోరారు. ఈ కార్యక్రమానికి అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సమీర్ సరన్ సంధానకర్తగా వ్యవహరించారు. భారతదేశం రాష్ట్రాల అభివృద్ధి దృక్పథం సంక్షేమం, సాంకేతికత, ఉద్యోగాల కల్పన భవిష్యత్తు.. వంటి పలు అంశాలపై ముగ్గురు ముఖ్యమంత్రులు ఈ వేదికపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## మణిపూర్‌లో జెడియు యూటర్న్

పార్టీచీఫ్‌ను పదవినుంచి తప్పించిన జెడియు హైకమాండ్



**ఇంఫాల్, జనవరి 22:** ఈశాన్యరాష్ట్రం మణిపూర్‌లోజెడియు అనుసరించిన వ్యూహం విచిత్రంగా ఉంది. అక్కడి బిజెపి సర్కారుకు జెడియు షాక్ ఇస్తూ తన మద్దతును ఉపసంహారించుకుంటున్నట్లుప్రకటించింది. జెడియు రాష్ట్ర చీఫ్ క్షేత్రమయుం బీరేన్‌సింగ్ అధికారికంగానేప్రకటించారు. బిజెపికి మద్దతు ఉండదని, తమకున్న ఏకైక ఎమ్మెల్యే ఎండి అబ్దుల్‌నాసిర్ ఇకప్రతిపక్షంలో ఉంటారని తెలిపారు. ఈప్రకటనను జెడియు హైకమాండ్ తోసిపుచ్చింది. మణిపూర్‌లో బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహారించుకున్నామంటూ వచ్చిన వార్తలను జెడియు తోసిపుచ్చింది. అవన్నీ నిరాధారమని పార్టీ జాతీయ ప్రతినిధి రాజీవ్ రంజన్‌ప్రసాద్ తెలిపారు. అది క్షేత్రమయుం బీరేన్‌సింగ్ తన సొంతప్రకటన అని ఆయనజాతీయ నాయకత్వాన్ని సంప్రదించలేదని తెలిపారు. క్రమశిక్షణారాహిత్య చర్యగా భావించి ఆయనను పదవినుంచి తప్పించామని రాజీవ్‌రంజన్ తెలిపారు. మణిపూర్‌లోజెడియు ఆరుస్థానాల్లో గెలిస్తే ఐదుగురు ఎమ్మెల్యేలు బిజెపిలో చేరిపోయారు. ఉన్న ఏకైక ఎమ్మెల్యేతో ఉన్న మణిపూర్ జెడియు ఇపుడు మద్దతు ఉపసంహరించుకోలేదని తెలుస్తోంది. జెడియు హైకమాండ్ ఆదేశంతో ఇపుడు రాష్ట్రచీఫ్‌కు ఉన్న పదవికాస్తా పోయింది.

## గ్రామ సభల్లో గొడవలన్నీ బిఆర్ఎస్ చేయించినవే: మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి22:** లబ్దిదారుల ఎంపిక కోసం జరుగుతున్న గ్రామ సభలలో గొడవలు చేయిస్తున్నది బిఆర్ఎస్ పార్టీ యే నంటూ మంత్రి సీతక్క ఆగ్రహించారు. పదేళ్ల తర్వాత గ్రామ సభలు జరుగుతుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని.. గ్రామ సభల్లోనే అర్హులని గుర్తిస్తున్నామని తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ, నిన్న మొత్తం 3410 గ్రామాల్లో గ్రామసభలు జరిగాయని.. కేవలం 142 గ్రామాల్లోని ఆందోళనలు జరిగాయని, అంటే కేవలం నాలుగు శాతం గ్రామాల్లోనే కొంత గొడవ జరిగిందని, అది కూడా టీఆర్ఎస్ వాళ్ళు ఉద్దేశపూర్వకంగా చేశారని ఆరోపించారు. అంటే 96 శాతం గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో గ్రామసభలు జరిగినట్టు స్పష్టమవుతుందన్నారు గతంలో ఎమ్మెల్యేలు చెప్పిన వాళ్ళకే పథకాలు వచ్చేవని విమర్శించారు. ఫామ్ హౌస్‌లో, ఎమ్మెల్యేలు ఇండ్లలో కూర్చొని లబ్ధిదారులను ఎంపిక చేశారని.. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గ్రామ సభల్లోనే ప్రజల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా లబ్ధిదారులను గుర్తిస్తుంటే కావాలని టీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఓట్లప్పుడే పథకాలు అరకొరగా ఇచ్చేవారన్నారు. కానీ ప్రజా అవసరాలు, ఆర్థిక వనరులను బట్టి పథకాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని.. అందుకే ఉద్దేశపూర్వకంగా బీఆర్ఎస్ గొడవలు చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్ మాటలు నమ్మి కొందరు ఆర్థిక సామాజిక రాజకీయ కుల సమగ్ర ఇంటింటి సర్వేలో పాల్గొనలేదని.. ఇప్పుడు వాళ్ళకి పథకాలు రావనే ఆందోళన ఉందన్నారు. ఏ ఒక్క అర్హుడు నష్టపోకుండా ప్రజాపాలన దరఖాస్తులు తీసుకున్నామని స్పష్టం చేశారు. గ్రామ సభల్లో కూడా దరఖాస్తులు తీసుకుంటున్నామని, బీఆర్ఎస్ చేత కానితనం వల్లే సమస్యలు వస్తున్నాయన్నారు. పది సంవత్సరాల్లో అన్నీ సాఫీగా చేస్తే ఇన్ని సమస్యలు ఎందుకు అని ప్రశ్నించారు. వందల ఎకరాలు ఉన్న భూస్వాములకు రైతుబంధు ఇచ్చారని.. కానీ రెక్కల కష్టాన్ని నమ్ముకున్న కూలీలకు ఎలాంటి సహాయం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇతర పథకాలు ఇస్తామని స్పష్టం చేశారు.

## గత పదేండ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలే

రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా మహబూబ్‌నగర జిల్లాలో గ్రామసభకు హాజరు



కప్పెట గ్రామసభలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహా

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 22,ప్రభాతవార్త :** టి.అర్.ఎస్.ప్రభుత్వం పదేండ్లలో ఒక్క కొత్త రేషన్ కార్డు, పేదోడికి ఒక ఇల్లు కూడా ఇవ్వలేదని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో బుధవారం ఆయన పర్యటించారు. భూత్పూర్ మండలం కప్పెటలో జరిగిన గ్రామ సభలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం దేవరకద్రలో రూ.35 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ 7 లక్షల కోట్ల రూపాయల అప్పులకు వడ్డీ చెల్లించుకుంటూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. 2లక్షలలోపు రుణ మాఫీ చేసినట్లు తెలిపారు. సన్న వడ్లకు 500 రూ.లు క్వింటాలుకు బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. జనవరి 26నుండి రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు నాలుగు కొత్త పథకాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. వైద్య శాఖలోవినూత్న ఆలోచనలతో ముందుకు పోతున్నట్లు తెలిపారు. రహదారులు విస్తరిస్తున్న క్రమంలో రహదారులపై ప్రమాదాలు జరిగితే వెంటనే అత్యవసర చికిత్స అందించేందుకు ప్రతి 30 నుండి 40 కి.మీ. పరిధిలో ట్రామా కేర్ సెంటర్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో కార్డియాలజీ విభాగం సేవలు లేవని తన దృష్టికి వచ్చిందని,కార్డియాలజీ విభాగం, ఎం.అర్.ఐ స్కానింగ్ ఉగాదిలోగా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేంద్ర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, ఎస్పీ జానకీ, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంగ్లండ్‌పై తొలి టి20 విజయం

ఏడు వికెట్లతేడాతో భారత్ గెలుపు




**కోల్‌కత్తా,జనవరి 22:** ఇంగ్లండ్‌తో ప్రారంభించిన ఐదు టి20ల సిరీస్‌లో టీమిండియాకు మంచి బోణీ అయింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన తొలి టి20లో భారత్ ఏడు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత ఇంగ్లండ్ 20 ఓవర్లలో 132పరుగులకే ఆలౌట్ కాగా ఈ స్వల్ప లక్ష్యాఇన్న భారత్ 12.5 ఓవర్లలోనే ఛేదించింది. ఓపెనర్ అభిషేక్‌శర్మ 79 పరుగులుచేసాడు. 34 బంతుల్లో ఐదు ఫోర్లు, ఎనిమిది సిక్స్‌లు చేసి ఆకాశమే హద్దుగాచ ఎలరేగాడు. ఆతడు 20 బంతుల్లోనే అర్థసెంచరీకూడా పూర్తి చేసాడు. సంజుశాంసన్ 26 పరుగులుచేసి పర్వాలేదనిపించాడు. 20 బంతుల్లో నాలుగు ఫోర్లు ఒక సిక్స్ ఉంది. తిలక్‌వర్మ 19 పరుగులు చేసి జట్టు విజయానికి తోడ్పడ్డారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ రెండు, ఆదిల్‌రషీద్ ఒక వికెట్ తీసారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంతో ఉంది. రెండో టి20 చెన్నై వేదికగా శనివారం అంటే 25వ తేదీజరుగుతుంది. ఇంగ్లండ్ బ్యాటర్లలో కెప్టెన్ జోస్ బట్లర్ 44 బంతుల్లో 8 ఫోర్లు రెండు సిక్స్‌లతో 68 పరుగులుచేసాడు. హ్యారీబ్రూక్ 17, జోఫ్రా ఆర్చర్ 12 పరుగులుచేసారు. ఫిల్‌సాల్ట్, లివింగ్‌స్టన్‌లు డకౌట్ అయితే బెన్‌డకెట్‌నాలుగు, జాకబ్ బెతెల్ ఏడు, జేమీ ఒవర్టన్ రెండు సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో వరుణ్‌చక్రవర్తి మూడు, అర్ష్‌దీప్‌సింగ్, హార్దిక్ పాండ్య, అక్షర్‌పటేల్ తలో రెండు వికెట్లు తీసారు. ఈమ్యాచ్‌లో మాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా అభిషేక్‌శర్మ నిలిచాడు. కోల్‌కత్తాలో భారత్‌కు వరుసగా ఏడవ టి20 విజయంగా చెప్పుకోవాలి.

## ప్రపంచ స్థాయి ప్రమాణాలతో హైదరాబాద్ అభివృద్ధి

డబ్ల్యుఈఎఫ్, సిఐఐ, హీరో మోటార్‌కార్స్ రౌండ్ టేబుల్ సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి22:** ప్రపంచ స్థాయి అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్ ను అభివృద్ధి చేయాలనే తెలంగాణ ప్రభుత్వ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, హీరో మోటార్ కార్స్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన, పర్యావరణ అనుకూల నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలని అన్నారు. తెలంగాణలో నాలుగు కోట్ల మంది ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు సహకరించాలని అందరినీ ఆహ్వానిస్తున్నామని తెలిపారు. తక్కువ ఖర్చుతో ప్రజలు వేగంగా ప్రయాణించాలన్నది మా ప్రభుత్వ ఆకాంక్ష. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చుతుందన్నారు. తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలో భాగంగా హైదరాబాద్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నామన్నారు. పర్యావరణ హితంగా హైదరాబాద్‌ను నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దాలనేది మా అభిమతమన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ అవకాశాలు హైదరాబాద్‌లో ఉండాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వెహికిల్స్ పై మేము ప్రత్యేక దృష్టిని సారించాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దు చేశాం. అని తెలిపారు. భారత దేశంలోనే ఈవీ వాహనాలు అత్యధికంగా అమ్ముడుపోయే రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. మొబిలిటీ ఒక్కటే అన్నింటికీ పరిష్కారం కాదు. ఇప్పుడున్న పరిస్థితులను పర్యావరణ అనుకూలంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే గ్రేటర్ హైదరాబాద్ సిటీలో ప్రజా రవాణా వ్యవస్థలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడుతున్నామని ప్రకటించారు. తెలంగాణ డ్రైపోర్టును నిర్మించి వేర్ హౌజ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. రాష్ట్రానికి తీరప్రాంతం లేని లోటును పూడ్చడానికి ఈ డ్రై పోర్టును మచిలీపట్నం పోర్టుకు రోడ్డు, రైల్వే మార్గాలతో అనుసంధానం చేస్తామన్నారు. నగరాల అభివృద్ధికి, వాటి భవిష్యత్తుకు అర్బన్ మొబిలిటీ భవిష్యత్తుకు పునాదని తెలిపారు. తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో చేరుకునే రవాణా సదుపాయాలున్న నగరాలే ఎక్కువ కాలం మనగలుగుతాయని పేర్కొన్నారు.

హైదరాబాద్ నగరంలో 1.2 కోట్లకు పైగా జనాభా ఉంది. దాదాపు 100 కిలోమీటర్లకు పైగా కొత్తగా మెట్రో లైన్లను నిర్మిస్తున్నామని ప్రకటించారు. ఇప్పుడున్న దానికంటే ఇది రెండింతలు ఎక్కువ అని చెప్పారు. నేను నా బృందంతో కలిసి జ్యూరిచ్ నుంచి దావోస్ కు రైలులో ప్రయాణించాం. అదొక అందమైన అనుభూతిని కలిగించే ప్రయాణమని వెల్లడించారు. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టూ 160 కి.మీ మేరకు ఔటర్ రింగ్ రోడ్డు ఉంది. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల 360 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నామని తెలిపారు.. ఆ రెండు రింగ్ రోడ్లను కలుపుతూ రేడియల్ రోడ్లు కూడా నిర్మిస్తాం. రింగ్ రోడ్లకు అనుబంధంగా రింగ్ రైల్వే లైను నిర్మించాలనే ఆలోచనలున్నాయని పేర్కొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అర్బన్ మొబిలిటీపై అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఇచ్చినందుకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, హీరో మోటార్ కార్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## గయ, నలందను సందర్శించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్,చైర్మన్ సుఖేందర్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జనవరి22:** పాట్నాలో జరిగిన 85వ ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ అనంతరం తెలంగాణ శాసన సభ బృందం సైట్ విజిటింగ్‌లో భాగంగా బోధ్ గయ,గయ, నలందను సందర్శించింది. సందర్శించిన వారిలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ గారు, లేజిస్లేచర్ సెక్రటరీ డా.వి నరసింహాచార్యులు, అధికారులు ఉపేందర్‌రెడ్డి, సుధాకర్, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు ఉన్నారు. యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన బోధ్ గయలోని గౌతమ బుద్ధుడు జ్ఞానోదయం పొందిన బోధి వృక్షం, మహాభోది ఆలయంను శాసన బృందం సందర్శించింది.గయలోని ప్రఖ్యాత విష్ణుపాద మందిరంలో పూజలు చేసి ఫాల్గు నదిలో తన తల్లిదండ్రులకు, సతీమణి స్వర్గీయ గడ్డం శైలజకు స్పీకర్ ప్రసాద్ కుమార్ పిండ ప్రదానం చేశారు. అనంతరం నలంద విశ్వవిద్యాలయంను తెలంగాణ శాసనబృందం సందర్శించింది.

## ఉత్తరకర్ణాటకలో రోడ్డుప్రమాదం 10 మంది మృతి, 15 మందికి గాయాలు



**కార్వార్(కర్ణాటక), జనవరి 22:** కర్ణాటకలోని కార్వార్‌లో ఘోరరోడ్డుప్రమాదం సంభవించింది. యల్లాపూర్ ఘాట్‌రోడ్డులో లారీ బోల్తాపడి 10మంది మృతి చెందగా 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. మృతులంతా కూరగాయల వ్యాపారులుగా స్థానిక పోలీసులు గుర్తించారు. ప్రమాద సమయంలో లారీలో మొత్తం 25 మంది ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు ఇతర వాహనదారులువెంటనే సమాచారం పోలీసులు అంబులెన్స్‌కు అందించారు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తున్నారు. కాగాప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు రావాల్సి ఉంది. కర్ణాటక సింధనూరు వద్ద మరో దారుణం చోటుచేసుకుంది. రోడ్డుప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురుప్రాణాలు కోల్పోయారు. కర్నూలు జిల్లా మంత్రాలయం వేదపాఠశాలకు చెందిన 15మంది విద్యార్థులు కర్ణాటక రాష్ట్రం హంపి క్షేత్రానికి తూఫాన్ వాహనంలో బయలుదేరారు. అయితే సింధనూరువద్దకు రాగానే ప్రమాదవశాత్తూ కారు టైర్‌ఊడిపోయింది. దీనితో వేగంగా వెళుతున్న వాహనం పల్టీలు కొట్టింది.ఈ ప్రమాదంలో హైవదన, అభిలాష, సుజేంద్ర ముగ్గురు విద్యార్థులు సహా డ్రైవర్‌ప్రాణాలు కోల్పోయారు. మరికొంత మందికి తీవ్రగాయాలు కాగా వారిని హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారు.

## కాంగ్రెస్ సర్కారుపై ప్రజా తిరుగుబాటు మొదలైంది: కెటిఆర్ ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి22:** కాంగ్రెస్ సర్కారుపై ప్రజా తిరుగుబాటు మొదలైందని.. గ్యారెంటీల గారడీపై జనగర్జన షురూ అయ్యిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. ఇక తరిమి కొట్టడమే మిగిలిందంటూ వ్యాఖ్యనించారు.. గ్రామసభల్లో ప్రజలు కాంగ్రెస్ నేతలపై తిరుగబడుతున్న దానిపై ఆయన స్పందిస్తూ.. అసమర్థ ముఖ్యమంత్రి అసలు స్వరూపం బట్టబయలైందన్నారు. ఇక కాలయాపనతో కాలం సాగదని.. అటెన్షన్ డైవర్షన్ ఏమాత్రం చెల్లదన్నారు. ఈ దరఖాస్తుల దందా నడవదని, ఈ ఆగ్రహ జ్వాల ఇక ఆగదని హెచ్చరించారు. నమ్మించి చేసిన నయవంచనకు నాలుగుకోట్ల సమాజం ఊరుకోదన్నారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు గ్రామసభలు అట్టుడికాయన్నారు. గ్రామసభలా ఖాకీల క్యాంప్ లా? అంటూ ఎక్స్ వేదిక ద్వారా ప్రశ్నించారు. సంక్షేమ పథకాల కోసమా..? కాంగ్రెస్ కార్యకర్తల నిర్ధారణ కోసమా అన్నారు. ఖాకీల దౌర్జన్యాలు,కాంగ్రెస్ నేతల బెదిరింపులతో గ్రామసభలు జరుగుతున్నాయన్నారు. పోలీసు పహారాలో గ్రామలను నింపేసి గ్రామసభలా ? అని ప్రశ్నించిన ప్రజలపై ఖాకీల జులుమే సమాధానమా ? అంటూ నిలదీశారు. ఇదా మీరు చెప్పిన ప్రజాపాలనా ? ఇదా..మీరు చెప్పిన ఇంది రమ్మ పాలనా? అని ప్రశ్నించారు. పోలీసుల నడుమ.. అంక్షల నడుమ.. పథకాలకు అర్హుల గుర్తింప! అంటూ నిలదీశారు. నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అన్నట్లు కాంగ్రెస్ పాలన సాగుతుందంటూ సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు.

## పటౌడీ రూ.15వేల కోట్ల స్థిరాస్తులపై ప్రభుత్వ నజర్

**భోపాల్, జనవరి 22:** పటౌడీ కుటుంబానికి చెందిన సుమారు రూ.15వేల కోట్ల స్థిరాస్థులనుస్వాధీనంచేసుకునేందుకు మధ్యప్రదేశ్‌ప్రభుత్వం రెడీ అవుతోంది. పటౌడీ ఫ్యామిలీ వారసుడయిన నటుడు సైఫ్ ఆలీఖాన్‌కు ఆ ఆస్తులతో లింకు ఉంది. ఇటీవలేమధ్యప్రదేశ్ హైకోర్టు ఆ ఆస్తులపై కీలక తీర్పును కూడా ప్రకటించింది. పటౌడీ ఆస్తులపై 2015లో విధించిన‌స్టేను ఎత్తివేస్తూ మధ్యప్రదేశ్ కోర్టు తీర్పు ఇచ్చింది. దీనితో 1968 నాటి ఎనిమి ప్రాపర్టీ చట్టంప్రకారం పటౌడీ కుటుంబ ఆస్తులనుప్రభుత్వం స్వాధీనంచేసుకునే అవకాశాలున్నాయి. హీరో సైఫ్ పూర్వీకులకు చెందిన ఆస్తుల్లో ఫ్లాగ్‌స్టాఫ్ హౌస్ ఉంది. ఇక్కడే సైఫ్ తన బాల్యం గడిపాడు. నూర్ ఉస్ సాహెబ్‌ప్యాలెస్, దార్ ఉల్ సలామ్, బంగ్లా ఆఫ్ హబిబ్, అహ్మదాబాద్ ప్యాలెస్, ఖోఫిజా ప్రాపర్టీలు కూడా ఉన్నాయి. మధ్యప్రదేశ్ హైకోర్టు జస్టిస్ వివేక్ అగర్వాల్ ఈకేసులో తీర్పు ఇస్తూ ఎనిమి ప్రాపర్టీ యాక్టుప్రకారం సంబందిత వ్యక్తులు 30 రోజుల్లోగా పిటిషన్లు దాఖలుచేసుకోవచ్చన్నారు. దేశవిభజన తర్వాత పాకిస్తాన్‌కు వలసపోయిన వారి స్థిరాస్తులను కేంద్రం ఎనిమి ప్రాపర్టీ చట్టంప్రకారం స్వాధీనంచేసుసే అవకాశం ఉంది. అయితే భూపాల్‌కు చెందిన చివరినవాబు హామీదుల్లాఖాన్‌కు ముగ్గురు కుమార్తెలు. ఆయన పెద్దకుమార్తె అబిదాసుల్తాన్ 1950లో పాకిస్తాన్‌కు వెళ్లిపోయింది. రెండోకుమార్తె సాజిదా సుల్తాన్ ఇండియాలోనే ఉంది. నవాబ్ ఇఫ్తికర్ ఆలీఖాన్‌పటౌడీని ఆమె పెళ్లిచేసుకుని పటౌడీ ఆస్తులకు ఆమె చట్టపరమైన వారసురాలయింది. సాజిదా సుల్తానా మనవడే సైఫ్ ఆలీఖాన్. అయితే





పటౌడీ ప్రాపర్టీల్లో కొంతషేర్ ఇపుడు సైఫ్‌కు వస్తుంది. అయితే అబిదా సుల్తాన్ వలసవెళ్లడంవల్ల ఆ ప్రాపర్టీని ఎనిమి ప్రాపర్టీగాభావిస్తూప్రభుత్వం జప్తుచేసే అవకాశాలున్నాయి. 2019లో సాజిదా సుల్తాన్‌ను చట్టపరమైన వారసురాలిగా గుర్తించినా తాజా తీర్పుతో ఫ్యామిలీ ప్రాపర్టీ వివాదంమళ్లీ మొదటికి వస్తున్నది. భోపాల్‌కలెక్టర్ కౌశలేంద్ర విక్రమంసింగ్ గత 72 సంవత్సరాలకు చెందిన ప్రాపర్టీ ఓనర్‌షిప్ రికార్డులు పరిశీలించాలని నిర్ణయించారు. ఈ భూమల్లో ఉంటున్నవారిని కిరాయిదారులగానే పరిగణిస్తామన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల పటౌడీ ప్రాపర్టీల్లో ఉంటున్న సుమారు లక్షన్నర నివాసితులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం ఆ భూముల్ని లాక్కునే ఛాన్స్ ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

## ఇంటిముందే హెజ్‌బొల్లా సీనియర్‌కమాండర్ హత్య




**బీరూట్, జనవరి 22:** హెజ్‌బొల్లా సీనియర్‌కమాండర్ షేక్ ముహ్మద్ ఆలీ హమాదీ దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియన వ్యక్తులు ఆయన్ను కాల్చిచంపారు. తూర్పు లెబనాన్‌లో ఈఘటన చోటుచేసుకున్నట్లు స్థానిక మీడియా కథనాలుప్రచురించింది. ముహ్మద్ ఆలీ హెజ్‌బొల్లా అల్‌బఖా రీజియన్‌కు కమాండర్‌గా కొనసాగాడు. తన నివాసం బయటే ఉన్న ఆయనపై రెండు వాహనాల్లో వచ్చిన గుర్తుతెలీని వ్యక్తులు కాల్పులుజరిపారు. తీవ్ర గాయాలయిన ఆలీ హెజ్‌బొల్లాను ఆసుపత్రికి తరలించగా అప్పటికే కన్నుమూసినట్లు వైద్యులు గుర్తించారు. కొన్నేళ్లుగా కొనసాగుతున్న కుటుంబ కలహాలవల్లనే ఆయనపై ఈ దాడి జరిగి ఉంటుందన్న అనుమానాలున్నాయి. కానీ మహమ్మద్ ఆలీ మృతికి కారణం ఎవరు అన్నదానిపై ఇప్పటివరకూ ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. షేక్ ముహ్మద్ ఆలీ హమాదీ ఎఫ్‌బిఐ మోస్ట్ వాంటెడ్ లిస్ట్‌లోఉన్నాడు. 1985లో 153 మందిప్రయాణీకులతో ఉన్న వెస్ట్ జర్మనీ విమానాన్ని హైజాక్‌చేసిన వారిలో ఈతడు కూడా కీలకంగా ఉన్నాడు. ప్రయాణీకుల్లో ఉన్న అమెరికా జాతీయుడిని చిత్రహింసలకు గురిచేయడంతో చనిపోయాడు. దీనితో ఆతడిని ఎఫ్‌బిఐ మోస్ట్ వాంటెడ్ లిస్ట్‌లోచేర్చింది.

## నటుడు జయచంద్రన్‌పై లుకౌట్ నోటీసులు



**కోజికోడ్, జనవరి 22:** పోక్సో కేసులో తప్పించుకుని తిరుగుతున్న ప్రముఖ మళయాళ నటుడు కూటిక్కళ్ జయచంద్రన్ ఉరఫ్ కెఆర్‌జయచంద్రన్‌పై కేరళ పోలీసులు లుక్‌ఔట్‌నోటీసు జారీచేసారు. నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలున్న జయచంద్రన్‌పై కోజికోడ్‌లోని కసాబా పోలీస్ స్టేషన్‌లో గత ఏడాదే కేసునమోదయింది. బాధిత బాలిక తల్లి ఫిర్యాదుతో నటుడిపై పోక్సో కేసు నమోదుచేసి పోలీసులు దర్యాప్తుప్రారంభించారు. ఈకేసులో జయచంద్రన్ ముందస్తు బెయిల్‌కోసం ప్రయత్నించగా కేరళ హైకోర్టులో ఆయనకు చుక్కెదురయింది. కోజికోడ్‌సెషన్స్‌కోర్టుకూడా బెయిల్ నిరాకరించింది. దీనితో ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. ఈ క్రమంలో పోలీసులు ఆయనపై లుకౌట్ నోటీసు జారీ చేసారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు కసబ పోలీసులకు సమాచారం ఇవ్వాలని నోటీసుల్లో వివరించారు.

## 2027 కల్లా షింకన్‌సేన్ హైస్పీడ్ రైళ్లు



**న్యూఢిల్లీ జనవరి 22:** రైల్వేల్లోఆధునిక రైళ్లతోపాటు రైల్వే మార్గాలను ఆధునీకరిస్తున్న ప్రధానిమోడీ ఎన్డీయే సర్కారు 2029-30 కల్లా కొత్త అత్యంత వేగంగా పయనించే ఆధునిక షింకన్‌సేన్ ఆల్ఫా ఎక్స్ లేదా ఈ10 హైస్పీడు రైలును భారత్‌ట్రాక్‌పైకి తీసుకోస్తోంది. 1700 కోట్ల డాలర్ల విలువైన ముంబయి అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు భారత ప్రభుత్వం, గుజరాత్, మహారాష్ట్ర, నేషనల్ హైస్పీడ్ రైల్‌కార్పొరేషన్‌ల జాయింట్ వెంచర్‌గా వస్తోంది. 2026 నాటికి ఈ హైస్పీడ్‌రైలును జపాన్ భారత్‌కు అందచేయనున్నది. 280 కిలోమీటర్లు వేగంతోప్రయాణించే ఈ రైళ్లు ప్రస్తుతం గంటకు 249 కిలోమీటర్ల వేగంతో నడుపుతారు. ఇందుకోసం ఇండియన్ రైల్వే ఇంటిగ్రల్‌కోచ్‌ఫ్యాక్టరీ రూ.867 కోట్ల కాంట్రాక్టును బిఇఎంఎల్‌కు అందచేసింది. గత ఏడాది అక్టోబరులోనే ఈ కాంట్రాక్టు ఇచ్చింది. ఉత్పత్తిచేయడంతోపాటు ఈరైళ్లనుప్రారంభించే బాధ్యతకూడా ఆ కంపెనీదే. బుల్లెట్‌రైలు మౌలికవనరులను వృధాగా పోనీయకుండా 2026-27 నాటికి భారత్‌జపాన్‌లు ఇప్పటికే టెస్ట్ రన్‌ను నిర్వహించాలని నిర్ణయించాయి. దేశీయంగానే ఉత్పత్తి అవుతున్న సెమీ హైస్పీడ్ బుల్లెట్‌రైళ్లు అహ్మదాబాద్ ముంబయి కారిడార్‌లో 2027కల్లా పరుగులు తీయవచ్చని అంచనా. భారత్‌జపాన్‌లు ఇపుడు తాజాగా షింకన్‌సేన్ ఇ10 ఎక్స్‌ప్రెస్ రైళ్లను తీసుకురావాలని గట్టిపట్టుదలతో ఉన్నాయి. వచ్చే ఏడాది బుల్లెట్‌రైలు ప్రాజెక్టు పూర్తయితే అహ్మదాబాద్ ముంబయి కారిడార్‌లో ఈ రైళ్లనడుస్తాయని అంచనా.జపాన్ ఇప్పటికే భారత్‌కు తమ సొంత హైస్పీడ్ ప్రోటోటైప్ రైళ్లను బుల్లెట్‌రైళ్ల సాంకేతిక వనరులతోనే అందించేందుకు సంసిద్ధత వ్యక్తంచేసింది. 2026-27కల్లా ఈ రైళ్లు భారత్‌కు చేరతాయని రైల్వేశాఖ అంచనావేస్తోంది.

# యూఫోరియా మ్యూజికల్ నైట్‌కి అందరూ ఆహ్వానితులే..

బ్లడ్ డొనేషన్ సొసైటీకి చాలా గొప్ప డొనేషన్. మీరు ఇచ్చే ప్రతిరక్తపు బిందువు చాలా జీవితాలని నిలబెడుతుంది. ఈ గొప్ప కార్యక్రమం ముందుకు తీసుకెళ్లడానికి ఫిబ్రవరి 15న ఎన్టీఆర్ ట్రస్ట్ యూఫోరియా మ్యూజికల్ నైట్ షోని నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్కరూ కుటుంబసమేతంగా వచ్చి ఈ షోలో పాల్గొనాలని కోరుకుంటున్నాను. ఆడియన్స్ ఖర్చు చేసిన ప్రతి ఒక్క రూపాయి తిరిగి సమాజ సేవకే ఉపయోగపడుతుంది అన్నారు ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి నారా భువనేశ్వరి. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఎన్టీఆర్ ట్రస్ట్ యూఫోరియా మ్యూజికల్ నైట్ షో జరగనుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్, ఎన్టీఆర్ ట్రస్ట్ సిఈవో రాజేంద్ర కుమార్, ఎన్టీఆర్ ట్రస్ట్ సివోవో గోపి పాల్గొన్నారు. ప్రెస్ మీట్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి నారా భువనేశ్వరి మాట్లాడుతూ, మా ఆహ్వానం అంగీకరించి ఇక్కడికి విచ్చేసిన అందరికీ ధన్యవాదాలు. నాన్న నందమూరి తారక రామారావు అలా పిలిస్తే మీకు ఇష్టం ఉండదు. మన అన్నగారు నందమూరి తారక రామారావు ఆయన చాలా కష్టపడి పైకి వచ్చిన మహోన్నత వ్యక్తి. ప్రజలే దేవుళ్ళు అని భావించి బడుగు బలహీన వర్గాల కోసం, రాష్ట్ర ప్రజల కోసం వాళ్ళ భవిష్యత్తు కోసం ఏమీ ఆశించకుండా రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన ప్రజల కోసం విప్లవాత్మకమైన పథకాలను ఎంతో ధైర్యంతో ముందుకు తీసుకువెళ్లారు. రెండు రూపాయలకి కిలో బియ్యం, ఆడపిల్లలకు ఆస్తిలో సమాన హక్కు.. ఇలా ఎన్నో పథకాలు తెలుగు జాతిని, ప్రజల్ని మనసులో పెట్టుకొని ముందుకు తీసుకువెళ్లారు.



మన ప్రజా నాయకుడు నారా చంద్రబాబునాయుడు, ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజలకు విద్య, వైద్య, ఆరోగ్యం అందుబాటులో వుండాలని ఎన్టీఆర్ మెమొరియల్ ట్రస్ట్‌ని స్థాపించారు. అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వం సహాయం తీసుకోకుండా 28యేళ్లుగా ఈ ప్రయాణం కొనసాగుతోంది. ఎన్టీఆర్ ఆశయాలని ట్రస్టు పాటిస్తోంది. ఆయన కలలని నెరవేర్చడానికి మేము ఎప్పుడూ ముందుంటాం. 2013లో వచ్చిన ఫైలన్ తుఫాన్, 2014లో వచ్చిన హుదూద్ తుఫాన్, 2018 కేరళ వచ్చిన తుఫాన్ సమయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ముందు అడుగేసి ప్రజల కావాల్సిన సహాయం అందించింది. ట్రస్ట్ ద్వారా ప్రజాసేవాలో అందరికంటే ముందుటాం. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఏమనగా, జెనిటిక్ డిసార్డర్ తలసేమియాతో చాలా మంది పిల్లలు, పెద్దలు బాధపడుతున్నారు. ఈ వ్యాధి వున్న వారికి బ్లడ్‌లో హిమోగ్లోబిన్ చాలా తక్కువగా వుంటుంది. ఊపిరి పీల్చుకోవడానికి కూడా ఇబ్బంది పడుతుంటారు. ఇది తీవ్రంగా వచ్చినప్పుడు రక్త మార్పిడి వెంటనే జరగాలి. దీనికి చాలా రక్తం అవసరం. బ్లడ్ డొనేషన్‌పై ప్రజల్లో చాలా అపోహాలు వున్నాయి. బ్లడ్ డొనేషన్ చేయడానికి భయపడాల్సిన అవసరం లేదు. నిపుణులు అన్ని పరిశీలించిన తర్వాత బ్లడ్ తీసుకుంటారు.

బ్లడ్ డొనేషన్ సొసైటీకి చాలా గొప్ప డొనేషన్.మీరు ఇచ్చే ప్రతిరక్తపు బిందువు చాలా జీవితాలని నిలబెడుతుంది. అది ప్రజలు గుర్తించాలి. ఈ గొప్ప కార్యక్రమం ముందుకు తీసుకెళ్లడానికి మాకు ముందు గుర్తుకు వచ్చింది ఎన్ తమన్. సారీ నందమూరి తమన్ (నవ్వుతూ). మా టీం ఆయన్ని కలసిన వెంటనే ఆయన ఒప్పుకున్నారు. మా ట్రస్ట్ తరపున ఆయనకి హృదయ పూర్వక ధన్యవాదాలు. ఫిబ్రవరి 15న ఎన్టీఆర్ ట్రస్ట్ యూఫోరియా మ్యూజికల్ నైట్ షోని నిర్వహిస్తున్నాం.

# 'బ్యాడ్‌బాయ్ కార్తీక్' ఫస్ట్ లుక్ రిలీజ్

హీరో నాగశౌర్య ప్రస్తుతం ఓ అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. ఈ మూవీకి రామ్ దేశినా (రమేష్) దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాస రావు చింతలపూడి నిర్మిస్తున్నారు. నాగశౌర్య పుట్టినరోజు సందర్భంగా ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేశారు. ఈ చిత్రానికి బ్యాడ్ బాయ్ కార్తీక్ అనే పవర్ ఫుల్ టైటిల్‌ని ఖరారు చేశారు. టైటిల్ నాగ శౌర్య క్యారెక్టర్ ఇంటెన్స్ నేచర్‌ని సూచిస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో వ్యాన్ వెనుక కూర్చుని ఇంటెన్స్ లుక్‌తో ఫెరోషియస్ అవతార్‌లో కనిపించారు. అతని నుదిటిపై రక్తంతో కూడిన మూడు గోవింద నామాలు, చేతులపై రక్తపు మరకలు కనిపిస్తున్నాయి. వ్యాన్‌పై వున్న స్టిక్కర్ హైదరాబాద్‌లో బాద్ అనే పదాన్ని తొలగించడం అతని పాత్ర దూకుడు స్వభావాన్ని, యాక్షన్‌ప్యాక్డ్ స్టయిల్‌ని సూచిస్తుంది. ఈ చిత్రంలో నాగశౌర్య జోడిగా విధి హీరోయిన్‌గా నటిస్తోంది. సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, వెన్నెల కిషోర్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్ కుమార్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రసూల్ ఎల్లోర్ డీవోపీగా పని చేస్తున్నారు. సంగీత దర్శకుడు హారిస్ జయరాజ్ తెలుగు సినిమాకు కమ్ బ్యాక్ ఇస్తూ మ్యూజిక్ కంపోజ్ చేస్తున్నారు. రామాంజనేయులు ఆర్ట్ డైరెక్టర్ కాగ, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్. షూటింగ్ కంప్లీట్ కావస్తున్న ఈ చిత్రం ఇంట్రస్టింగ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌తో ప్రమోషన్స్‌ని ప్రారంభించింది. రెగ్యులర్ అప్‌డేట్స్‌తో రాబోతున్నారు మేకర్స్. నటీనటులు: నాగ శౌర్య, విధి, సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్ కుమార్, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, పృథ్వీ, అజయ్, ప్రియ, నెల్లూరు సుదర్శన్, కృష్ణుడు, చమక్ చంద్ర, శివన్నారాయణ, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: రామ్ దేశిన (రమేష్) నిర్మాత: శ్రీనివాసరావు చింతలపూడి బ్యానర్: శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ డీవోపీ: రసూల్ ఎల్లోర్ సంగీతం: హారిస్ జైరాజ్ ఆర్ట్: రామాంజనేయులు ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు, ఫైట్స్: సుప్రీమ్ సుందర్, పృథ్వి, కొరియోగ్రాఫర్స్: రాజు సుందరం, శోబి మాస్టర్, విజయ్ పోలంకి, శిరీష్ లిరిక్స్: చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్, కృష్ణకాంత్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శంకర్, పీఆర్వో: వంశీశేఖర్.



# 'బాబీ డియోల్'కు మరో ఆఫర్!

బాలీవుడ్ నటుడు బాబీ డియోల్‌కి ప్రస్తుతం టైమ్ బాగా కలిసి వస్తోంది. యానిమల్ సినిమాతో ఫామ్‌లోకి వచ్చిన ఆయన రీసెంట్‌గా 'డాకు మహారాజ్'తో తెలుగు తెరకు నేరుగా పరిచయం అయ్యారు. పైగా 'డాకు మహారాజ్'కి విలన్‌గా బాబీ డియోల్ తన పాత్రలో ఒదిగిపోయారు. ఇప్పుడు బాబీ డియోల్‌కి మరో క్రేజీ ఆఫర్ వచ్చినట్టు తెలుస్తోంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా రాబోతున్న సినిమా 'స్పిరిట్'. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా ఓ పవర్ ఫుల్ కాప్ స్టోరీగా రాబోతుంది. కాగా ఈ సినిమాలో బాబీ డియోల్ సీరియస్ పోలీస్ ఆఫీసర్ గా నటించనున్నాడని, పైగా సినిమాలో బాబీ డియోల్ పాత్ర బాగా పాజిటివ్‌గా సాగుతుందని తెలుస్తోంది. ఇక ఈ చిత్రాన్ని టిసిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ భారీ స్థాయిలో నిర్మించనున్నాయి. అన్నట్టు 'స్పిరిట్' మెయిన్ కథాంశమే చాలా కొత్తగా ఉంటుందని.. సందీప్ రెడ్డి వంగా నుంచి మరో వినూత్న సినిమాగా ఈ చిత్రం రాబోతుందని తెలుస్తోంది. అన్నట్టు హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమా కోసం ఇప్పటికే సాంగ్స్‌ను కంపోజ్ చేయడం స్టార్ట్ చేసిన సంగతి తెలిసిందే. 'స్పిరిట్' చిత్రానికి సంబంధించిన స్పెషల్ సాంగ్‌ను కూడా ఆల్ రెడీ కంపోజ్ చేశారట.



# చివరి దశలో 'త్రిబాణధారి బార్బరిక్' షూటింగ్

కంటెంట్ బేస్డ్, యూనిక్ కాన్సెప్ట్ చిత్రాలను ఆడియెన్స్ ఎక్కువగా ఆదరిస్తున్నారు. కొత్త పాయింట్‌ను సరికొత్తగా చెప్పే మేకర్ల కోసం ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే 'త్రిబాణధారి బార్బరిక్' అంటూ సరికొత్త పాయింట్‌తో రాబోతున్నారు. స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పకుడిగా విజయపాల్ రెడ్డి అడిదల నిర్మిస్తున్న 'బార్బరిక్' మూవీకి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్నారు. వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో సత్యరాజ్, వశిష్ట ఎన్ సింహా, సాంచి రాయ్, ఉదయ భాను,సత్యం రాజేష్, క్రాంతి కిరణ్ వంటి వారు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన పోస్టర్లు, మోషన్ పోస్టర్, గ్లింప్స్, టీజర్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేశాయి. సత్య రాజ్, వశిష్ట, సత్యం రాజేష్ ఇలా ప్రతీ ఒక్కరి పాత్రలకు ఎంత ప్రాముఖ్యత ఉందో టీజర్ చూస్తే తెలుస్తోంది. మరీ ముఖ్యంగా సత్య రాజ్ కనిపించిన తీరు, డిఫరెంట్ లుక్స్, నటించిన విధానం ఈ సినిమాకు హైలెట్ అయ్యేలా కనిపిస్తోంది. టీజర్‌లోని విజువల్స్, ఆర్ఆర్, మేకింగ్ స్టాండర్డ్స్ అన్నీ కూడా నెక్స్ట్ లెవెల్లో ఉన్నాయి. ఈ చిత్రానికి ఇంఫ్యూజన్ బ్యాండ్ ఇచ్చిన మ్యూజిక్ ఆర్ఆర్, కుశేందర్ రమేష్ రెడ్డి కెమెరా వర్క్, మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటింగ్ ప్రత్యేక ఆకర్షణకానుంది. ప్రస్తుతం ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు మేకర్లు ప్లాన్ చేస్తున్నారు. తారాగణం: సత్యరాజ్, వశిష్ట ఎన్ సింహా, సాంచి రాయ్, ఉదయ భాను, సత్యం రాజేష్, క్రాంతి కిరణ్, విటివి గణేష్, మొట్టా రాజేంద్ర. సాంకేతిక బృందం: బ్యానర్: వానర సెల్యూలాయిడ్, రచన, దర్శకత్వం: మోహన్ శ్రీవత్స, నిర్మాత: విజయపాల్ రెడ్డి అడిదల, సమర్పణ: మారుతీ టీమ్ ప్రొడక్ట్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: రాజేష్, లైన్ ప్రొడ్యూసర్: సురేష్ డీఓపీ: కుశేందర్ రమేష్ రెడ్డి సంగీతం: ఇంఫ్యూజన్ బ్యాండ్ ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్, ఆర్ట్ డైరెక్టర్: శ్రీనివాస్ పున్నాస్ ఫైట్స్: రామ్ సుంకర కాస్ట్యూమ్ డిజైనర్: మహి దేరంగుల పిఆర్ఓ: సాయి సతీష్.



# 'తండేల్' థర్డ్ సింగిల్ బ్లాక్ బస్టర్ లవ్ సాంగ్

యువ సామ్రాట్ నాగ చైతన్య మచ్ అవైటెడ్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ తండేల్. చందూ మొండేటి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మిస్తున్నారు. సాయి పల్లవి కథానాయికగా నటిస్తోంది. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్లు బ్లాక్ బస్టర్ నోట్‌లో ప్రారంభమయ్యాయి. ఫస్ట్ సింగిల్ బుజ్జి తల్లి సెన్సేషనల్ హిట్ అయింది. రీసెంట్‌గా రిలీజైన సెకండ్ సింగిల్ నమో నమః శివాయ సెన్సేషన్ క్రియేట్ చేసింది. థర్డ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. తండేల్ థర్డ్ సింగిల్ బ్లాక్ బస్టర్ లవ్ సాంగ్ హైలెస్సో హైలెస్సా జనవరి 23న రిలీజ్ కానుంది. సముద్ర తీరంలో రగ్గడ్ లుక్‌లో లవ్లీ స్మైల్‌తో నిలుచుకున్న నాగచైతన్య, ఎదురుగా బ్యూటీఫుల్‌గా డ్యాన్స్ చేస్తూ సాయి పల్లవి కనిపించిన సాంగ్ అనౌన్స్మెంట్ పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ మూవీకి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. నేషనల్ అవార్డ్ విన్నింగ్ కంపోజర్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు, షామ్‌దత్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, నేషనల్ అవార్డ్ విన్నర్ నవీన్ నూలి ఎడిటర్. శ్రీనాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. తండేల్ ఫిబ్రవరి 7న విడుదల కానుంది. నటీనటులు: నాగ చైతన్య, సాయి పల్లవి, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: చందూ మొండేటి, సమర్పణ: అల్లు అరవింద్, నిర్మాత: బన్నీ వాసు, బ్యానర్: గీతా ఆర్ట్స్, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్ డీవోపీ: షామ్‌దత్, ఎడిటర్: నవీన్ నూలి, ఆర్ట్: శ్రీనాగేంద్ర తంగాల పీఆర్వో: వంశీ శేఖర్.





ప్రియాంకా అరుళ్ మోహన్ నయా లుక్

# 'రజాకార్' మీట్ ది ప్రెస్

బాబీ సింహా, వేదిక, అనిష్కత్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా రజాకార్. ఈ చిత్రాన్ని సమర్‌వీర్ క్రియేషన్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై గూడూరు నారాయణ రెడ్డి నిర్మించారు. యాటా సత్యనారాయణ దరకత్వం వహించారు. గతేడాది థియేటర్స్‌లో రిలీజై మంచి విజయాన్ని అందుకున్న రజాకార్ సినిమా ఈ నెల 24వ తేదీ నుంచి ఆహా ఓటీటీలో వరల్డ్ డిజిటల్ ప్రీమియర్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి మాట్లాడుతూ, సినిమాలను డబ్బు కోసం, ఎంటర్ టైన్ మెంట్ కోసం చేస్తుంటారు. కానీ మేము రజాకార్ సినిమాను ఒక బాధ్యతతో చేశాం. నిజాం పాలనలో రజాకార్లు సాగించిన అకృత్యాలను కళ్లకు కట్టినట్లు చూపించాలనే ప్రయత్నంచేశాం. రేపటి తరాలు రజాకార్ల అకృత్యాలను తెలుసుకోవాలి. మరోసారి అలాంటి వారు రాకుండా జాగ్రత్తగా ఉండాలి. ఈ సినిమా నిర్మించే క్రమంలో నాకు ఎన్నో బెదిరింపులు వచ్చాయి. నన్ను నా కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించారు. కానీ నేను భయపడలేదు. సినిమాను నిర్మించాను. ఐఎండీబీలో 9.5 రేటింగ్ వచ్చింది. గోవా ఫిలిం ఫెస్టివల్‌లో సన్మానం చేశారు. మా టీమ్, మా డైరెక్టర్ యాటా సత్యనారాయణ సపోర్ట్‌తో సినిమా సక్సెస్ ఫుల్‌గా ప్రేక్షకులకు రీచ్ చేయగలిగాం. సొసైటీకి ఇది నేను ఇచ్చిన కాంట్రిబ్యూషన్ అనుకుంటా. ప్రజల నుంచి వచ్చిన స్పందన నాకు ఎంతో సంతృప్తిని మిగిల్చింది. ఈ సినిమాను మరో ప్రొడ్యూసర్ చేయలేదని చెప్పగలను. ఇప్పుడు మన తెలుగు వారి ఓటీటీకే మూవీ ఇవ్వాలని ఆహాలోకి తీసుకొస్తున్నాం. ఈ నెల 24వ తేదీ నుంచి ఆహాలో మా సినిమా ప్రీమియర్‌కు వస్తోంది. మీరంతా సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాం అన్నారు. నటి ఇంద్రజ మాట్లాడుతూ, రజాకార్ సినిమాను ప్రొడ్యూసర్ గూడూరు సత్యనారాయణ రెడ్డి ఎన్నో కష్టాలకు తట్టుకుని నిర్మించారు. దర్శకుడు యాటా సత్యనారాయణ పదేళ్లు ఈ మూవీ కోసం కష్టపడ్డారు. రజాకార్ల అకృత్యాలకు ఈ సినిమా గొప్ప డాక్యుమెంటరీ. మన నేల చరిత్ర గురించి తెలుసుకోవడం ఇక్కడ బతికే ప్రతి ఒక్కరి బాధ్యత. మతాలకు అతీతంగా ఈ సినిమాను ప్రతి ఒక్కరూ ఆహాలో చూడాలి. ఎందుకంటే ఇది హిందూ, ముస్లిం మతాల మధ్య విభేదాలు సృష్టించే మూవీ కాదు. చరిత్రలో జరిగింది జరిగినట్లు తెరకెక్కించారు. ముస్లిం జర్నలిస్ట్ క్యారెక్టర్ మా సినిమాలో గొప్పగా ఉంటుంది. అలాగే ప్రజల కోసం ఎన్నో మంచి పనులు చేసిన ఆరో నిజాం ఘనతను కూడా చెప్పాం. నేను ఈ సినిమాలో వీరనారి చాకలి ఐలమ్మ క్యారెక్టర్‌లో నటించాను. ఇలాంటి గొప్ప క్యారెక్టర్‌లో నటించే అవకాశం కల్పించిన మా డైరెక్టర్‌కి థ్యాంక్స్ చెబుతున్నా అన్నారు. నటుడు నాగమహేశ్ మాట్లాడుతూ, రజాకార్ చిత్రంలో నేను రాపాక రామచంద్రారెడ్డి అనే దేశ్ ముఖ్ క్యారెక్టర్‌లో నటించాను. చాలా క్రూరమైన పాత్ర ఇది. సినిమాలో కీలకమైన ఇలాంటి పాత్రలో నటించే అవకాశం ఇచ్చిన దర్శకుడు యాటా సత్యనారాయణకి థ్యాంక్స్. ఆయన ఎంతో రీసెర్చ్ చేసి ఈ సినిమాను రూపొందించారు అన్నారు. డైరెక్టర్ యాటా సత్యనారాయణ మాట్లాడుతూ,



మా రజాకార్ మూవీకి తెలుగుతో పాటు హిందీ, మరాఠీ, ఇతర భాషల్లో మంచి రెస్పాన్స్ వచ్చింది. 18 ఫిలిం ఫెస్టివల్స్‌కు అప్లై చేస్తే 15 ఫిలిం ఫెస్టివల్స్‌కు సెలెక్ట్ అయ్యింది. గోవాలో జరిగిన ఇఫ్ఫీలో బెస్ట్ ఇండియాడెబ్యూగా నమోదైంది, బెస్ట్ డైరెక్టర్‌గా నామినేట్ అయ్యాను. గోవాలో 75 దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు రాజాకార్ సినిమా చూసి అప్రిషియేట్ చేశారు. జైపూర్ ఫిలిం ఫెస్టివల్‌లో 72 దేశాల ప్రతినిధులు వచ్చి మా మూవీ చూశారు. ఇంత గొప్ప స్వాతంత్ర్యపోరాటం జరిగిందా అని వారంతా ఆశ్చర్యపోయారు. ఎన్నో అవార్డ్‌లు దక్కించుకుంది మా మూవీ అన్నారు. ఆర్ట్ డైరెక్టర్ తిరుమల తిరుపతి మాట్లాడుతూ, రజాకార్ సినిమాకు ఆర్ట్ వర్క్ చేసే అవకాశం ఇచ్చిన మా దర్శక నిర్మాతకు థ్యాంక్స్. చాలా పెద్ద స్పాన్ ఉన్న చిత్రమిది. ఇలాంటి హిస్టారికల్ మూవీకి ఆర్ట్ వర్క్ చేయడం ఎంతో హ్యాపీగా అనిపించింది. డైరెక్షన్ టీమ్, మా డైరెక్టర్ ఇచ్చిన ఇన్‌పుట్స్, మెటీరియల్ సపోర్ట్‌తో వర్క్‌చేశాను. ఈ సినిమా పూర్తయ్యాక నాకు సంతృప్తి కలిగింది అన్నారు.

# శరవేగంగా 'తమ్ముడు' షూటింగ్

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రెస్టీజియస్ మూవీ తమ్ముడు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌లో నిర్మితమవుతున్న 56వ చిత్రమిది. ఈ చిత్రంలో లయ కీలక పాత్రను పోషిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థతో హీరో నితిన్, దర్శకుడు శ్రీరామ్ వేణుకు మంచి అనుబంధం ఉంది. హీరో నితిన్ దిల్, శ్రీనివాస కళ్యాణం వంటి మూవీస్ చేయగా..దర్శకుడు శ్రీరామ్ వేణు నాని హీరోగా ఎంసీఏ, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా వకీల్ సాబ్ వంటి సూపర్ హిట్ చిత్రాలు రూపొందించారు. ఇప్పుడు ఈ ముగ్గురి కాంబినేషన్‌లో తమ్ముడు సినిమా వస్తుండటం సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. తమ్ముడు సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. సంక్రాంతి ఫెస్టివల్ బ్రేక్ లేకుండా శరవేగంగా చిత్రీకరణ జరుపుతున్నారు. ప్రస్తుతం సినిమా క్లైమాక్స్ సన్నివేశాలను రూపొందిస్తున్నారు. దర్శకుడు శ్రీరామ్ వేణు వీలైనంత త్వరగా హై క్వాలిటీతో మూవీ కంప్లీట్ చేసేందుకు శ్రమిస్తున్నారు. ప్రేక్షకులకు మర్చిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను 'తమ్ముడు' సినిమాతో అందించబోతున్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. త్వరలోనే తమ్ముడు సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. నటీనటులు: నితిన్, లయ, తదితరులు. టెక్నికల్ టీమ్: సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి మ్యూజిక్: అజనీష్ లోకనాథ్, పీఆర్వో: వంశీ కాకా, జీఎస్ కే మీడియా బ్యానర్: శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, నిర్మాత: దిల్ రాజు, శిరీష్ రచన, దర్శకత్వం: శ్రీరామ్ వేణు.



# సుందరి మార్గం స్ఫూర్తికి ద్వారం ..



సంస్థ సీఈఓ, సహవ్యవస్థాపకురాలు సుందరి పాటిబండ్ల.

**చదువు ఆగి.. మళ్లీ కొనసాగి...**

సుందరి సొంతూరు ఒంగోలు. అక్కడే తెలుగు మీడియంలో చదువుకున్నారు. పదిహేడేళ్లకే పెళ్లి కావడంతో చదువుకి బ్రేక్ పడినా.. పాప పుట్టాక చదువు మళ్లీ కొనసాగుతోంది. డిగ్రీ పూర్తి చేశాక చెన్నై వెళ్లి చార్టడ్ అకౌంటెన్సీ చేశారు. భర్త శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్‌లో వెటర్నరీ వైద్యులు. కూతురు స్నేహ సీఏ చేస్తోంది. సీఏగా సుందరిది 15 ఏళ్ల అనుభవం. ప్రాక్టీసు చేయాలంటే తన దగ్గరకు వచ్చే ఖాతాల నిర్వహణ, మార్కెటింగ్ వంటి అంశాల్లో సలహాలివ్వడమేకాక కార్యాలయాలు ఎక్కడ, ఎలా ఏర్పాటు చేయాలి.. అలంకరణ, వసతులు ఎలా ఉండాలి.. తదితర అంశాల్లో సూచనలు ఇచ్చేవారు. ఆమె ఆసక్తిని గమనించిన కుటుంబ సభ్యులు, స్నేహి తులు 'కో వర్కింగ్ స్పేస్' రంగంలోకి అడుగుపెట్టమని సలహా ఇచ్చారు. ఈ రంగంపై మరింత పరిశోధన చేసిన సుందరి.. 2017లో హైదరాబాద్‌లోని కొండా పూర్‌లో ఓ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో దాన్ని హంగులతో సిద్ధం చేసి కార్యాలయానికి అద్దెకు ఇచ్చారు. ఆపై రోజు రోజుకూ అభివృద్ధి చేసుకుంటూ వెళ్లారు. హైదరాబాద్ లోనే 10 లక్షల చదరపుటడుగుల స్థాయికి కార్యాలయా లను విస్తరించారు. వీటితోపాటు విజయవాడ, బెంగ ళూరు, చెన్నై, గురుగ్రామ్, పుణెల్లో మరో 10 లక్షల చ.అ.కు పెరిగింది. సంస్థద్వారా 400 మందికి ఉపాధి కల్పిస్తుండగా.. వీరిలో 50 మందికి పైగా మహిళలే.

**కోవిడ్ కష్టాలు ఎదురైనా..** ఐటీ పార్కులు ఉండే చోట భవనాలను పూర్తిగా లేదా కొన్ని అంతస్తుల వరకూ అద్దెకు తీసుకుంటారు సుందరి. వాటిలో ఐటీ సంస్థలకు అనుకూలంగా అన్ని వసతులతో కూడిన కార్యాలయాలను అభివృద్ధి చేసి స్టార్టప్‌లు మొదలు పెద్ద సంస్థలకూ అద్దెకు ఇస్తారు. ఐస్ప్రౌట్ పుంజుకుంటున్న దశలో కోవిడ్ రూపంలో క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యాయి. వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందడుగు వేశారు. ఉద్యోగులు మళ్లీ ఆఫీసులకు రావడం మొదలయ్యాక

పెళ్లి కారణంగా ఆమె చదువు మధ్యలో ఆపాల్సి వచ్చింది. కానీ అది తాత్కాలికమే! తల్లి అయ్యాక ఆమె మళ్లీ తన చదువును పట్టాలెక్కించారు. సీఏ చేశారు. ఆపైన వ్యాపారవేత్తగా మారారు. అక్కడా విజయ వంతమై ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు సుందరి పాటిబండ్ల,

ఆఫీస్‌లో అడుగు పెట్టగానే రంగురంగుల పూల మొక్కల ఆహ్వానం పలుకుతాయి. గోడల పైన భారతీయ సంస్కృతి, ఇతిహాస సన్నివేశాలను తెలిపేలా అలంకరణ వస్తువులు.. బాల్యాన్ని గుర్తుచేసేలా గోళీలు ఆడుతున్న, సెలయేళ్ల ఒడ్డున సందడిచేస్తున్న పిల్లల పెయింటింగ్‌లు దర్శనమిస్తున్నాయి. సామగ్రి ఎంతో ఆహ్లాదకరంగా, ఆధునికంగా ఉంటుంది. 'ఇంతకీ ఇది ఎవరి ఆఫీసు' అంటారా? అందరిదీనూ! అదే.. రెడీమేడ్ సౌకర్యా లున్న 'కో వర్కింగ్ స్పేస్' ఈ ఆఫీసుని నిర్వహిస్తోంది ఐస్ప్రౌట్ సంస్థ. ఈ ఆలోచన వెనక కీలకవ్యక్తి



వీటికి డిమాండ్ పెరిగింది. 'ఆర్థిక మాంద్యం కారణంగా అమెరికా, యూకే వంటి దేశాల్లోని సంస్థలు తక్కువ వేతనాలకే నిపుణులైన మానవ వనరులు దొరికే భారత్‌వైపు చూస్తున్నాయి. కాబట్టి ఇక్కడ కో వర్కింగ్ స్పేస్ వ్యాపారం మరింత వృద్ధి చెందుతుంది' అంటారు సుందరి. వచ్చే రెండేళ్లలో దేశవిదేశాల్లో మరిన్ని నగరాల్లో ప్రారంభించి కార్యాలయాలకు 30 లక్షల చ.అ.కు విస్తరించాలనే లక్ష్యంతో ఉన్నారామె. 'ఎన్ని ఆస్తులు ఉన్నా, అమ్మాయిలకు విద్య చాలా అవసరం. పెళ్లి, పిల్లల కారణంగా కొన్నేళ్లు విశ్రాంతి వచ్చినా, తర్వాత కెరియర్‌లో ముందుకు వెళ్లి లక్ష్యాలను సాధించాలి. కెరియర్ కుటుంబం మధ్య సమతూకాన్ని పాటిస్తే విజయం సాధించవచ్చు' అనేది యువతరానికి సుందరి ఇచ్చే సూచన.

# ఎంతందంగా ఉన్నావే.. ఎవరే నువ్వు !

## మోనాలిసా.. ఓ..మోనాలిసా!



**ఒక మందాకిని... ఒక ఐశ్వర్యరాయ్....వంటి తేనె కళ్ల సుందరి , నీలి కళ్ల సుందరిలను ఆకాశం నుంచి ఊడి పడ్డారా!? అనే విస్మ యం కలిగించిన సొగసుకత్తెలను వెండితెర మీద పరికించాము.**

ఇప్పుడు వారి కన్నా దీటైన పల్లెటూరి సొగసులాడి కుంభమేళాలో చూపరులకు అందంగా.. ఆకర్షణీయంగా అమాయకంగా తేనెకళ్ళతో పలకరిస్తోంది. అదేనండి ఆకర్షణీయ మోము... చిరు నవ్వులతో....ఆమె పూసలు తీసుకోరూ!? ..అన్న చూపులతో ఆకట్టుకుంది. ఇటీవల మహా కుంభమేళా జాతరలో పూసలు, పూసల దండలు అమ్ముకుంటూ ఒక బ్లాగర్ కంటపడింది. అతను ..ఆమె అందాలను తన కెమెరాలో బంధించాడు. మెడలో పూసల దండ సొగసుల కైదండ చిరునవ్వుల గంగ ఆమె సౌందర్యానికే పూర్యాయపదమా అనిపిస్తోంది. అలా ఆమెను చూడకుండా ఎవరూ తమ కళ్లను పక్కకు తిప్పలేరంటే నమ్మండి. వివరాల్లోకి వెళ్తే.. ఆమె ఎవరో కాదు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో విశేషంగా జరుగుతున్న మహాకుంభ మేళాను సందర్శించి పుణ్యస్నానాలు చేసి తరించే సాధుసంతులకు ,అఖండాలకు రుద్రాక్షలు, పూసలు అమ్ముతున్న మోనాలిసా. మోనాలిసా ఇండోర్ నివాసి, మహిళ. ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. కానీ ఎంతోమంది పురుషులు ఆమె సెల్ఫీల కోసం ఎగబడేసరికి మిగతా పూసలోళ్లు



మోనాలిసా సహజ సౌందర్యానికి జనం ముగ్ధులౌతున్నారు. ఆమె వ్యాపారానికి ఆటంకం కలిగిస్తున్నారు. కుంభమేళాకు ఎందుకు వచ్చామో మరిచిపోయి ఆమె సెల్ఫ్ లకోసం తహతహలాడడమే విడ్డూరంగా ఉంది. ఇండోర్‌కు చెందిన మోనాలిసా భోంస్లే అనే టీనేజ్ అమ్మాయి మహా కుంభమేళాలో దండలు అమ్ముతున్నప్పుడు ఆమె చిరునవ్వు మరియు నీలి కళ్ల వైరల్ వీడియో కారణంగా ఇంటర్నెట్ సంచలనంగా మారింది. ఇది 15 మిలియన్లకు పైగా వీక్షణలను సంపాదించింది. దండలు కొనడం కంటే సెల్ఫీలు కోరేవారే ఎక్కువయ్యారు.దాంతో ఆమె జీవనోపాధికి ఆటంకం కలిగిస్తుంటే ఆమె తన ఇంటికితిరిగి వెళ్ళిపోవాల్సి వచ్చింది.సౌందర్యారాధకులు ఆమెను తేనె కళ్ల సుందరిని చూసామన్న ఆనందంతో మరలుతున్నారు.

# ఫ్యాషన్ ఫ్యాషన్

# లక్క గాజుల గలగలలు..











అలనాటి మహారాణులైనా, ఈనాటి పెళ్లికూతుళ్లైనా.. మహిళలంతా ఆ గాజుల అందానికి ఫిదానే. పండుగైనా, వివాహ వేడుకలైనా అతివల చేతులు వీటి మెరుపులతో తళుక్కుమనాల్సిందే. అవే భాగ్యనగరానికీ వన్నె తెచ్చిన అందాల లక్క గాజులు. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ఆ గాజులు తాజాగా భౌగోళిక గుర్తింపును సొంతం చేసుకొన్నాయి. హైదరాబాద్ పాత బస్తీ అంటేనే గాజులకు ప్రసిద్ధి. అందులోనూ చార్మినార్ లాడ్ బజారులో దొరికే లక్కగాజులు స్థానికంగానే కాదు. అంతర్జాతీయంగా ఎంతో పేరుపొందాయి. వీటిని లక్కరాళ్ల గాజులుగానూ పిలుస్తారు. వీటి తయారీ కూడా ప్రత్యేకమే. కొలిమిపై కరిగించగా వచ్చే లక్కను వృత్తాకారంలో మలిచి గాజులుగా తయారుచేస్తారు. రంగురంగుల రాళ్ళు, పూసలు, అందాలు వంటివాటితో వీటికి హంగులు అద్దుతారు. ఈ లక్క గాజులపై చేసే అలంకరణకు ఎటువంటి మెషీన్లు ఉపయోగించకుండా కవేలం చేతులతోనే చేస్తరు.ఈ హస్తకళ కుతుబ్‌షాహీ, నిజాంల కాలంలో ప్రారంభమైందట. ఆనాటి రాజకుటుంబీకుల మహిళలంతా వీటిపై మనసు పారేసుకునేవారట. తరతరాలుగా వస్తోన్న ఈ గాజుల తయారీమీదే నేటికీ 4 వేలకుపైగా కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. అలా తయారవుతున్న ఈ లక్క గాజులు ఆధునిక మహిళల్నీ మురిపిస్తునే ఉన్నాయి. అంతెందుకు ఇప్పటికీ పెళ్లిళ్లంటే నవ వధువుల మనసు వీటివైపే మళ్లుతుంది. అందాన్ని, సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ గాజులకు భౌగోళిక గుర్తింపు దక్కింది. అంటే. ఈ లక్కగాజులు మరింత మంది మహిళల చేతులను మరిపించనున్నాయి అన్నమాట.







## 'రసబలీ' మిఠాయి

ఒడియా ప్రసిద్ధ పిండివంటల్లో 'రసబలీ' మిఠాయి ఒకటి. దీన్నెలా చేయాలంటే.. అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో రెండు కప్పుల పాలు పోసి, కాస్త కుంకుమ పువ్వు వేయాలి. సన్న సెగ మీద పాలు సగం అయ్యేవరకూ మరిగించాలి. అందులో అర కప్పు పంచదార వేసి.. అది కరిగాక, పావు చెంచా యాలకుల పొడి వేసి.. కలియ తిప్పి దించేయాలి. మరో పాత్రలో కప్పు పంచదార వేసి.. అది కరిగాక, పావు చెంచా యాలకుల పొడి వేసి.. కలియ తిప్పి దించేయాలి. మరోపాత్రలో కప్పు తురిమిన పనీర్. చెంచా చొప్పున ఉప్మా రవ్వ, గోధుమ పిండి వేసి బాగా కలిపితే.. మెత్తటి పిండిలా తయారవుతుంది. దాన్ని నిమ్మకాయంత భాగాలుగా చేసి, టిక్కీలుగా ఒత్తుకవోఆలి. సైజు, మందం అన్నీ సమానంగా ఉండేట్లు చేసి, కాగుతున్న నూనెలో బంగారు రంగు వచ్చేవరకూ వేయించాలి. వీటిని టిష్యూ పేపర్ మీదికి తీస్తే.. అదనంగా ఉన్న నూనె పీల్చేసుకుంటాయి. ఈ టిక్కీస్‌ను మరిగించిన పాలలో వేయాలి. అరగంట నానితే సరి. తియ్యటి రసబలీ మిఠాయి సిద్ధమైపోతుంది. సులువైన ఈ స్వీటు సూపర్ టేస్టీగా ఉంటుంది. తిని ఆనందించడమే తరువాయి.



## కర్పూరం ఎందుకంటే..

కర్పూరం సిన్నమోమం కర్పూర చెట్టు నుంచి తయారవుతుంది. ఇది లడ్డూ, ఖీర్, హల్వా, బర్ఫీ లాంటి స్వీట్ల రుచిని రెట్టింపు చేస్తుంది. జీర్ణప్రక్రియను మెరుగుపరుస్తుంది. కొన్ని ప్రాంతాల విందు భోజనం తర్వాత అరుగుదల సమస్య తలెత్తకుండా కాస్త కర్పూరం సేవిస్తారు. కుంకుమపువ్వుల కర్పూరాన్ని కూడా చాలా తక్కువ పరిమాణంలో వాడాలి. మోతాదు మించితే విషతుల్యమై వాంతులు, వికారం, తల తిరగటం వంటి సమస్యలొస్తాయి. పిల్లలకు మరీ ప్రమాదం. అలాగే సెంట్లు, కలరా ఉండలు వంటివాటిల్లో ఉపయో గించే కర్పూరం వంటకు నిషిద్ధం. రసాయనాలు, హానిచేసే పదార్థాలు లేకుండా ఆహారం కోసం తయారుచేసిన కర్పూరాన్ని మాత్రమే వాడాలి. దీన్ని మిఠాయిలోనే కాదు.. సౌందర్యసాధనలు, సుగంధద్రవ్యాలు, మందులు, అత్తర్లలోనూ వాడతారు. క్రిమినాశినిగానూ పని చేస్తుంది. ఆహ్లాదం గొల్పుతూ స్వచ్ఛతను. తాజాదనాన్ని తెచ్చే ఈ పరిమళం వ్యతిరేక శక్తులను పోగొట్టి ఆధ్యాత్మికతను పెంచుతుందని నమ్ముతారు. కర్పూరం డబ్బా మూత గట్టిగా బిగించుకుంటే ఆవిరైపోతుంది.



# సాయి సన్నిధియే పెన్నిధి

ఆధ్యాత్మికం

మానవులు చేయలేని పనిని మహనీయులు చేస్తారు. చేస్తామని చాటింపు వేయించుకోరు. అంతా దైవలీల అంటారు సాయివంటి సద్గురువు. సాయి భక్తులకు సాయి సన్నిధియే పెన్నిది. రవి కాంచనిచోట, కవి గాంచును కదా! అని అంటారు. ఈ యాంత్రిక యుగంలో డాక్టర్లు కూడా నయం చేయలేక చేతులు ఎత్తివేస్తారు. ఆ సమయంలో సాయి తన కరుణ కిరణాన్ని ప్రసరింపచేయవచ్చును. ఒక డాక్టరుకు, అందునా పిల్లల ప్రత్యేక నిపుణుడైన అతనికి వివాహం అయింది. పిల్లవాడు జన్మించాడు. పుట్టిన రెండు నెలల నుండిరాత్రులందు ఏడ్చేవాడు. ఆ డాక్టరు కారణాన్నితెలుసుకోలేకపోయాడు. తోటి డాక్టర్లు కూడా కారణాన్ని తెలుసుకోలేకపోవటమే కాదు, ఆ పసిబాలుని రోదనను (రాత్రులందు) ఆపలేకపోయారు. డాక్టరుగారికి, ఆయన భార్యకు రాత్రులందు నిద్ర కరువైంది. భద్రావతిలో ఉండే ఆయన సోదరుడు షిరిడీ వెళ్లి ఊదిని తాయిత్తులో వేసి పట్టుకు వచ్చాడు. ఆ పసిబిడ్డకు ఆ తాయత్తును కట్టారు. అంతే, ఆబిడ్డడు ఏడుపుమానాడు, రాత్రులందు సుఖంగా నిద్రించ సాగాడు. ఇది ఊదీ మహిమ. షిరిడీలోనే మురళీధర్ భికా ఉండేవాడు. ఆయనకు రెండున్నర సంవత్సరములున్న బిడ్డ ఉన్నది. ఒకసారి ఆ బిడ్డ అనారోగ్యం పాలైంది. సాయినాథుని ఆసుపత్రిలో చేర్చారు. పరీక్షలన్నీ చేసారు. వ్యాధిని నిర్ధారించ లేకపోయారు. బిడ్డను ఇంటికి పంపివేసినారు.



బిడ్డను ఇంటికి తెచ్చినా వైద్యుడేడి? వైద్యం ఏది? షిరిడీలో ఉన్న ప్రముఖ డాక్టర్ గోండ్కరుకు చూపించారు. సాయిబాబా ఇచ్ఛపైనే ఆ బిడ్డ బ్రతికి బట్ట కట్టేది అని చెప్పాడు ఆ డాక్టరు. అది మే నెల. ఇక వైద్యులకే వైద్యుడైన సాయి సన్నిధి ద్వారా మాయికి వెళ్ళారు. బాబా ఆసీనుడైన బండ వద్ద బిడ్డ నుంచి, ధునికి ఎదురుగా గల సాయిఫొటోను ప్రార్థించసాగారు. కన్నీటికి దైవం కరుగుతాడో లేదో తెలియదు గాని సాయి కరిగిపోయాడు. వారు సాయిని ప్రార్థించి బిడ్డ వద్దకు వెళ్ళారు. ఆ బిడ్డ అక్కడ లేదు. వారు గాబరాపడ్డారు. చుట్టూ చూడగా అక్కడికి దగ్గరలోనే ఇతర చిన్న పిల్లలతో ఆడుకుంటోంది వారి పసి బిడ్డ. ఆ తల్లిదండ్రుల కృతజ్ఞతా పూర్వక ఆనంద భాష్పాలు సాయినాథుని పాదయుగళిని కడిగివేస్తాయని అనిపించింది చూచు వారలకు !

- యం.పి.సాయినాథ్

## చెలి చిట్కా

✦ అరటికాయ ముక్కలుగా కోసేటప్పుడు తోలు తీసిన అరటికాయలను మజ్జిక కలిపిన నీళ్లలో ముంచండి. ఆ తర్వాత కోస్తే ముక్కలు నల్లబడవు.

# సమగ్ర మార్పుకు శ్రీకారం చుట్టండి !

వ్యథ



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**ప్రశ్న:** నన్ను మరణ భయం వెంటాడుతోంది. గత రెండు సంవత్సరాలుగా భయం, ఆందోళన తో బాధపడేదానిని. లిఫ్ట్, రైలులో ఎసి కోచ్, ఫైట్ ఎక్కాలంటే విపరీతమైన భయం అవహించేది అందులో ఊపిరి ఆడకుండా పోతుం దన్న ఆందోళన ఉండేది. ప్రక్కన ఎవరైనా తోడు ఉండి ధైర్యం చెప్పి తీసుకెళితే, శరీరం అంతా చవాటపట్టేది. గుండె వేగంగా కొట్టుకోవడంతో పాటు పెదాలు తడారిపోయేవి. దీంతో నేను లిఫ్ట్, ఎసి కోచ్, ఫైట్ ఎక్కడం పూర్తిగా మానేశాను. అయితే గత మూడు నెలల నుంచి ఎవరైన బంధువులు సన్నిహితులు చని పోయిన వార్త వినగానే గుండె వేగంగా కొట్టుకోవడం, చెమట పట్టడం తదితర లక్షణాలు ఆవహించేవి. 10 రోజుల క్రితం మా నాన్నమ్మ చనిపోయారు. ఆమె మా అందరితో మాట్లాడుతు హఠాత్తుగా క్రిందపడి పోయారు. ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయించినా ప్రయోజనం లేకపోయింది. రెండు రోజులు వెంటిలేటర్స్ సహాయంతో ఉండి చనిపోయారు. అప్పటినుంచి నాలో భయం, ఆందోళన అధికం అయ్యింది. నేను కూడ చనిపోతానేమో అన్నీ అనుమానం వెంటాడు తున్నది. రాత్రుల్లో నిద్ర పట్టడం లేదు. భోజనం సహించడం లేదు. డాక్టరు వద్దకు వెళ్ళి పరీక్షలు చేయించుకున్నాను.అన్నీ నార్మల్‌గానే ఉన్నాయని చెప్పారు. అధిక బరువు విటమిన్‌ల లోపం ఉందని చెప్పారు. బరువు తగ్గడానికి వ్యాయామాలు చేయమని చెప్పి, విటమిన్ లోపం తగ్గడానికి మందులు రాసిచ్చారు. మందులు వాడుతూ సైకాలజిస్టు ద్వారా కౌన్సెలింగ్ తీసుకోమని డాక్టరు సలహా ఇచ్చారు. నా వయస్సు 35 ఏళ్ళు, ఎంబిఎ చదివి ఓ కంపెనీలో పనిచేస్తున్నాను. నా ఎత్తు 56 అడుగుల రెండు అంగుళాలు బరువు 83 కిలోలు ఉన్నాను. మూడేళ్ళ క్రితం పెళ్లయింది. ఇంకా పిల్లలు కలుగలేదు. నా భర్త ముంబాయిలో పని చేసునఓతన్నారు. వారం తేదా రెండు వారాలకు ఒకసారి వచ్చి రెండు రోజులుండి వెళతారు. ఈ పరిస్థితులలో నేను అందరిలా ఉండేందుకు తగిన సలహా ఇవ్వండి.

- ఒక సోదరి, విజయవాడ



**జవాబు :** అమ్మా మీరు అనవసర భయం, ఆందోళనకు గురవుతున్నారు. అలాగే ఫోబియాతో బాధపడుతున్నారు. ఇటీవల అవి పెరిగి మరణ భయానికి దారితీశాయి. దీనికి పలు అంశాలు కారణం కావచ్చు. తొలి నుంచి మీరు మెతక స్వభావికావచ్చు. నమ్మకాలు సెంటిమెంట్లు పెంచి పోషించుకుని ఉండవచ్చు. బాల్యంలో ఏదైనా చేదు అనుభవం ఎదురై ఉండవచ్చు. దీనికి తోడు చదువు, పెళ్ళి, ఉద్యోగం, ఇతర అంశాల వల్ల ఒత్తిడిని ఎదుర్కొని ఉండ వచ్చు. ఇవన్నీ మానిసిక పరమైన అంశాలు అలాగే అధిక బరువు, విటమిన్ల లోపం మీ శారీరక సామర్థ్యాలపై ప్రతి కూల ప్రభావం చూపుతున్నది. అలాగే భర్త దూరంగా ఉండటం, పిల్లలు లేకపోవడం వల్ల అసంతృప్తి, నిరాశ, నిస్పృహకు గురవుతున్నారు. అన్నీ వెరసి మీ మానసిక స్థితిని చాల బలహీన వరిచాయి. కాబట్టి తక్షణం సైకాలజిస్టును కలసి కౌన్సెలింగ్ తీసుకోండి. కాగ్నెటివ్ బిహేవియర్ థెరపి, రిలాక్సేషన్ పద్ధతుల ద్వారా మీలో ఆత్మవిశ్వాసం, తట్టుకునే శక్తిని పెంచుతారు. అవసరం అయితే హిప్నో థెరపి చేసి భయం, ఆందోళన ఫోబియా తగ్గిస్తారు. డాక్టరు సలహా పాటిస్తూ మందులు వాడుతూ, వ్యాయామాలు చేస్తూ శారీరక శక్తిని పెంచుకోండి. పిల్లలు పుట్టకపోవడానికి కారణం తెలుసుకోండి. మీ భర్తతో సాన్నిహిత్యం పెంచుకునే మార్గం అన్వేషించండి. మొత్తం మీద జీవనశైలిని మార్చుకుని సంబంధ బాంధ్యవ్యాలను పెంచుకోవడానికి కృషి చేయండి. మీ సమస్య తగ్గి పోతుంది.

# వరల్డ్ నం.1కు చేరువైన స్మృతి




## ఐసిసి ర్యాంకింగ్స్‌లో 2వ ర్యాంక్‌లోకి దూసుకొచ్చిన స్టార్

**ఢిల్లీ:** భారతస్టార్ బ్యాటర్ స్మృతి మంధాన నంబర్‌వన్ ర్యాంక్‌కు మరింత చేరువైంది. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా సూపర్‌ఫామ్ కొనసాగిస్తున్న స్మృతి తాజా ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే ర్యాంకింగ్స్‌లో రెండో ర్యాంక్‌కు దూసుకొచ్చింది. ఇటీవల ఐర్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో ఓ సెంచరీ సహా అర్ధ సెంచరీతో రాణించిన స్మృతి 738 పాయింట్లతో ఒక ర్యాంక్ మెరుగుపర్చుకుని టాప్-10లో కొనసాగుతున్న ఏకైక భారత బ్యాటర్‌గా నిలిచింది. దక్షిణాఫ్రికా బ్యాటర్ లారా వోల్వార్డ్ 773 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. తొలి సెంచరీతో ఆకట్టుకున్న జెమీమా రోడ్రిగ్స్ రెండు ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని 17వ ర్యాంక్‌కు చేరుకోగా, హర్మన్ ప్రీత్ కౌర్ 15లో ఉంది. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దీప్తిశర్మ 680 పాయింట్లతో ఒక ర్యాంక్ ఎగబాకి నాలుగులో నిలిచింది. సోఫీ ఎకల్‌స్టోన్ 770 పాయింట్లతో టాప్‌లో ఉంది. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో దీప్తిశర్మ 344 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో ఉంది.

# ఐసిసి టాప్ ర్యాంకుల్లో బుమ్రా, జడేజా

## దిగజారిన రోహిత్ శర్మ



**ఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా హవా కొనసాగుతున్నాడు. ఐసీసీ బుధవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో బుమ్రా 904 పాయింట్లతో తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024-25 సిరీస్‌లో బుమ్రా అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. మొత్తం 5 టెస్టుల్లో 13.06 సగటుతో 32 వికెట్లు సాధించి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా బుమ్రా నిలిచాడు. ఈ క్రమంలోనే తన టెస్టు రేటింగ్ పాయింట్స్‌ను బుమ్రా మెరుగుపరుచుకున్నాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్‌లో బుమ్రా తర్వాత స్థానాల్లో వరుసగా ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ (841), సౌతాఫ్రికా స్టార్ పేసర్ కగిసోరబాడ (837) కొనసాగుతున్నారు. మరోవైపు ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ ప్లేయర్ రవీంద్ర జడేజా తన అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకున్నా డు. జడేజా ఖాతాలో ప్రస్తుతం 400 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో జడేజా పర్వా లేదన్పించాడు. మిగితా ప్లేయర్లతో పోలిస్తే కాస్త మెరుగ్గానే కన్పించాడు. ఈ సిరీస్‌లో మొత్తం ఐదు మ్యాచ్‌లు ఆడిన జడ్డూ 27 సగటుతో 135 పరుగులు చేశాడు. జడేజా తర్వాత స్థానాల్లో ప్రోటీస్ ఆల్‌రౌండర్ మార్కో జాన్సెన్ (294), బంగ్లా ప్లేయర్ మెహిదీహసన్ (294) నిలిచారు. ఇక బ్యాటర్ల ర్యాంకింగ్స్ విషయానికి వస్తే టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ర్యాంక్ మరింత దిగజారింది. రోహిత్ ఒక స్థానం దిగజారి 43వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. కాగా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌లో రోహిత్ శర్మ తీవ్ర నిరాశపరిచాడు. అటు కెప్టెన్సీ, ఇటు బ్యాటింగ్ పరంగా రోహిత్ శర్మ పూర్తిగా తేలిపోయాడు. ఐదు ఇన్నింగ్స్‌లో కేవలం 31 పరుగులు మాత్రమే చేశాడు. రోహిత్ తన ఫామ్‌ను తిరిగి పొందేందుకు 10 ఏళ్ల తర్వాత రంజీల్లో ఆడనున్నాడు.

# వెస్టిండీస్‌కు బంగ్లాదేశ్ షాక్

## 60 పరుగుల తేడాతో ఘన విజయం

**ఢిల్లీ:** బంగ్లాదేశ్ మహిళల క్రికెట్ జట్టు వెస్టిండీస్‌కు షాకిచ్చింది. ఐసీసీ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగిన వన్డే మ్యాచ్‌లో 60 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఏ ఫార్మాట్లో అయినా బంగ్లాదేశ్‌కు వెస్టిండీస్‌పై ఇదే తొలి గెలుపు. ఈ గెలుపుతో బంగ్లాదేశ్ వన్డే ప్రపంచ కప్‌కు నేరుగా అర్హత సాధించే అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఈ ప్రపంచ కప్ ఫైనల్‌కు అర్హత సాధించేందుకు బంగ్లాదేశ్ ఒకే ఒక మ్యాచ్ దూరంలో ఉంది. మ్యాచ్ విషయానికి వస్తే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్, బంగ్లాదేశ్ జట్ల మధ్య రెండో వన్డే జరిగింది. ఈ మ్యాచ్‌లో విండీస్‌కు ఊహించని పరాభవం ఎదురైంది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 48.5 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ నిగార్ సుల్తానా (68) బాధ్యతాయుతంగా ఆడి తమ జట్టుకు గౌరవప్రదప్రమైన స్కోర్ అందించింది. శోభన మోస్తరి (23), షో ర్నా అక్తెర్ (21) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. వీరు మినహా బంగ్లా



ఇన్నింగ్స్‌లో ఒక్కరు కూడా కనీసం 20 పరుగుల మార్కును దాటలేదు. ఫర్జానా హాక్ 18, ముర్షిదా ఖాతూన్ 12, షిర్మన్ అక్తెర్ 11, ఫహిమా ఖాతూన్ 4, రబేయా ఖాన్ 1, నహీదా అక్తెర్ పరుగులు చేశారు. విండీస్ బౌలర్లలో కరిష్మా రామ్హారాక్ 4 వికెట్లు తీయగా, ఆలియా అలెన్ 3, డియాండ్రా డొట్టిన్, ఫ్రేసర్, అఫీఫ్లెచర్ తలో వికెట్ దక్కించుకున్నారు. అనంతరం బరిలోకి దిగిన వెస్టిండీస్ 35 ఓవర్లలో 124 పరుగులకే చాప చుట్టేసింది. బంగ్లా బౌలర్లు మరుఫా అక్తెర్ (8-0-35-2), నహీదా అక్తెర్ (10-0-31-3), రబేయా ఖాన్ (8-0-19-2), ఫహీమా ఖాతూన్ (5-0-17-2) రెచ్చిపోయి బౌలింగ్ చేశారు. వీరి ధాటికి పటిష్టమైన విండీస్ బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలింది. విండీస్ ఇన్నింగ్స్‌లో షెర్మైన్ క్యాంపబెల్ (28) టాప్ స్కోరర్‌గా నిలువగా, కెప్టెన్ హేలీ మాథ్యూస్ (16), ఆలియా అలెన్ (15), చెర్రీ ఫ్రేసర్ (18 నాటౌట్), కరిష్మ రామ్హారాక్ (13) రెండంకెల స్కోర్లు చేశారు. ఈ గెలుపుతో బంగ్లాదేశ్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో విండీస్ ఆధిక్యాన్ని తగ్గించింది. ప్రస్తుతం ఇరు జట్లు చెరో విజయంతో సమంగా నిలిచాయి. తొలి వన్డేలో వెస్టిండీస్ 9 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను మట్టి కరిపించింది. చివరి వన్డే 24న జరుగనుంది.



# ఛాంపియన్స్ ట్రోఫీలో.. ఇద్దరు కెప్టెన్లే సక్సెస్

## టీమిండియాకు 9మంది సారథ్యం

## గంగూలీ, ధోనీ నాయకత్వంలో గెలుపు

## రెండు సార్లు మాత్రమే ఛాంపియన్‌గా భారత్

**ఢిల్లీ:** ఛాంపియన్స్ట్రోఫీ-2025లో భాగంగా అన్ని జట్లు పూర్తి సన్నద్ధం అవుతున్నాయి. ఈ క్రమంలో పాకిస్తాన్ జట్టు తప్ప మిగతా అన్ని జట్లు తమస్క్వాడ్‌లను ప్రకటించాయి. అయితే ఇప్పటి వరకూ జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియాకు పలువురు నాయకత్వం వహించారు. ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొన్న భారత్ జట్టుకు మొత్తం 9 మంది కెప్టెన్లుగా వ్యవహరించారు. వీరిలో సౌరభ్ గంగూలీ మూడు సార్లు, ఎంఎస్ ధోనీ రెండు సార్లు ఛాంపియన్ ట్రోఫీకి టీమిండియాకు కెప్టెన్సీ బాధ్యతలు నిర్వర్తించారు. అయితే 9 మంది భారత్ కెప్టెన్ల హయంలో కేవలం ఇద్దరు కెప్టెన్లు మాత్రమే ట్రోఫీని గెలిచి టీమిండియాను విజేతగా నిలిపారు. ఛాంపియన్స్ ట్రోఫీ తొలి ఎడిషన్‌లో టీమిండియాకు మహ్మద్ అజారుద్దీన్ నాయకత్వం వహించాడు. 1998లో భారత జట్టు సెమీ ఫైనల్ వరకూ చేరుకుంది. ఈ టోర్నీలో వెస్టిండీస్ చేతిలో భారత్ 6వికెట్ల తేడాతో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. 2000 ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టుకు సౌరవ్ గంగూలీ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ ఎడిషన్‌లో, జట్టు ఫైనల్‌కు చేరుకుంది. అక్కడ న్యూజిలాండ్ నాలుగు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఇక 2002లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఎడిషన్‌లో సౌరవ్ గంగూలీ టీమిండియాకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ ఎడిషన్‌లో, భారత్ ఫైనల్స్‌కు చేరుకుంది. అక్కడ శ్రీలంకతో టైటిల్ పోరు జరిగింది. కానీ, ఫైనల్ ఫలితం ప్రకటించలేదు. దీని కారణంగా రెండు జట్లు ఉమ్మడి విజేతలుగా నిలిచాయి. 2004 ఎడిషన్‌లో సౌరవ్ గంగూలీ కూడా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇక్కడ భారత ప్రదర్శన చాలా నిరాశపరిచింది. జట్టు ఏడో స్థానంలో నిలిచింది. అలాగే 2006 ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియాకు రాహుల్ ద్రవిడ్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతని నాయకత్వంలో జట్టు 5వ స్థానంలో నిలిచింది. 2009 ఎడిషన్‌లో ఎంఎస్ ధోని భారత్ జట్టుకు నాయకత్వం వహించాడు. కానీ, అతని కెప్టెన్సీలో కూడా జట్టు 5వ స్థానంలో కొనసాగింది. తదుపరి 2013లో ఎంఎస్ ధోనీ సారథ్యంలో భారత జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను గెలుచుకుంది. ఫైనల్లో భారత్ ఐదు వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. 2017 ఎడిషన్‌లో, విరాట్ కోహ్లి జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి జట్టును ఫైనల్స్‌కు తీసుకెళ్లాడు. అక్కడ, పాకిస్తాన్ టైటిల్ గెలవాలనే భారత్ కలను విచ్ఛిన్నం చేసింది. దీంతో భారత్ 180 పరుగుల తేడాతో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. 2017 తర్వాత, ఇప్పుడు అంటే 2025లో, 8 ఏళ్ల నిరీక్షణ తర్వాత, ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహించబోతున్నారు. ఇందులో రోహిత్ శర్మ టీమిండియాకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ సారి ఎలాగైనా ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకోవాలనే పట్టుదలతో టీమిండియా సన్నద్ధమవుతోంది.

# సాత్విక్, చిరాగ్ జోడీ శుభారంభం

## మహిళల డబుల్స్‌లో అశ్విని, తనీషా గెలుపు

**ఢిల్లీ:** ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురవుతున్నాయి. పురుషుల, మహిళలడబుల్స్ విభాగంలో భారత్ ఆటగాళ్లు దూసుకుపోతున్నారు. పురుషుల డబుల్స్ విభాగంలో భారత్‌కు చెందిన సాత్విక్ సాయి రాజ్-చిరాగ్ శెట్టి జోడీ శుభారంభం చేసింది. జకార్తాలో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-16, 21-15తో చైనీస్ తైపీకి చెందిన చెన్ జి రే-లిన్ యు చియె జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 30 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత



జోడీకి ప్రతిఘటన ఎదురైనా కీలక దశల్లో పాయింట్లు నెగ్గి విజయాన్ని ఖరారు చేసుకుంది. ఇక మహిళల డబుల్స్‌లో భారత్‌కు చెందిన తనీషా క్రాస్టో-అశ్విని పొన్నప్ప జంట కూడా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. తొలి రౌండ్లో తనీషా-అశ్విని ద్వయం 21-6, 21-14తో థాయాలాండ్‌కు చెందిన ఒర్నిచా జోంగ్సతాపోర్న్-సుకిత్త సువాచాయ్ జంటపై గెలిచింది. కాగా సింగిల్స్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్‌లో హైదరాబాద్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్‌కు చుక్కెదురైంది. భారత్‌కే చెందిన ఆయుశ్ శెట్టితో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 7-21, 15-21తో ఓడిపోవడం గమనార్హం. కాగా మహిళల క్వాలిఫయింగ్ తొలి రౌండ్లో తాన్యా హేమంత్ 16-21, 21-17, 21-15తో చైనీస్ తైపీకి చెందిన టుంగ్ సియోటాంగ్‌పై నెగ్గి మెయిన్ డ్రాకు అర్హత పొందింది. మరోమ్యాచ్‌లో ఇషారాణి బారువా 18-21, 20-22తో ఇండోనేసియాకు చెందిన చియారామార్వెలా హాండాయో చేతిలో ఓడిపోయి మెయిన్ డ్రాకు చేరుకోవడంలో విఫలమైంది.

# వాణిజ్యం


# ఇన్ఫీలో మూర్తి ఫ్యామిలీ కంటే ఎల్ఐసికే రెట్టింపు వాటా

**ముంబై, జనవరి 22:** ఇన్ఫోసిస్ నారాయణమూర్తి కుటుంబానికి ఉన్న సమష్టి హోల్డింగ్స్ వారి శాశ్వత వారసత్వాన్ని, కంపెనీ పథంలో గణనీయమైన ప్రభావాన్ని కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నారు. కేవలం రిటైలర్లే కాకుండా ఇన్వెస్టింగ్ సంస్థలు చాలాకాలం నుంచే ఈ రంగంలో వాటా కొనుగోలు చేస్తున్నాయి. ఇన్ఫోసిస్‌లో మూర్తి కుటుంబానికి ఉన్న వాటాకంటే కూడా రెట్టింపు వాటాను హోల్డ్ చేస్తున్న సంస్థలున్నాయి. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి కుటుంబానికి కంపెనీలో గణనీయమైన వాటా ఉంది. తాజా నివేదికల ప్రకారం తన కుటుంబం మొత్తం హోల్డింగ్స్ సుమారు 4.02శాతం ఉన్నాయి. నారాయణమూర్తికి 0.36శాతం, ఆయన భార్య సుధామూర్తికి 0.93 శాతం, వారి పిల్లలు అక్షతమూర్తికి 1.05 శాతం, రోహన్ మూర్తికి 1.46శాతం వాటా ఉంది. నారాయణ మూర్తి మనవడు నాలుగేళ్ల ఏకగ్రహ మూర్తికి కూడా తన తాత ఇటీవల షేర్లను బహుమతిగా ఇవ్వడంతో 0.04శాతం వాటా ఉంది. వ్యూహాత్మక పెట్టుబడుల్లో భాగంగా లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) ఇన్ఫోసిస్‌లో భారీగా పెట్టుబడి పెట్టింది. ఇన్ఫోసిస్‌లో ఏకంగా 9.531శాతం వాటాను ఎల్ఐసి హోల్డ్ చేస్తోంది. దీని విలువసుమారు రూ.8,694 కోట్లు. ఈ పెట్టుబడి ద్వారా ఎల్ఐసి భవిష్యత్తులో ఇన్ఫోసిస్ సామర్థ్యం పట్ల నమ్మకంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎల్ఐసి ఇన్వెస్ట్‌మెంట్ వల్ల ప్రపంచ ఐటి రంగంలో కంపెనీ పాత్ర ఎలా ఉండబోతుందో తెలుస్తోంది. ఇన్ఫోసిస్‌తో ఎల్ఐసి భాగస్వామ్యం కేవలం ఆర్థిక పెట్టుబడులకు పరిమితం కాలేదు. సంస్థ అందించే సేవల్లోనూ ఇరు కంపెనీల సహకారం ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ సర్వీసుల్లో ఇన్ఫోసిస్ నైపుణ్యం ద్వారా ఎల్ఐసి నిర్వహణ సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంతో డైవ్ అనే డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇనిషియే టివ్‌పై ఈ రెండు కంపెనీలు కలిసి పని చేశాయి.




## అమెరికా చమురు ఎగుమతులు పెంపు

**వాషింగ్టన్, జనవరి 22:** అమెరికా అధ్యకుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత యుఎస్ కీలక ప్రకటనలుచేస్తోంది. యునైటెడ్ స్టేట్స్ తన ఇంధన ఎగుమతులను పెంచబోతున్నట్లు తెలిపింది. దాంతో ప్రపంచ చమురు, గ్యాస్ మార్కెట్ గణనీయంగా ప్రభావితం చెందుతుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అమెరికా తీసుకున్న ఈ చర్య ధరలను తగ్గిస్తుందని, సరఫరాను పెంచుతుందని, ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు ఉపశమనం కలిగిస్తుందని అంచనా వేస్తున్నాయి.అమెరికా చమురు, గ్యాస్ ఉత్పత్తిని పెంచేందుకు సిద్ధమవుతోంది. చమురు డ్రిల్లింగ్‌ను ప్రోత్సహించడం, గతంలో ఉన్న అంక్షలను ఎత్తివేయడం, ఇంధన ఎగుమతులను పెంచడం వంటి ప్రణాళికలను డొనాల్డ్ ట్రంప్ వివరించారు. ఈ వ్యూహం ప్రపంచ చమురు మార్కెట్లో అమెరికాను టాప్ నిలిపేందుకు దోహదం చేస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. యూఎస్ ఇంధన ఎగుమతుల పెరుగుదల మార్కెట్లో ఒపెక్ ప్లస్ నియంత్రణను కట్టడి చేస్తుందని నిపుణులు భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లోకి మరిన్ని చమురు, గ్యాస్ సరఫరాదారులు ప్రవేశించడంతో ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. ముడిచమురు ధరలు తగ్గడం వల్ల దిగుమతి



ఖర్చులు తగ్గుతాయని, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించవచ్చని భారత్ వంటి దేశాలకు ఇది ప్రయోజనం చేకూరుస్తుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. దీర్ఘకాలంలో యూఎస్ చమురు ఉత్పత్తి ఒపెక్ ప్లస్, ఇతర ఉత్పత్తిదారుల వ్యూహాల పునఃసమీక్షకు దారితీస్తుంది. పెరిగే యుఎస్ చమురు ఎగుమతులు ఇతర ప్రాంతాలకు సరఫరాదారులను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. ఇది ధరల స్థిరత్వానికి మరింత సహాయం చేస్తుంది.

## హైదరాబాద్‌లో హెచ్‌సిఎల్ టెక్ విస్తరణ

**హైదరాబాద్, జనవరి 22:** దావోస్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం అనేక పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఈ క్రమంలో అనేక భారతీయ కంపెనీలతో పాటు ఇతర దేశాలకు చెందిన కంపెనీల నుంచి కూడా పెట్టుబడులను రాబట్టే పనిలో సీఎంఓ టీమ్ గట్టిగా కృషి చేస్తోంది. దీంతో వరుసగా ఎంవోయూలు కుదుర్చుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి బిజీబిజీగా ఉన్నారు. దేశంలోని టాప్5 ఐటీ కంపెనీల్లో ఒకటిగా ఉన్న ప్రముఖ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సిఎల్ ఈ క్రమంలో తన వ్యాపారాన్ని హైదరాబాదులో మరింతగా విస్తరించాలని చూస్తోంది. ఇందులో భాగంగానే కొత్త టెక్ సెంటర్‌ను ప్రారంభించడం ద్వారా హైదరాబాద్‌లో తన గ్లోబల్ డెలివరీని పెంచాలని నిర్ణయించింది. దావోస్ వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబును కలిసిన హెచ్‌సిఎల్ సీఈవో, ఎండీ విజయకుమార్ ఈ మేరకు కొత్త పెట్టుబడి నిర్ణయాన్ని ప్రకటించారు. హైదరాబాదులో కొత్తగా ఏర్పాటు చేయనున్న సెంటర్, హైటెక్, లైఫ్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి పరిశ్రమల్లోని గ్లోబల్ క్లయింట్‌లకు అత్యాధునిక క్లౌడ్, ఏఐ అండ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ పరిష్కారాలను అందిస్తుందని కంపెనీ వెల్లడించింది. టెక్ కంపెనీకి హైటెక్ సిటీలో ఉన్న క్యాంపస్ కొత్తగా 5,000 మంది ఐటీ ఉద్యోగులకు అవకాశాన్ని కల్పిస్తుందని తెలుస్తోంది. ఇది ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుండి గోల్డ్ సర్టిఫికేషన్‌తో రావటం స్థిరమైన వ్యాపార పద్ధతులపై కంపెనీకి ఉన్న నిబద్ధతను నొక్కి చెబుతోందని తెలుస్తోంది. ప్రస్తుతం హైదరాబాదునగరం ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు అత్యధిక టాలెంట్ కలిగిన టాలెంట్ అందుబాటులో ఉందని సీఈవో విజయకుమార్ పేర్కొన్నారు. ఇది కంపెనీకి వ్యూహాత్మకంగా కీలకమైన స్థానంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. కొత్త కేంద్రం తమ ప్రపంచ క్లయింట్ స్థావరానికి అత్యాధునిక సామర్థ్యాలను తీసుకువస్తుందని, స్థానిక సాంకేతిక పర్యావరణ వ్యవస్థకు దోహదపడుతుందని పేర్కొన్నారు. వచ్చే నెలలో ఈ కేంద్రాన్ని ముఖ్యమంత్రి, ఐటీ మంత్రుల చేతుల మీదుగా ప్రారంభించబడుతుందన్నారు. టెక్ దిగ్గజం హెచ్సీఎల్ టెక్ తీసుకున్న పెట్టుబడి నిర్ణయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయిలో ఐటీ రంగంలో హైదరాబాదును మరింతగా ముందుకు తీసుకెళ్లటానికి ఇది దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాలను ప్రోత్సహించడానికి హైదరాబాద్‌లోని టెక్, ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేసి టైర్ 2, 3 నగరాలకు విస్తరించటంపై తాము దృష్టిసారించినట్లు ఐటీ మంత్రి శ్రీధర్ బాబు నొక్కి చెప్పారు.




## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జనవరి 22:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం లాభాల్లో ముగిసాయి. ఐటి, ప్రైవేట్ బ్యాంకు షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో నాటి షాక్ నుంచి తేరుకున్నాయి. ఉదయం 76,114.42 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఉదయమంతా స్వల్ప లాభాలకే పరిమితమైన సూచి, ఓ దశలో స్వల్పంగా నష్టపోయింది. చివరి గంటన్నరలో కొనుగోళ్ల ఉత్సాహంతో సెన్సెక్స్ 566.63 పాయింట్ల లాభంతో 76,404.99 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 130.70 పాయింట్లు లాభపడి 23,155.35 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.25 పైసలు లాభపడి రూ.86.33 వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్, టిసిఎస్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టాటా మోటార్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, యాక్సిస్ బ్యాంకు, ఎస్‌బిఐ, ఎన్‌టిపిసి వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి.



అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ 79.64 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 2771 డాలర్ల స్థాయికి చేరింది.

## రూపాయి పడినా ఇంకా విలువైనదే.. రాజన్


**న్యూఢిల్లీ, జనవరి 22:** అమెరికా డాలర్స్‌తో రూపాయి మారకం విలువ ఇటీవల భారీగా క్షీణిస్తోంది. అయినా అంతర్జాతీయ మార్కెట్లో ఇతర పోటీ కరెన్సీలతో రూపాయి ఇంకా అధిక విలువ ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ (రాజన్) పేర్కొన్నారు. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఇఎఫ్)లో రూపాయి భవిష్యత్తు గమనంపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. అమెరికా డాలరుతో ప్రస్తుత రూపాయి మారకం క్షీణించడాన్ని ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదని రాజన్ అన్నారు. అనేక ఇతర కరెన్సీలు కూడా ఇదే ధోరణిని కలిగి ఉన్నాయి. ఇతర కరెన్సీలతో ప్రస్తుత రూపాయి ఎఫెక్టివ్ ఎక్స్ఛేంజ్ రేట్ (ఆర్ఈఈఆర్) ఇప్పటికీ అధిక విలువను సూచిస్తోంది. ఈ ఓవర్ వాల్యుయేషన్ రూపాయి మరింత పతనం అయ్యేందుకు అవకాశం ఉందని సూచిస్తున్నట్లు అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా ఇతర కరెన్సీలతో ప్రస్తుత రూపాయి అధిక విలువ కలిగి ఉండటం వల్ల భవిష్యత్తులో భారతీయ ఎగుమతులకు ప్రయోజనం చేకూరుతుంది. రూపాయి విలువను కాపాడేందుకు కరెన్సీ మార్కెట్లో ఆర్బీఐ జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని రాజన్ అన్నారు. ప్రాథమిక ఆర్థిక సర్దుబాట్లకు ప్రతిస్పందనగా, కరెన్సీ విలువను పెంచేలా కేంద్ర బ్యాంకులు నిర్వహించడం మానుకోవాలని, స్వల్పకాలిక అస్థిరతను అరికట్టడానికి మాత్రమే చర్యలు తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. రూపాయిక్షీణత, అమెరికా డాలర్ బలపడటం, ఇతర ప్రపంచ ఆర్థిక అంశాలు సహజ మార్కెట్ ప్రతిస్పందనగా భావించాలని రాజన్ అన్నారు. ప్రపంచ కరెన్సీలను అమెరికా ఆయుధంగా మార్చుకునే అవకాశం ఉందని రాజన్ హెచ్చరిక.



ఇతర దేశాలపై ఆర్థిక సుంకాలు విధించడానికి అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించుకోవద్దని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కరెన్సీలపై పెరుగుతున్న ఈఆర్థిక యుద్ధం ప్రపంచ వ్యాప్తంగా కేంద్ర బ్యాంకర్లకు ఆందోళన కలిగిస్తోంది.

## డెంటా వాటర్ సక్సస్‌ఫుల్ ఐపిఒ

**ముంబై, జనవరి 22:** వాటర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సొల్యూషన్ కంపెనీ డెంటా వాటర్ పబ్లిక్‌ఇష్యూ బిడ్డింగ్ మొదలైన క్షణాల్లో పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. బుధవారం ఉదయం దీని సబ్‌స్క్రిప్షన్ మొదలైంది. ఎన్ఎస్ఇ డేటా ప్రకారం, ఇష్యూలో భాగంగా 52.50 లక్షల షేర్లను ఆఫర్ చేయగా, 91.64,450 షేర్లకు బిడ్లు నమోదయ్యాయి. ఈ కంపెనీ ఐపిఒ ద్వారా రూ.220.50 కోట్ల నిధుల్ని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా 75,00,000 తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. రూ.279-294ను ధరల శ్రేణిగా నిర్ణయించింది. బుధవారం ఉదయం ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కాగానే ఎన్ఐఐ కోటా నుంచి మంచి డిమాండ్ అందుకుంది. 10.46 గంటల సమయానికి ఎన్ఐఐ కోటా 2.6 రెట్లు సబ్‌స్క్రైబ్ కాగా, రిటైల్ పోర్షన్ 2.38 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయింది. తన పబ్లిక్ ఇష్యూకు ముందు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.66 కోట్లు సమీకరించింది. జనవరి 24 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉండనుంది. దీంతో మరిన్ని బిడ్లు దాఖలయ్యే అవకాశం ఉంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం ఒక్క లాట్ కోసం రూ.14,700 వెచ్చించాలి. జనవరి 29న కంపెనీ షేర్లు లిస్టింగ్ కానున్నాయి. పబ్లిక్ ఇష్యూ ద్వారా వచ్చిన నిధుల్ని రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం ఉపయోగించనుంది. 2016లో స్థాపించిన డెంటా వాటర్ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ లిమిటెడ్ ఇంజినీరింగ్, ప్రొడ్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ సేవల రంగంలో వ్యాపారాలు చేస్తోంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.